




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లు వ్యతిరేకిస్తూ.. ప్రతిపక్ష ఎంపిల నిరసన

వాణిజ్య గ్యాస్ ధర భారీగా పెంపు

యుపి, మణిపూర్‌లా తమిళనాడులో హింసను సృష్టించేందుకు బిజెపి కుట్ర **05**



సంపుటి 28, సంచిక: 278 | గురువారం | 02-04-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00




ఎపి రాజధాని అమరావతికి

## చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం

వైఎస్ఆర్ కాంగ్రెస్ మినహా అన్ని పార్టీల తోడ్పాటు

నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మినహా అన్ని పార్టీల ఎంపిలూ ముక్తకంఠంతో సమ్మతి తెలిపారు. లోక్‌సభ ఆమోదంతో ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ విభజనచట్టం 2014లోని సెక్షన్ 5(2)కు సవరణ చేస్తూ కేంద్ర హోంశాఖ రూపొందించిన బిల్లును ఆ శాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సభ్యుల సమ్మతితో స్పీకర్ ఓం బిర్లా బిల్లుపై చర్చకు అనుమతించారు. అమరావతికి చట్టబద్ధత బిల్లుపై లోక్‌సభలో దాదాపు 2 గంటల పాటు చర్చ సాగింది. 13 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. వైసిపి మినహా ఇతర రాజకీయ పార్టీల ఎంపిలందరూ ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత బిల్లుకు సానుకూలంగా మాట్లాడారు. బిల్లుకు మద్దతిస్తున్నట్లు బిజెపి, కాంగ్రెస్, తెలుగుదేశం, జనసేన, సమాజ్‌వాదీ, ఉద్ధవ్ శివసేన, శరద్‌పవార్ ఎన్‌సిపి పార్టీల సభ్యులు ప్రకటించారు. బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలిపిన వైసిపి ఎంపిలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. సభ్యుల ప్రసంగాల అనంతరం సభాపతి బిల్లు ఆమోదానికి అనుమతి కోరగా అందరూ సమ్మతి తెలియజేశారు. దీంతో అమరావతికి

తరువాయి 12లో




# కార్మికులకు బ్లాక్ డే

- నూతన కార్మిక చట్టాలను రాష్ట్రంలో అమలు చేయొద్దు : ఎఐటియుసి డిమాండ్
- కార్మికుల హక్కులను కాలరాస్తాయ్ : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులపై తీవ్రమైన దాడి అని ఎఐటియుసి నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏప్రిల్ 1 కార్మికులకు బ్లాక్ డే గా అభివర్ణించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నారాయణ గూడ చౌరస్తా నుంచి కార్మిక శాఖ కార్యాలయం (అంజయ్య భవన్) వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ, కేంద్రం అమల్లోకి తెచ్చిన

తరువాయి 2లో

జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై అమిత్ షా విమర్శలు

## న్యాయ వ్యవస్థను బెదిరించడమే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టుల హననమే లక్ష్యంగా రాజ్యాంగానికి విరుద్ధంగా ఏర్పాటు చేసిన నరహంతక అరాచక ముఠా 'సల్వాజూడుం' (ప్రైవేటు ఆర్మీ)ను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గతంలో వెలువరించిన తీర్పును ఇప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ సాక్షిగా అపహాస్యం చేయడాన్ని సిపిఐ తీవ్రంగా

తరువాయి 2లో





మోదీ సర్కారు లక్ష్యం

## ప్రజలను దోపిడీ చేయడమే

- దేశ ఆర్థిక విధానాలను నాశనం చేశారు
- ధరల పెరుగుదలపై ఖర్గే మండిపాటు
- లోక్‌సభ సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం : జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ :** దేశంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి చాలా నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ఇది బిజెపి లూట్ దివస్ అని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత్ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు సర్వ నాశనం చేయబట్టే ఈ దుస్థితి దాపురించిందన్నారు. ఈ సంక్షోభ కాలంలో దేశంలోని సామాన్యులు ఊరట కోసం ఎదురు చూస్తుంటే, బిజెపి సర్కారు మాత్రం ప్రజలను లూటీ చేయడంపై, దేశాన్ని దోపిడీ చేయడంపై పూర్తి దృష్టి పెట్టిందని ఆయన మండిపడ్డారు. ఈమేరకు బుధవారం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "దేశ వ్యూహాత్మక, ఆర్థిక విధానాలను మోదీ సర్కారు నాశనం చేసిన పర్యవసానాన్ని ఇప్పుడు 140 కోట్ల మంది భారతీయులు భరిస్తున్నారు. ఈరోజు నుంచి పలు నిత్యావసరాలు, 900కుపైగా ఔషధాల ధరలు పెరగబోతున్నాయి. దీనివల్ల ప్రజల ఆరోగ్య సంరక్షణ వ్యయాలు చుక్కలను అంటుతున్నాయి. గుండె జబ్బులు ఉన్న రోగులకు అమర్చే కరోనరీ స్టంట్ల ధరలూ పెరిగాయి. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల ధరలు రాకెట్ వేగంతో పెరుగుతున్నాయి. ఈ సిలిండర్ల సప్లై దారుణంగా తగ్గిపోయింది. దీంతో టీ రేటు, రోడ్డుపక్కన అమ్మే తినుబండారాల రేట్లు కూడా పెరిగిపోయాయి. ప్రత్యేకించి ప్రభుత్వ స్కూళ్లలో అమలుచేసే మధ్యాహ్న భోజన పథకంపైనా ప్రతికూల

తరువాయి 2లో



అకాల వర్షం

## 31,504 ఎకరాలలో పంట నష్టం

- ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- పూర్తి వివరాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం
- ఖరీఫ్ సీజన్‌లో సరిపడా ఎరువులు అందించాలని కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

అకాల వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 86 మండలాలలో 31,504 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇందులో మొక్కజొన్న 15,991 ఎకరాలు, వరి 7,839 ఎకరాలు, నువ్వులు 787 ఎకరాలు, పొద్దుతిరుగుడు 153 ఎకరాలు, జొన్న 298 ఎకరాలలో నష్టం సంభవించినట్లు అధికారులు తెలుపగా పూర్తి వివరాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయశాఖ కార్యదర్శి, హార్టికల్చర్ డైరెక్టర్ సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సహజ వ్యవసాయం ప్రోత్సాహం, పంట మార్పిడి, వ్యవసాయ యాంత్రీకరణ, రాష్ట్రంలో యూరియా నిల్వలు, ఇటీవల కురిసిన వర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై సమగ్రంగా చర్చించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా రాష్ట్రంలోని యూరియా నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని వ్యవసాయ శాఖ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. ఇటీవల వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్, ఢిల్లీలోని కేంద్ర అధికారులను కలవడంతో రాష్ట్రానికి ఏప్రిల్ నెలలో 2 లక్షల మెట్రిక్

తరువాయి 12లో

నేటి నుంచి ఐదు మండలాల్లో

## భూభారతి పోర్టల్

ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నట్లు మంత్రి పొంగులేటి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులకు పారదర్శకంగా,సులభతరమైనసేవలను అందిస్తూ, ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొస్తూ రూపొందించిన 'ఇంటిగ్రేటెడ్ భూభారతి'పోర్టల్‌ను గురువారం ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని ఐదు మండలాల్లో ప్రారంభించనున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లాలోని అమన్‌గల్, సంగారెడ్డి జిల్లాలోని వట్‌పల్లి, నారాయణపేట జిల్లాలోని కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, ఆయా జిల్లా కలెక్టర్లు పోర్టల్ నిర్వహణ పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌కు సంబంధించి రెవెన్యూ అధికారులతో బుధవారం టెలికాన్ఫరెన్స్

తరువాయి 2లో

బహ్రైన్‌లో అమెజాన్‌పై

# ఇరాన్ దాడి

- 200 అమెరికా పైలట్ల ఇళ్ళపైనా బాలిస్టిక్ క్షిపణులు
- కువైట్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయిల్ స్టోరేజీ ట్యాంకులు ధ్వంసం
- లెబనాన్‌లో ఎనిమిది మంది మృతి
- ఇజ్రాయెల్‌పై 20 రాకెట్లు, డ్రోన్లతో హెజ్బొల్లా దాడి
- యుద్ధరంగంలోకి సౌదీ,యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్?

**దుబాయ్:** పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో 33వ రోజు బుధవారం ఇరాన్ ఐ.ఆర్.జి.సి (ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్) అమెకా సైనిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణితో భారీ దాడులు చేసింది. రెండు రోజులుగా ఇరాన్ హెచ్చరించిన విధంగానే అమెరికా టెక్ దిగ్గజ సంస్థలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులు దాడులు చేయడం ప్రారంభించాయి. బుధవారం రాత్రి పొద్దుపోయాక బహ్రైన్‌లో హమాలాలో ఉన్న బాటెల్కో ప్రధాన కార్యాలయంపై ఇరాన్ క్షిపణులు దాడి చేసి ధ్వంసం చేశాయి. అమెజాన్ వెబ్ సర్వీస్‌కు ఆతిథ్యం ఇస్తున్న ఈ సంస్థ బహ్రైన్‌లోనే అతిపెద్ద టెలికమ్యూనికేషన్ కంపెనీ. పశ్చిమాసియా దేశాల్లో ఉన్న గూగుల్, టెస్లా, యాపిల్, ఎన్‌విడియా, మైక్రోసాఫ్ట్ తదితర దిగ్గజ కంపెనీలతో సహా మొత్తం 18 అమెరికా సంస్థలపై కూడా దాడులు చేస్తామని ఐఆర్‌జిసి బ్రిగేడియర్ సయ్యద్ మజిద్ మౌసావి ముందునుండీ హెచ్చరించారు. అందుకు తగ్గట్టుగానే ఐఆర్‌జిసి మొట్టమొదట అమెజాన్‌పై దాడులు చేసింది. పూర్తి వివరాలు ఇంకా తెలియలేదు. దీంతోపాటే 200 మంది అమెరికా పైలట్ల నివాసాలపై దిగ్భ్రాంతి కలిగించేలా దాడులు చేసింది. కువైట్,ఖతార్‌లలో కూడా చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుని క్షిపణులతో వాటిని ధ్వంసం చేసింది. గడచిన నెలరోజులుగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియాలపైనే ఇరాన్ చాలా ఎక్కువగా దాడులు చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తూ ఉండటంతో ఈ రెండు దేశాలు అమెరికాకు మద్దతుగా ప్రత్యక్షంగా యుద్ధరంగంలోకి ప్రవేశిస్తాయని విశ్వసనీయ వార్తలు వెలువడ్డాయి. యుద్ధాన్ని రెండు వారాల్లో ముగిస్తామని ట్రంప్ చెబుతున్న తరుణంలో యుద్ధం మరింతగా విస్తృతమవుతూ ఉండటం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఇజ్రాయెల్ కూడా తాజాగా ఇరాన్ వ్యాప్తంగా విస్తారంగా దాడులు కొనసాగించి విధ్వంసం సృష్టించింది. మరోవైపు అమెరికాకు చెందిన ప్రముఖ మహిళా జర్నలిస్టు, ఫ్రీలాన్సర్ షెల్లీ కిటిల్సన్‌ను బాగ్దాద్‌లో గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు.షెల్లీ కిటిల్సన్‌కు ప్రాణాపాయం ఉందని, పశ్చిమాసియాకు



వెళ్ళవద్దని వైట్‌హౌస్ యంత్రాంగం ముందుగానే హెచ్చరికలు చేసినప్పటికీ ఆమె యుద్ధ వార్తల కోసం వెళ్ళారు. ఆమె జాడ తెలుసుకోవడంకోసం ముమ్మర గాలింపు చర్యలు కొనసాగుతుండగా, ఇజ్రాయెల్ ఉత్తర సరిహద్దుల్లో హెజ్బొల్లా ఉగ్రవాదులు హైఫా,గలిలీ సహా కీలక ప్రాంతాలపై 20 రాకెట్లు, డ్రోన్లతో భీకర దాడులు చేశారు. దీంతో ప్రజలను ఐడిఎఫ్

తరువాయి 2లో

## నీటి ఎద్దడి రానీయొద్దు

- నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గ్రామాల్లో ప్రారంభమైన 'సమ్మర్‌డ్రైవ్'
- 176 గ్రామాల్లో నీటి సమస్యలు
- నీటి ఎద్దటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోండి : మంత్రి సీతక్క



ప్రజాపక్షం/హైదరాబాద్

వేసవి నేపథ్యంలో గ్రామాలలో నీటి ఎద్దడి నివారణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 12,760 గ్రామ పంచాయతీలలో (జిపి) గత మార్చి 31వ తేదీ వరకు 10,608 గ్రామ పంచాయతీలు ఆన్‌లైన్‌లో తాగు నీటి సరఫరా వివరాలను నమోదు చేశాయి. ఇందులో 10,432 గ్రామాలకు తాగు నీరు సమృద్ధిగా అందుతుండగా, కేవలం 176 గ్రామాలలో మాత్రమే తాత్కాలిక సమస్యలు ఉన్నట్టు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బుధవారం వెల్లడించింది. మిషన్ భగీరథ ఆధ్వర్యంలో బుధవారం నుంచి (ఏప్రిల్ 1వ తేదీ) ఈ నెల 15వ తేదీ వరకు 'సమ్మర్ స్పెషల్ ఇంటెన్సివ్ డ్రైవ్'ను ప్రారంభించింది. వేసవి కాలంలో నీటి ఎద్దటి నివారణకు తక్షణమే అన్ని చర్యలూ తీసుకోవాలని, సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ

తరువాయి 12లో

తీవ్ర సంక్షోభంలో టెక్ పరిశ్రమ

## భారత్‌లో 12 వేల మంది ఒరాకిల్ ఉద్యోగులకు ఉద్వాసన

ప్రపంచవ్యాప్తంగా 30 వేలమంది తొలగింపు ● ఈ నెలాఖరులోపు మరోవిడత వేటు

**కాలిఫోర్నియా :** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన, ఇటీవల కృత్రిమ మేధలో భారీ పెట్టుబడుటు పెడుతున్న సాఫ్ట్‌వేర్ సంస్థ ఒరాకిల్ భారత్,అమెరికా సహా అనేక దేశాలలో దాదాపు 30,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ తొలగింపు భారత్‌పై తీవ్ర ప్రభావం చూపించింది. మనదేశంలో 12,000 మంది ఉద్యోగాలు కోల్పోయారు. 145 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 49 సంవత్సరాల చరిత్రగల ఒరాకిల్ మొదటిసారి భారీస్థాయిలో ఒక్క ఈ–మెయిల్‌తో ఉద్యోగులను తొలగించింది. పెట్టుబడి బ్యాంక్ టీవీ కోవెన్ సమాచారం ప్రకారం ఒరాకిల్ 30 వేలమంది ఉద్యోగులను తొలగించింది. బిజినెస్ స్టాండర్డ్ పత్రిక సమాచారం ప్రకారం ఈనెలాఖరులోపు మరోవిడత భారత్‌లో ఉద్యోగాల కోత




ఉండే అవకాశాలు ఉన్నాయి. తాజా సమాచారం మేరకు ఇఎస్‌టి కాలమానం ప్రకారం

తరువాయి 12లో

ఎక్సైజ్ శాఖకు

## రికార్డు స్థాయి ఆదాయం

తొలిసారిగా రూ.40,209 కోట్ల మార్క్ దాటిన అమ్మకాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ ఎక్సైజ్‌శాఖ ఆదాయం కొత్త రికార్డును నమోదు చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.40,209 కోట్లకు చేరి తొలిసారిగా రూ.40 వేల కోట్ల మార్క్‌ను దాటింది. 2018–19లో రూ.20,859 కోట్లుగా ఉన్న ఆదాయం కేవలం ఏడు సంవత్సరాల్లోనే రెట్టింపవడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం 2024–25లో రూ.37,487 కోట్లుగా ఉన్న మద్యం అమ్మకాలు, ఈ ఏడాది

తరువాయి 12లో

# యూరప్‌తోనే నా ప్రయాణం : స్టార్మర్



**లండన్:** పశ్చిమాసియాలో యుద్ధంలో చేరడంకంటే తనకు దేశ ప్రయోజనాలే చాలా ముఖ్యమైనవని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ మరోసారి ఉద్ఘాటించారు. స్నేహ సంబంధాల విషయంలో అమెరికా-యూరప్‌లలో ఎవరో ఒకరిని ఎంచుకోవాలని తాను కోరుకోవడం లేదని చెబుతూ, యూరప్‌వైపు మొగ్గుచూపుతున్నారు. బ్రిటన్ దీర్ఘకాలిక ప్రయోజనాలు, అవసరాలన్నీ తీరందుకు యూరప్, యూరోపియన్ దేశాల మిత్రులకు మరింత సన్నిహిత భాగస్వామిగా ఉండాలన్న విషయం రోజు రోజుకూ స్పష్టంగా తెలుస్తోందని, ఈ అవసరం పెరుగుతోందన్నారు. పశ్చిమాసియా యుద్ధంలో చేరకుండా దూరంగా ఉండిపోవడంతో అమెరికాతో బ్రిటన్ సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో కీర్‌స్టార్మర్ బుధవారం పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, దేశ ప్రయోజనాలే తనకు ముఖ్యమని ఉద్ఘాటించారు. అమెరికా-యూరప్‌ల మధ్య ఎవరిని ఎంచుకోవాలని ప్రశ్న వచ్చినప్పుడు తాను ఖచ్చితంగా ఎక్కువగా యూరప్ వైపే మొగ్గుచూపుతానని స్టార్మర్ అన్నారు. 'ట్రంప్‌తో సంబంధాలు క్షీణిస్తున్న తరుణంలో మీరు యూరప్‌తో సంబంధాలు పెంచుకోవాలనుకుంటున్నారా?' అని పాత్రికేయులు ప్రశ్నించగా, ఆ ఖండమా? ఈ ఖండమా? అనే విషయాన్ని నేను ఎంచుకోవడంలేదని, అమెరికా-యూరప్ రెండింటితో తాను బలమైన సంబంధాలు కలిగి ఉండటం మన ప్రయోజనాలకు మంచిదని తాను కోరుకుంటున్నాన్నారు. ఐతే, రక్షణ, భద్రత, ఇంధన ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ వంటి విషయాలకు వస్తే, యూరప్‌తోనే మరింత బలమైన సంబంధాలు అవసరమని నేను ఖచ్చితంగా అనుకుంటున్నానని చెప్పారు. యూరప్‌తో బలమైన సహకారం యునైటెడ్ స్టేట్స్‌తో సంబంధాలను మెరుగుపరుస్తుందని తాను కోరుకుంటున్నానని స్టార్మర్ చెప్పారు.

**హోర్ముజ్‌పై శిఖరాగ్ర సదస్సు**

హోర్ముజ్ సమస్యపై ఈ వారంలోనే అనేక డజన్ల దేశాలతో ఒక శిఖరాగ్ర సదస్సుకు తాము ఆతిథ్యం ఇస్తామని స్టార్మర్ చెప్పారు. ప్రమాదకరమైన ప్రపంచంలో భాగస్వాములను పెంచుకునే లక్ష్యంతో యూరోపియన్ యూనియన్ మిత్రులతో ఒక కొత్త శిఖరాగ్ర సమావేశం గురించి తాను ప్రకటన చేస్తున్నారు. బ్రిటన్‌పై యుద్ధ సంక్షోభ ప్రభావం తీవ్రంగా పడుతున్నందువల్ల ప్రజలు తమ అలవాట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందా? అని ప్రశ్నించగా, సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలను తాను సన్నద్ధం చేయడం లేదన్నారు. పరిస్థితులను తాము చాలా దగ్గరనుండి నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ సంక్షోభం నుండి బయట పడతామని, సాధారణ పరిస్థితులు వస్తాయని అన్నారు. ఎంతకాలం ఈ యుద్ధం కొనసాగుతుంది? ఎంత తొందరగా హోర్ముజ్ జలసంధి వాణిజ్య నౌకల కోసం తెరుస్తారు? అనే విషయంపైనే ప్రపంచ ఆర్థిక పరిస్థితి ఆధారపడి ఉంటుందని చెప్పారు.

# నాటో నుండి వైదొలగుతాం అదొక పేపర్ టైగర్: ట్రంప్





**వాషింగ్టన్:** నాటో కూటమి నుండి వైదొలగే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో సహాయం చేసేందుకు, ప్రత్యక్ష జోక్యానికి నాటో దేశాలు తిరస్కరించడంతో ఆగ్రహంతో ఉన్నారు. తమ దేశ ప్రయోజనాలే ముఖ్యమని, హోర్ముజ్ సమస్య పరిష్కారం కోసం చర్చలకు తాము ఆతిథ్యం ఇస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్ ఉద్ఘాటించిన తర్వాత బుధవారం టెలిగ్రాఫ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ నాటో విషయంపై మాట్లాడారు. నాటో కూటమి నుండి వైదొలగే విషయాన్ని చాలా తీవ్రంగా పరిశీలిస్తున్నామని, నాటో కూటమి కేవలం ఒక ''కాగితం పులి'' (పేపర్ టైగర్) మాత్రమేనని విమర్శించారు.''పశ్చిమాసియా యుద్ధం తర్వాత నాటో కూటమిలో అమెరికా సభ్యత్వం గురించి పునఃపరిలిస్తారా?'' అని టెలిగ్రాఫ్ ప్రతినిధి ప్రశ్నించినప్పుడు, '''ఓహ్! అవును, నేను దీని గురించి మీకు చెబుతాను, నాటో పట్ల నేను ఎప్పుడు ఎక్కువ ఆశలు పెట్టుకోలేదు, మొదటినుండీ నేను ప్రభావితం కాలేదు, ఇది పునఃపరిశీలనకంటే అతీతమైనది, అంతకంటే ఎక్కువ, నాటో అనేది కేవలం ఒక కాగితం పులి అని నాకు ఎప్పటినుండో తెలుసు, అన్నట్టు ఈ విషయం పుతిన్‌కు కూడా తెలుసు'' అని ట్రంప్ అన్నారు.

బ్రిటన్ సైనిక సామర్థ్యాన్ని కూడా ఆయన ఎగతాళి చేశారు. ''మీకు నౌకాదళం కూడా లేదు, మీరు పాతవారు, మీ సైన్యం చాలా పాతది, మీ దగ్గర పనిచేయని విమాన వాహక నౌకలున్నాయి'' అని బ్రిటన్‌ను ఎద్దేవా చేశారు. కాగా యూరోపియన్ యూనియన్ రక్షణ కేటాయింపులు, యుద్ధ కేటాయింపుల గురించి మొదటిసారి ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. యూరోపియన్ కూటమి దేశాల కంటే చాలా చాలా ఎక్కువగా అమెరికా సైనికరంగంకోసం ఖర్చుచేస్తోందని చెప్పారు. గ్రీన్‌లాండ్‌ను తమ ప్రయోజనాలకోసం స్వాధీనం చేసుకుంటానని చెప్పినప్పుడు అమెరికా, యూరప్ మధ్య ఉన్న సంబంధాలమధ్య పరస్పర సహకార ధోరణి, విధేయతలు ఏమైపోయాయని నాటో మిత్రులను ట్రంప్ నిలదీశారు.



## వలస పడవ మునక : 18 మంది మృతి

**ఇస్తాంబుల్:** అక్రమంగా తరలి వెళుతున్న వలస ప్రజల పడవ టర్కీ తీరంలో మునిగిపోయింది. ఈ ప్రమాదంలో 18 మంది మరణించారు. మరో 21 మందిని టర్కీ కోస్తా తీర రక్షణదళ బృందాలు రక్షించి ఒడ్డుకు చేర్చాయి. టరీ నైరుతీ రాష్ట్రం ముగ్లా తీరంలో వలస ప్రజలు అక్రమంగా తరలి వెళుతున్నారు. వారు ప్రయాణిస్తున్న రబ్బరు పడవ ఆకస్మాత్తుగా మునిగిపోయింది. బోడ్రమ్ జిల్లాలో ఒక సుప్రసిద్ధ రిసార్టు సమీపంలోంచి వెళుతుండగా బుధవారం ఉదయం ఆరు గంటలకు రబ్బరు బోటు మునిగిపోయింది. జల,వాయు మార్గాలలలో జాడ తెలియని వారి కోసం ఆ ప్రాంతమంతా గాలిస్తున్నారు. వలస ప్రజలు ఎక్కడ నుండి ఎక్కడ వరకూ వెళుతున్నారనే సమాచారం వెంటనే తెలియరాలేదు.

**బురుండీలో పేలుళ్ళు డజన్ల మంది మృతి**

తూర్పు ఆఫ్రికా గ్రేట్‌లేక్ ప్రాంతంలోని భూబంధిత దేశం బురుండీ ఆయుధ డిపోలో భారీ పేలుళ్ళు సంభవించాయి. ఈ పేలుళ్ళు సర్వత్రా వ్యాపించడంతో అనేక డజన్లమంది మరణించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడించింది. బుజుంబా నగరంలోని ఒక ఆయుధ డిపోలో ప్రారంభమైన ఈ పేలుళ్ళ కారణంగా అనేక డజన్లమంది ప్రజలు మరణించారని భద్రతా వర్గాలు ఎ.ఎఫ్.పి సంస్థకు తెలియజేశాయి. మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ ఘటన జరిగింది. బురుండీ దేశానికి ప్రధాన ఆర్థిక నగరం బుజుంబా. ఈ నగరం దక్షిణ శివారు ప్రాంతంలోని ముసాగాలో బురుండీ జాతీయ రక్షణ దళం ఆయుధ డిపో ఉంది. ఈ డిపోలో పేలుళ్ళు మొదలయ్యాయి. ఆఫ్రికాలో అతిచిన్న దేశం బురుండీ.

# ఒప్పందం కుదిరినా కుదరకపోయినా ఇరాన్ నుండి వెళ్ళిపోతాం: ట్రంప్

## మా అణచివేత యుద్ధం కొనసాగుతుంది: నెతన్యాహూ

**వాషింగ్టన్:** హోర్ముజ్ జలసంధి నుండి నౌకల రాకపోకలపై ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదిరినా కుదరకపోయినాగానీ రెండు మూడు వారాల్లో పశ్చిమాసియా నుండి వెనక్కు వెళ్ళిపోతామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. అమెరికా మిలిటరీ రెండు మూడు వారాల్లో ఇరాన్‌లో తమ పని పూర్తి చేస్తుందని, దాడులను నిలిపివేస్తుందని చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తెరిచినా తెరవకపోయినా దానితో సంబంధం లేకుండా తమ బలగాలు ఇరాన్ నుండి వెనక్కు వెళతాయని చెప్పారు. తమ బలగాలు వెనక్కు వెళ్ళగానే చమురు ధరలు అనూహ్యస్థాయిలో కిందకు దిగి వస్తాయని కూడా వ్యాఖ్యానించారు. దేశాధ్యక్షుడు గురువారం జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని కూడా వైట్‌హౌస్ వర్గాలు ముందస్తు సమాచారంగా ప్రకటన చేశాయి. ట్రంప్ యుద్ధం ముగించే ప్రణాళిక చేస్తున్నారని వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం ప్రచురించిన తర్వాత ట్రంప్ నుండి ఈ ప్రకటన వచ్చింది. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ కూడా, ఇరాన్‌పై తమ అణచివేత యుద్ధం కొనసాగుతుందని ప్రకటించారు. 'ఇరాన్ తిరిగి కోలుకోలేని పరిస్థితుల్లోకి వస్తోంది, ఇరాన్ తిరిగి రాతియుగంలోకి వెళ్ళిందని మేం గ్రహించుకున్న తర్వాత ఇరాన్‌పై యుద్ధం ఆపేస్తాం' అన్నారు. 'ఇరాన్‌లో మా లక్ష్యాలు సాధించాం, ప్రాథమికంగా మేం కోరుకున్న విధంగా ఇరాన్‌ను అణ్వాయుధం తయారు చేయగల సామర్థ్యం లేకుండా చేశాం, రెండు మూడు వారాల్లో మా పని పూర్తిచేస్తాం, ఈ లోపు ఇరాన్‌తో ఒక ఒప్పందం కుదురుతుంది, ఒకవేళ ఒప్పందం కుదరకపోయినాగానీ మేం ఇరాన్ వదిలి వెళ్ళిపోతాం, వాళ్ళని (ఇరాన్) 20 ఏళ్ళు వెనక్కు నెట్టేశాం,వారి దగ్గర ఇప్పుడు నావికాదళంలేదు,మిలిటరీ లేదు, వైమానిక దళం లేదు, ఇక అణ్వాయుధం చేయగల సామర్థ్యం లేదని ఖరారు చేసుకున్నాక ఒప్పందం లేకపోయినా ఇరాన్ వదిలి వెళ్ళిపోతాం' అన్నారు. అణుపదార్థాన్ని శుద్ధి చేయనివ్వకుండా అడ్డుకున్నాం, ఇరాన్ శుద్ధి చేసిన 450 కేజీల అణు పదార్థం శిథిలాల్లో ఎక్కడో కూరుకుపోయింది, దానిని నేను పట్టించుకోవడంలేదు, ఇప్పుడు మేం మా పని పూర్తి చేస్తున్నాం అని ట్రంప్ గతంలో ఒకసారి అన్నారు.



అదేవిధంగా మరోవైపు ఇరాన్ ప్రభుత్వ టీవీ తాజా సమాచారం ప్రకారం, కొన్ని షరతులు గనుక నెరవేరితే యుద్ధం ముగించాలని తాము సంకల్పించుకున్నామని అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ప్రకటించారు. అమెరికా పేర్కొన్న 15 అంశాల ప్రణాళికకు ప్రతిగా ఇరాన్ కూడా యుద్ధ విరమణకు ఐదు అంశాలతో ఒక ప్రణాళిక ప్రకటించింది. తమకు పూర్తి హామీలు కావాలని, తిరిగి దాడులు జరగవనే హామీ ఉండాలని, విశ్వసనీయత పెరగాలని పెజెష్కియన్ అన్నారు.

**ఇరాన్ యుద్ధం ముగించాలని 66 శాతం అమెరికన్ల డిమాండ్**

ఇరాన్‌లో యుద్ధం వెంటనే ముగించాలని 66 శాతం అమెరికన్లు కోరుకుంటున్నారు. తాజా సర్వే ఈ విషయం వెల్లడించింది. ఇరాన్‌లో ఈ యుద్ధం ద్వారా ట్రంప్ ప్రభుత్వం నిర్దేశించుకున్న ప్రాథమిక లక్ష్యాలు నెరవేరకపోయినాగానీ తక్షణం యుద్ధం ముగించాలని మూడింట రెండు వంతుల అమెరికన్లు కోరుకుంటున్నారని మంగళవారం విడుదలైన రాయిటర్స్/ఇప్సోస్ పోల్ సర్వే ప్రకటించింది. గడచిన శుక్రవారం నుండి ఆదివారం వరకూ (మార్చి 27,28,29) నిర్వహించిన ఈ సర్వేలో కేవలం 35 శాతం అమెరికన్లు మాత్రమే ట్రంప్ యుద్ధానికి మద్దతు తెలియజేశారు. ఈ యుద్ధం వల్ల అమెరికాలో ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా పెట్రోలు,డీజిలు ధరలు అనూహ్య పెరుగుదల అమెరికన్లపై స్పష్టమైన ప్రభావం చూపిస్తోంది. రాబోయేకాలంలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోతాయని ప్రతి ముగ్గురు అమెరికన్లలో ఇద్దరు అమెరికన్లు అంచనావేసినట్లు ఈ పోల్ సర్వే వెల్లడించింది. ఈ సర్వే ద్వారా ప్రతిస్పందించిన వారిలో సగంమంది ఈ యుద్ధం తమ వ్యక్తిగత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపించిందని చెప్పారు.

**ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ బాల్‌రూమ్ నిర్మాణం నిలిపివేత**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో ఇష్టపూర్వకంగా, ప్రతిష్టాత్మకంగా వైట్‌హౌస్‌లో ట్రంప్ తలపెట్టిన బాల్‌రూమ్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఒక ఫెడరల్ న్యాయమూర్తి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ బాల్ రూమ్ నిర్మాణానికి దాదాపు 400 మిలియన్ డాలర్లు ఖర్చు అవుతుంది. ట్రంప్ ఏ పని చేయాలన్నాగానీ ముందుగా కాంగ్రెస్ ఆమోదం లభించాయి. ఈ నిధుల మంజూరుకు కాంగ్రెస్ ఆమోద ముద్ర వేసే వరకూ నిర్మాణ పనులు ప్రారంభించకూడదని కొలంబియాలోని అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి రిచర్డ్ లియోన్ తన తీర్పులో రాశారు. యునైటెడ్ స్టేట్స్ అధ్యక్షుడు అమెరికాలో ఉన్న 'ప్రథమ కుటుంబాల' సంరక్షకుడేగానీ యజమాని కాదని ఆయన స్పష్టం చేశారు. ఈస్ట్‌వింగ్‌లో తలపెట్టిన బాల్‌రూమ్ నిర్మాణాన్ని ప్రైవేటు నిధులతో కొనసాగించడానికి అమెరికా కాంగ్రెస్ ప్రస్తుత చట్టాల ప్రకారం తనకు అధికారం ఇచ్చిందని డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న వాదనను కూడా న్యాయమూర్తి తన మెమొరాండంలో తిరస్కరించారు. ఐతే అమెరికాలో ఉన్న జాతీయ చారిత్ర ప్రదేశాల పరిరక్షణ ట్రస్టు మాత్రం ట్రంప్‌కు వ్యతిరేకంగా కోర్టులో వాదించింది. ట్రస్ట్ వాదన ప్రకారం, అమెరికాలోని చట్టాలు ట్రంప్ చెబుతున్న కారణాలకు దగ్గరగా లేవని, అందువల్ల ఈ కేసులో ట్రస్ట్ వాదన గెలిచే అవకాశం ఉన్నందువల్ల కాంగ్రెస్ ఆమోదం వరకూ ఆగాలని న్యాయమూర్తి స్పష్టం చేస్తూ ట్రస్ట్ కోరిన నిషేధాజ్ఞను అమలు చేశారు.

# ఇరాన్ దాడి

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తం చేసింది. అదేవిధంగా ఇరాన్ ఐ.ఆర్.జి.సి కూడా బుధవారం సాయంత్రం చీకటిపడేవేళ సెంట్రల్ ఇజ్రాయెల్‌పై 10 బాలిస్టిక్ క్షిపణులతో దాడులు చేసింది. ఎవరైనా మరణించారా అనే విషయం వెంటనే తెలియరాలేదు. అనేక శకలాలు, క్లస్టర్ బాంబు పేలుళ్ళ కారణంగా వందలమంది ఇజ్రాయెల్ ప్రజలు ఇప్పకే గాయాలపాలవుతున్నారు. యుద్ధ ప్రారంభ సమయంలో ఇరాన్ 90 క్షిపణులు ప్రయోగించేదని, ఇప్పుడు ఈ సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని ఐడిఎఫ్ పేర్కొంది. సౌదీ అరేబియా వ్యాప్తంగా ఉన్న 200 మంది అమెరికా పైలట్లు, యుద్ధ విమానాలు నడిపే సిబ్బంది ఇళ్ళపై దాడులు చేశామని ఐ.ఆర్.జి.సి సయ్యద్ మజిద్ మౌసావి ప్రకటించారు. ఈ దాడుల ఫలితంగా వారంతా వివిధ హోటళ్ళలో తలదాచుకున్నారు. ఇతర ప్రత్నామ్నాయ మార్గాలను అనుసరించారు. ప్రతీకార దాడుల్లో భాగంగా అమెరికాకు చెందిన శక్తిమంతమైన అవాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను కూడా ధ్వంసం చేశామని చెప్పారు. అదేసమయంలో అర్జెంటైనా ప్రభుత్వం ఇరాన్ ఐ.ఆర్.జి.సిని ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎఇరేట్స్‌లో ఇరాన్ చేసిన డ్రోన్ దాడుల్లో శకలాలు తగిలి బంగ్లాదేశ్‌కు చెందిన కార్మికుడు మరణించాడు. ఇరాన్ ప్రయోగించిన రెండు డ్రోన్లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా ప్రకటించింది.

కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. ఈ దాడిలో ఒక ఇంథన నిల్వ టాంకర్లు మంటల్లో దగ్ధమయ్యాయి. భారీ ఎత్తున మంటలు, నల్లటి పొగలు ఆకాశమంతా కమ్ముకున్నాయి. ఇప్పటికే అనేకసార్లు ఇరాన్ ఐఆర్‌జిసితోపాటు దాని అనుకూల అనుబంధ సైన్యాలు కూడా అనేకసార్లు కువైట్ విమానాశ్రయాలపై దాడులు చేశాయి. ఖతార్ తీరంలో చమురు ట్యాంకర్‌పై ఇరాన్ క్షిపణులు దాడులు చేశాయి. దీంతో ఇందులో ఉన్న 21 మంది కాంట్రాక్టు కార్మికులను తక్షణం సురక్షితంగా బయటకు చేర్చినట్లు ఖతార్ రక్షణశాఖ పేర్కొంది. ఇక లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ సరిహద్దుల్లో ఉన్న లెబనాన్ గ్రామాలలో ఉన్న అన్ని ఇళ్ళనూ నేలమట్టం చేస్తామని, అక్కడి ప్రజలు ఇక తిరిగి నివాసానికి వెళ్ళే పరిస్థితి లేదని, తమ సెక్యూరిటీ జోన్‌ను విస్తరిస్తామని ఐడిఎఫ్ ప్రకటించింది. అదువిధంగా బీరూట్‌లో హెజ్బొల్లా కమాండర్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది.

# కాంబోడియా సైబర్ ముఠా గుట్టురట్టు

## టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాతో చేతులు కలిపి, అమాయక భారతీయ పౌరుల నుంచి కోట్ల రూపాయలను కొల్లగొడుతున్న భారీ ముఠాను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఛేదించినట్లు డైరెక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు. కాంబోడియా కేంద్రంగా సాగుతున్న ఈ సైబర్ ఫ్రాడ్ సిండికేట్‌తో సంబంధాలు కలిగి ఉండి, వారికి అక్రమంగా సిమ్ కార్డులు సరఫరా చేస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రిజ్వాన్ (29), హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్ అలీ (30), సయ్యద్ సోహైల్, అతీక్ అహ్మద్‌తో పాటు హన్మకొండలోని ఎయిర్‌టెల్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ టీమ్ లీడర్ నూనె అశోక్ ఉన్నట్లు వివరించారు. గత నెల 31వ తేదీన శంషాబాద్ విమానాశ్రయం నుంచి 198 భారతీయ సిమ్ కార్డులతో కాంబోడియాకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న అష్రఫ్ అలీని ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకోగా, ఈ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని ఆమె తెలిపారు. ఈ ముఠా కార్యకలాపాలపై లోతుగా దర్యాప్తు చేయగా, 2023 నుంచి ఇప్పటి వరకు ఆరు వేర్వేరు విడతల్లో సుమారు 600కు పైగా సిమ్ కార్డులను అక్రమంగా విదేశాలకు తరలించినట్లు తేలిందని శిఖా గోయల్ వెల్లడించారు. నిందితుడు అష్రఫ్ 2023లో దుబాయ్‌లో హోటల్ పనిచేస్తున్న సమయంలో, అక్కడ గేమింగ్ కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న రిజ్వాన్‌తో పరిచయం ఏర్పడిందని, భారతీయ సిమ్ కార్డులు సరఫరా చేస్తే భారీగా డబ్బు ఇస్తామని అతను ఆశ చూపినట్లు పేర్కొన్నారు. ఈ అక్రమ సిమ్ కార్డులను కాంబోడియాలోని నేరగాళ్లు ఫిషింగ్, గుర్తింపు దొంగతనం, బెదిరింపులు వంటి నేరాలకు వాడుతూ భారతీయ పౌరులకు భారీ నష్టాన్ని కలిగిస్తున్నారని శిఖా గోయల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు దేశ భద్రతకు, ఆర్థిక స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, నిందితులపై ఐటిచట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత, టెలీకమ్యూనికేషన్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత పత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, 'సంచార్ సాథి' వెబ్‌సైట్ ద్వారా తమ పేరిట ఉన్న సిమ్ కార్డుల వివరాలను తనిఖీ చేసుకుని, ఏవైనా అనుమానాస్పద కార్డులు ఉంటే వెంటనే ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.

# మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారు

## ధృవీకరించిన రష్యా దౌత్యవేత్త



**టెహ్రాన్:** ఇరాన్ సర్వాధినేతగా ఎన్నికై ప్రపంచానికి ఇంతవరకూ కనిపించని అలీ ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని రష్యా దౌత్యవేత్త అలెక్సీ దెడోవ్ ధృవీకరించారు. రష్యాకు చెందిన స్థానిక భాషా పత్రిక ఆర్‌టివిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మొజ్తాబా ఖమేనీ అమెరికా దాడుల్లో తీవ్రంగా గాయపడ్డారని, ఆయనను రష్యా తరలించారని, అక్కడే మొజ్తాబా సురక్షిత ప్రదేశంలో చికిత్స పొందుతున్నారని వ్యాప్తిలో ఉన్న వార్తలన్నింటినీ పటాపంచలు చేశారు. మొజ్తాబా ఖమేనీ ఒకవేళ సజీవంగా ఉండిఉంటే తీవ్రంగా గాయపడి ఉంటారని, కదలలేని స్థితిలో ఉండి ఉంటారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే ప్రకటనలు చేశారు. ఐతే రష్యా దౌత్యవేత్త భద్రతా కారణాల రీత్యా ఇంకా ఇతర వివరాలు మాత్రం వెల్లడించలేదు. మొజ్తాబా ఖమేనీ ఇరాన్ లోనే ఉన్నారని, సురక్షిత ప్రాంతంలో ఉన్నారని ఆ దేశ ఉన్నత నాయకులు మొదటినుండీ చెబుతున్నప్పటికీ అనేక సందేహాలు చక్కెర్లు కొడుతున్నాయి. మొజ్తాబా ఖమేనీ అజ్ఞాతవాసంలో ఉంటూ ఇప్పటికే రెండుసార్లు సందేశాలు విడుదల చేశారు. ఆయన ఎక్కడా వీడియోలలో కనిపించలేదు. తన తండ్రి అలీ ఖమేనీకి అమెరికా సైన్యం వల్ల ప్రమాదం ఉందని తెలిసినాగానీ ఆయన నిరంతరం బాహాటంగానే ప్రజలకు కనిపిస్తూ చివరివరకూ జీవితాన్ని గడిపారు. చివరకు ఫిబ్రవరి 28న తెల్లవారుజామున చేసిన అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీతోపాటు మొజ్తాబా తల్లి, ఆయన భార్య, ఖమేనీ కూతురు, అల్లుడు, మనవరాలు అందరూ మరణించారు.

# భూభారతి పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భూ వివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నామన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ (ఎల్ పిఎం) యూనిక్ నంబరు,అలాగే ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహా 'భూధార్' నంబర్‌ను కేటాయిస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. సర్వే నిర్వహించేందుకు అవసరమైన సర్వేయర్లను అందుబాటులో ఉన్నారని, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి, రోవర్లతో సర్వే నిర్వహిస్తామని వివరించారు. తద్వారా సర్వే ప్రక్రియ త్వరితగతిన పూర్తవుతుందని, కచ్చితమైన సర్వే వివరాలు వస్తాయన్నారు. 'ఇంటిగ్రేటెడ్ భూభారతి' పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించామని, సామాన్యులకు, రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 'మీ సేవ' కేంద్రాలకు వెళ్లకుండానే తమ ఇంటి నుంచే భూ సేవలు పొందే విధంగా ఈ పోర్టల్‌ను రూపొందించామన్నారు. రైతులు తమ భూమి హద్దులు తేల్చాలని సర్వే అధికారుల చుట్టూ తిరిగేవారని, ప్రస్తుతం ఎక్కడికీ వెళ్లకుండానే ఇంటి నుంచే భూభారతి పోర్టల్ ద్వారా పొందవచ్చని సూచించారు. ఈ పోర్టల్‌లో రైతు లాగిన్ అయిన వెంటనే తనకు సంబంధించిన భూమి వివరాలు కనిపిస్తాయన్నారు.

**'ఫీజు' చెల్లించగానే సర్వే ప్రక్రియ మొదలు...**

ఎకరాల సంఖ్య ఆధారంగా సర్వే ఫీజును నిర్ధారించామని, సర్వే ఫీజును చెల్లించిన తర్వాత ఆ వివరాలు ఆ గ్రామంలో ఉన్న లైసెన్స్డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళ్తుందని, ఆ తర్వాత రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీ చేస్తారని మంత్రి పొంగులేటిశ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఏడు రోజుల్లోపు సర్వే తేదీని సదరు లైసెన్స్డ్ సర్వేయర్ ఖరారు చేస్తారని, సర్వేను రోవర్లతో పూర్తి చేసి, ఆ వివరాలను సిస్టమ్‌లో నమోదు చేస్తారన్నారు. ఆ వివరాలు మండల సర్వేయర్ స్క్రూటినీకి వెళ్తుందని, అక్కడి నుంచి మండల తహశీల్దార్ ఆమోదం పొందిన తర్వాత సదరు దరఖాస్తుదారులకు ఎల్‌పిఎమ్, భూధార్ నంబర్లను కేటాయిస్తారని, ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయని వివరించారు. సర్వే పక్రియ పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్‌ను భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారని, ఈ ప్రక్రియలోని ప్రతి దశ కూడా దరఖాస్తు దారుని మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎం ఎస్ రూపంలో పంపిస్తారని మంత్రి తెలిపారు.

# కార్మికులకు బ్లాక్ డే

(మొదటి పేజీ తరువాయి)

నూతన కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను కాలరాస్తాయని పేర్కొన్నారు. 1923 నుంచి అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి బ్రిటిష్ హాయంతో పాటు దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 44 కార్మిక సంఘాలను సాధించుకున్నామని గుర్తు చేశారు. కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు ప్రధాని మోదీ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, చట్టబద్ధత లేని నూతన 4 కార్మిక చట్టాలను అమలు చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ 4 లేబర్ కోడ్‌లను అమలు చేయలేమని కేరళ, తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరి అవలంభిస్తుందని ఆయన తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయవద్దని కోరుతూ రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ నిరసన ర్యాలీలో కమటం యాదగిరి (ఎఐటియుసి), పాలడుగు భాస్కర్ (సిఐటియు), వై.నాగన్న గౌడ్ (ఐఎన్‌టియుసి), శ్రీనివాస్ (ఐఎఫ్‌టియు), ఎస్.ఎల్.పద్మ (టియుసిఐ)తో పాటు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు భారీగా పాల్గొన్నారు.

# ప్రజలను దోపిడీ చేయడమే

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం పడుతోంది. విమాన ఇంధనం ధర మరింత ప్రియం అవుతోంది. ఒకప్పుడు సామాన్య పౌరులూ విమానాల్లో ప్రయాణించేవారు. ఇప్పుడు విమాన ప్రయాణం అనేది ఖరీదైన విషయంగా మారిపోయింది. సాక్షాత్తూ ప్రభుత్వమే విమాన టికెట్ల ధరలపై పరిమితిని ఎత్తేసింది. బిట్యుమెన్ ధరలూ 50 శాతం పెరిగాయి. ప్రజలు ఇప్పుడు మరింత ఎక్కువ టోల్ ట్యాక్స్‌ను చెల్లించాల్సి వస్తోంది. ఇది హైవేలపై దారుణమైన దోపిడీలా మారిపోయింది. స్పీడ్ పోస్ట్ ఛార్జీ సైతం 34 శాతం పెరిగింది. ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్, సిరామిక్స్, రైతులు వినియోగించే పివిసి పైపుల ధరలూ పెరిగాయి. దేశ నిర్మాణ రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది'' అని ఖర్గే పేర్కొన్నారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచే బిల్లును బలవంతంగా ఆమోదింపజేయాలని మోదీ సర్కారు భావిస్తోందని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. దీనివల్ల దక్షిణ, ఈశాన్య, పశ్చిమ భారత్‌లలోని చిన్న రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయన తెలిపారు. ఒకవేళ ఆ ప్రతిపాదిత బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభిస్తే, ప్రతీ రాష్ట్రంలోనూ లోక్‌సభ సీట్లు 50 శాతం మేర పెరుగుతాయన్నారు. దీనిపై ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారని, ఆ బిల్లుపై అధికారిక ప్రకటన వెలువడ్డాక మరిన్ని రాష్ట్రాలూ వ్యతిరేకించే అవకాశం ఉంటుందని జైరాం రమేశ్ చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో సరిసమానంగా 50 శాతం చొప్పున లోక్‌సభ సీట్లను పెంచితే, దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయన్నారు. ఈవిషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్యనున్న వ్యత్యాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.

''ఉదాహరణకు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లు, తమిళనాడులో 39 సీట్లు ఉన్నాయి. కానీ ప్రతిపాదిత బిల్లు ప్రకారం యూపీలో సీట్ల సంఖ్య 120కి పెరుగుతుంది. ఇక ఇదే సమయంలో తమిళనాడులోని సీట్లు 59కే పరిమితం అవుతాయి. కేరళలో 20 నుంచి 30కి, బీహార్‌లో 40 నుంచి 60కి సీట్లు పెరుగుతాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 66కు, ఉత్తరాది రాష్ట్రాల్లోని సీట్ల సంఖ్య 200కు చేరుతుంది. దీనివల్ల తాత్కాలికంగా లోక్‌సభ సీట్ల నిష్పత్తి మారకపోవచ్చు. కానీ దీర్ఘకాలంలో చాలా ప్రతికూల పరిణామాలు కనిపిస్తాయి. ఇలాంటి బిల్లును మోదీ సర్కారు ఏకపక్షంగా తయారు చేయడం సరికాదు. చివరకు రాష్ట్ర అసెంబ్లీల సీట్లనూ 50 శాతం పెంచాలని కేంద్రం భావిస్తోంది. దీనిపైనా పూర్తి స్థాయిలో చర్చ జరగాల్సిన అవసరం ఉంది'' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# న్యాయ వ్యవస్థను బెదిరించడమే

(మొదటి పేజీ తరువాయి)

ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రమాణం చేసి న్యాయవ్యవస్థను పరిరక్షించాల్సిన కేంద్ర మంత్రి అమిత్ షా ఆయన భావాలతో ఏకీభవించని వ్యక్తులు ఇచ్చిన తీర్పును అగౌరవ పరచడం న్యాయవ్యవస్థను కించపర్చడం, ఒక రకంగా బెదిరించడమేనని ఆయన పేర్కొన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి లాంటి ప్రగతిశీల భావాలు కలిగిన న్యాయమూర్తులను ఆక్షేపించడం రాజ్యాంగానికి ద్రోహం చేయడమేనన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా కూడా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి ఏమాత్రం చరిత్రను అధ్యయనం చేయకుండా దానిని పూర్తిగా వక్రీకరిస్తూ పార్లమెంట్‌లో మాట్లాడారని సాంబశివరావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సిద్ధాంత మూలం మార్క్సిజమని, తత్వం భారతదేశానిదని, ఈ దేశ కాలమాన పరిస్థితులను అన్వహించుకుని రూపొందించుకోవడం జరిగిందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఏనలేని త్యాగాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమిటో అమిత్‌షా చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాధికారాన్ని అడ్డం పెట్టుకుని మావోయిస్టులను భౌతికంగా అంతం చేయవచ్చేమో గానీ, మావోయిజం మూలం కమ్యూనిజమని, దీనిని ఎవరూ అంతం చేయలేరని సాంబశివరావు స్పష్టం చేశారు. సోషలిజం అనే పదం రాజ్యాంగంలో సైతం పొందపర్చబడిందని, ఈ పదానికి భయపడితే ఏలా, ఇలాంటి చర్యలు దుర్మార్గమన్నారు. మరోవైపు మావోయిస్టుల పేరుతో అర్బన్ నక్సలైట్లు అనే ముద్ర వేస్తూ వేధింపులకు గురిచేసే పాలకులు చేసిన చట్టాలకు వారే బందీలు అవుతారని, అవే వారికి ఉరి తాళ్లు అవుతాయని హెచ్చరించారు. దళితులు ముస్లిం, క్రైస్తవ మతాల్లోకి మారితే వారికి అంతకు ముందున్న కులం గాని, రిజర్వేషన్లు కాని వర్తించవని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమని, ఈ తీర్పును న్యాయమూర్తులు పునర్ సమీక్షించాలని సాంబశివరావు కోరారు.

**పార్లమెంట్ స్థానాల పునర్ వ్యవస్థీకరణకు కమిటీ ఏర్పాటు చేయాలి**

పార్లమెంట్ స్థానాల పునర్ వ్యవస్థీకరణను ఏకపక్షంగా కాకుండా అన్ని వర్గాల నిపుణులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి అన్ని రాష్ట్రాలకు సమ న్యాయం చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని సాంబశివరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేరుగా 50 శాతం సీట్లను పెంచుతామంటున్నారని, ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగనుందని, దీంతో ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య అగాధం జరిగే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

**పినరయ్ విజయన్‌ని ఆదానితో రేవంత్ రెడ్డి పోల్చడం సరికాదు**

కేరళలో ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌కి అదాని, మోదీతో సంబంధాలు ఉన్నాయని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అనడం సరికాదని సాంబశివరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక్క రాష్ట్రంలో ఎన్నికల కోసం దేశ వ్యాప్తంగా ఇండియా కూటమికి నష్టం వాట్లిలే విధంగా రేవంత్‌రెడ్డి అలాగే రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేయడమంటే అది బిజెపికి లాభం చేకూర్చడమే అవుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అక్కడ ప్రభుత్వ తప్పులుంటే వాటిని ఎత్తి చూపడంలో తప్పులేదని, కానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడడం సరైంది కాదని సాంబశివరావు సూచించారు.

## పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా
# 'ఇంటింటికీ సిపిఐ'

- పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలకు మరింత చేరువవ్వడం, కమ్యూనిస్టు పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటికి సిపిఐ, నిధుల సేకరణ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐతో పాటు నిధి సేకరణ కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం పేద ప్రజల హక్కుల పరరక్షణ, సమాజంలో దోపిడీ, పీడనలేని వ్యవస్థ అయిన సోషలిజం లక్ష్యంగా కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలను నిర్మిస్తోందన్నారు. అనుబంధ సంఘాల ద్వారా వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలను నడుపుతుందని తెలిపారు. నేడు సమాజంలో పాలకవర్గాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమాల్లో పాల్గొనాలనే ఆకాంక్ష అనేక మందిలో ఉన్నప్పటికీ తమ వృత్తిరీత్యా వ్యక్తిగత పనులు, అవసరాల రిత్యా సమయాన్ని కేటాయించలేకపోవచ్చు కానీ కమ్యూనిస్టు పార్టీ చేస్తున్న మహత్తరమైన రాజకీయ పోరాటంలో ఆర్థికంగా సహకరించి ప్రజా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడం కోసం ప్రజలు సహకరించాలని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 1 నుండి 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వస్తున్న సిపిఐ కార్యకర్తలు, నాయకులకు అన్ని రకాలుగా చేయూతను అందించి పటిష్టమైన పార్టీ నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**వెలకట్టలేని త్యాగాల పార్టీ సిపిఐ: ఇటి నరసింహ**

వెలకట్టలేని త్యాగాలతో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ అనేక నిర్బంధాలను దాటుకుంటూ ప్రజలు కేంద్రంగా ఉద్యమాన్ని నిర్వహిస్తోందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి నరసింహ అన్నారు. దేశ స్వాతంత్ర పోరాటం మొదలుకుని మహత్తరమైన తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజలను ఏకం చేసి పాలకవర్గాల మెడలు వంచిందని, భూ సంస్కరణల చట్టం, ఇఎస్ఐ, పిఎఫ్, సమాచార హక్కు చట్టం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, వయోజనులకు ఓటు హక్కు కోసం అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించిందని తెలిపారు. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని జరుగుతున్న పోరాటాలలో ప్రజా ఉద్యమక్షేత్రంలో ముందున్న సిపిఐకి ప్రజల నుంచి హార్ధికంగా, ఆర్థికంగా విశేషమైన స్పందన లభిస్తోందని ఆయన చెప్పారు. నిధి సేకరణను ప్రారంభించిన తొలి రోజే ప్రజలు రూ.71,252 విరాళాలను అందజేసి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. భవిష్యత్తులో ప్రజల మద్దతుతో మరిన్ని త్యాగాలతో కూడిన పోరాటాలకు సిద్ధపడతామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయా దేవి, ఆర్.అంజయ్య నాయక్, సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నరసింహ, చంద్ర మోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

---

**జాతీయ జెండా రూపకర్త**

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

**మాజీ రాజ్యసభ సభ్యుడు హనుమంతరావు**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ జెండా రూపకల్పన చేసిన పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలని మాజీ ఎంపి వి.హనుమంతరావు కేంద్రాన్ని కోరారు. జాతీయ జెండా రూపకల్పన చేసిన రోజు సందర్భంగా అంబర్‌పేట్ వి.హనుమంతరావు ఇంటి వద్ద జాతీయ జెండా ఎగరవేసి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ పింగళి వెంకయ్యకు జాతీయ జెండా రూపకల్పన చేయాలని సూచించడంతో జాతీయ జెండాను తయారు చేశారని, అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని ఆయన సూచించారు.

---

**ఎపిలో విలీనమైన 7 మండలాలు**

## తిరిగి తెలంగాణలో విలీనం చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో విలీనం చేయాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఎపి సిఎం చంద్ర బాబు ఏది చెబితే కేంద్ర ప్రభుత్వం కూడా అదే చేస్తుందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్ఎ సుంకె రవిశంకర్, మాజీ జెడ్‌పి చైర్మన్ తుల ఉమా, సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కల రామారావుతో కలిసి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎంపిల సంఖ్యను పెంచే విధంగా విభజన చట్టంలో సవరణ చేయాలని బిఆర్‌ఎస్ అనేక సార్లు డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించడం ద్వారా లక్ష కోట్ల రూపాయాలు నీటిలో కలిసిపోయయని ఒక బాధ్యత గల కేంద్ర మంత్రి పాటిల్ చెప్పవచ్చునా అని వినోద్ కుమార్ ప్రశ్నించారు. రాజ్యసభ హుందాతనాన్ని కాపాడాలని, వెంటనే కేంద్ర మంత్రి పాటిల్‌తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

---

## 25 శాతం నిధులు కూడా విడుదల చేయలేదు

**మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్అండ్‌బి నిధుల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, బడ్జెట్ కేటాయింపుల్లో కేవలం 25 శాతం నిధులను కూడా విడుదల చేయలేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం 9 ఏళ్లలో పది వేల కిలోమీటర్లకు పైగా కొత్త రహదారులను నిర్మిస్తే రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం 112 కిలోమీటర్ల రహదారులను మాత్రమే నిర్మించారని వివరించారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని చెప్పి, 15 నెలలు అయినప్పటికీ కనీసం టెండర్లను కూడా తెరవలేదని ఆరోపించారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) పేరుతో రాష్ట్రంలో భారీ కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. పాత పనుల బిల్లులను చెల్లించకుండా, హ్యామ్ కాంట్రాక్టర్లకు రూ. 1900 కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్ ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో రహదారులు, వంతెనల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు.

---

# 'ఎఫ్‌సిఆర్‌ఎ' సవరణ చట్టాన్ని అడ్డుకుంటాం

**ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో మైనారిటీవర్గాల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విదేశీ సహకార నియంత్రణ చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) సవరణను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించబోమని, సభలో ఈ బిల్లును గట్టిగా అడ్డుకుంటామని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు మైనారిటీ సంస్థల ఆర్థిక మూలాలను దెబ్బతీసేలా ఉందని ఆరోపిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద ప్రతిపక్షాలు భారీ ధర్నా నిర్వహించాయి. ఈ నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2010 నాటి ఎఫ్‌సిఆర్‌ఎ చట్టంలో మార్పులు కేవలం మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని, వారి స్వచ్ఛంద సేవలను అడ్డుకోవడానికి ప్రభుత్వం రూపొందించిన ఒక 'అంకుశం' అని విమర్శించారు. రాజ్యాంగం దేశంలోని అన్ని కులాలకు, మతాలకు సమాన హక్కులను కల్పించిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అ జెండాను అమలు చేసే క్రమంలో భాగంగానే ఇలాంటి వివక్షాపూరితమైన సవరణలను తెరపైకి తెచ్చిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య విలువలకు పాతర వేస్తూ, ఒక వర్గంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం మానుకోవాలని కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**బిఆర్‌ఎస్‌తో కిషన్ రెడ్డివి కుమ్మక్కు రాజకీయాలు**

బిఆర్‌ఎస్‌తో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నారని కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. కెసిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంటుంటే కిషన్ రెడ్డి కేంద్ర క్యాబినెట్‌లో ఉండి కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని, ఇది వారి మధ్య ఉన్న 'మ్యాచ్ ఫిక్సింగ్' కాదా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ అవినీతికి కిషన్ రెడ్డి వంతపాడారని, ఇప్పుడు లోక్‌సభలో ఆ పార్టీ ఎంపిలు లేని లోటును ఆయన తీరుస్తున్నారని కిరణ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. కిషన్ రెడ్డి చదువుతున్నది బిఆర్‌ఎస్ స్క్రిప్ట్ అని, ఆ పార్టీ ఇచ్చిన 'అవయవ దానం' వల్లే బిజెపికి 8 లోక్‌సభ సీట్లు వచ్చాయని విమర్శించారు. కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ కిషన్ రెడ్డి ఏనాడూ ప్రధాని మోదీ వద్ద తెలంగాణ ప్రయోజనాల గురించి మాట్లాడలేదని, ఇప్పటికైనా ప్రేక్షక పాత్ర ను వీడి, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని ఆయన సూచించారు.

**'జన్ విశ్వాస్' పేరుతో ప్రజలకు విశ్వాసఘాతం**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2026' వ్యాపార సౌలభ్యం పేరుతో అవినీతి, మోసం, కార్పొరేట్ ఉల్లంఘనలను సాధారణీకరించేలా ఉందని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ విశ్వాసఘాతమేనని కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగిస్తూ, రైల్వేల చట్టంలోని సెక్షన్ 145, 147, 162 నిబంధనలను దుర్బలపరచడం వల్ల మహిళల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. రైలు ప్రయాణాల్లో మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తించే వారికి, రైల్వే ఆస్తులను అతిక్రమించే వారికి జైలు శిక్షలను తొలగించడం సరికాదని, రక్షణను మరింత బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైల్వే వ్యవస్థ దేశంలోని కోట్ల మందికి జీవనాధారమని, నిబంధనలను నీరుగార్చడం అంటే అగ్నితో చెలగాటమాడటమేనని పరుష పదజాలంతో హెచ్చరించారు. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం కింద నకిలీ మందులు, కాస్మెటిక్స్ విక్రయించే వారి కి జైలు శిక్షకు బదులుగా కేవలం ఒక లక్ష రూపాయల జరిమానా విధించడం పట్ల ఆయన విస్మయం వ్యక్తం చేశా రు. థాణే లోని అనైతిక ఫ్యాక్టరీలు, ఢిల్లీ సదర్ బజార్ వం టి ప్రాంతాల్లో సాగుతున్న నకిలీ మందుల రాకెట్ల నేపథ్యంలో, ఈ సవరణ పెద్ద ఎత్తున ఆరోగ్య సంక్షోభానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. విపత్తు నిర్వహణ చట్టం సెక్షన్ 51 కింద సహాయక చర్యలను అడ్డుకునే వారికి శిక్షా కాలాన్ని తగ్గించడం, పెట్రోలియం పైప్లైన్ల విధ్వంసానికి పాల్పడే వారికి గతంలో ఉన్న కఠిన శిక్షలను ఐదేళ్లకు కుదించడం దేశ భద్రతపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు. భువనగిరి పార్లమెంటు పరిధిలోని రైతులు, చేనేత కళాకారుల హక్కులను ఈ బిల్లు కాలరాస్తోందని కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. దేశం చట్ట పాలన నుంచి జరిమానా పాలన వైపు మళ్లుతోందని, న్యాయం యొక్క ఇనుప హస్తం ఇప్పుడు కేవలం ధనవంతుల కాసుల పెట్టెగా మారిపోయిందని ఆయన విమర్శించారు. మొత్తం 21 చట్టాలలో మార్పులు తెచ్చే ఈ వివాదాస్పద బిల్లును సభ తక్షణమే తిరస్కరించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

---

## ఉమ్మడి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సమస్యలు త్వరలో పరిష్కరించుకుంటాం

**తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉమ్మడి రాష్ట్ర విభజనలో భాగంగా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన పరిపాలన భవన పంపకాల సమస్యను ఇరు సంస్థలు పరస్పర సహకారంతో వీలైనంత త్వరగా విభజన ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ విభజనకు సంబంధించిన అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ యాస్మీన్ బాషా పాల్గొని పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. వివిధ కారణాల వలన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రధాన పరిపాలన భవన పంపకాల సమస్యకు పరిష్కారం కనుగొనే దిశగా ఈ సమావేశం జరిగిందని అన్వేష్‌రెడ్డి వెల్లడించారు. విభజన ప్రక్రియ పెండింగ్‌లో ఉండటంతో రైతులకు సంబంధించిన వాటాల పంపకం జరగకపోవడం ప్రధాన సమస్యగా ఉన్నదని గుర్తించామని, ఈ నేపథ్యంలో, ఇరు సంస్థలు పరస్పర సహకారంతో వీలైనంత త్వరగా విభజన ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నామని ఆయన తెలిపారు. అదేవిధంగా, రెండు సంస్థలు తమ తమ రాష్ట్రాలకు అవసరమైన వివిధ పంట రకాల విత్తనాలను పరస్పరం తీసుకుంటూ, సమన్వయంతో ముందుకు సాగి సంస్థల బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు అన్వేష్ రెడ్డి వెల్లడించారు.

---



## ఎల్‌పిజి కొరతతో ఆటోడ్రైవర్ల అవస్థలు

**కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామోహన్ రెడ్డి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎల్‌పిజి సరఫరా కొరతతో రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో సుమారు 95 వేల ఎల్‌పిజి ఆటోలు ఉన్నప్పటికీ, సరఫరా లోపం వల్ల వారి జీవనోపాధి దెబ్బతింటోందని అన్నారు. గతంలో ఆటో డ్రైవర్ల సమస్యలపై స్పందించిన బిఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు మౌనం పాటించడం ఆశ్చర్యకరమని విమర్శించారు. కోవిడ్ కాలంలో తీసుకున్న నిర్ణయాల మాదిరిగానే, ప్రస్తుతం కూడా కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు సమస్యలను తాత్కాలికంగా నిర్వహించాలనే ధోరణి కనిపిస్తోందని ఆరోపించారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని, ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కాపాడేందుకు ముందుకు రావాలని సామ రామోహన్ రెడ్డి కోరారు.

---

## రాష్ట్రంలో గడ్డిమందు అమ్మకాలపై 60 రోజులు నిషేధం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్రంలో పారాక్వెట్ గడ్డిమందు అమ్మకాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యంత ప్రమాదకరమైన ఈ గడ్డి మందును నిషేధించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌తో సహా పలు రైతు సంఘాలు, వివిధ సంస్థల నుంచి రైతు కమిషన్‌కు వినతులు వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ మందు నిషేధించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభు త్వం శాసనసభలో తీర్మానాన్ని కూడ ఆమోదించడంతో పాటు పారాక్వెట్ గడ్డిమందును నిషేదిస్తు తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలో పారాక్వాట్ అమ్మకాలు, నిల్వలు, వినియోగంపై 60 రోజులు నిషేధం విధిస్తూ తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో వెల్లడించింది.

---

## జిఒల పేరుతో యువతకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది : కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కకుండా జిఒల పేరుతో ప్రభుత్వం అడ్డంకులను సృష్టిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఆ జిఒలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఐటీ రిటర్న్స్ దాఖలు చేశారని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని 'తెలంగాణ జాగృతి' కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిరుద్యోగులతో కలిసి కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ డిగ్రీ లెక్చరర్ల పోస్టుల కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌కు జిఒ నంబర్ 4 అడ్డంకిగా మారిందని, ఈ జిఒ ప్రకారం పిహెచ్‌డి చేసిన వారికి 25 మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూకు మరో పది మార్కుల నిబంధనలను పెట్టారని వివరించారు. పిహెచ్‌డి అడ్మిషన్లు లేకుండా 25 మార్కుల వెయిటేజీ ఎలా ఇస్తారని ఆమె ప్రశ్నించారు. డిగ్రీ లెక్చరర్ పోస్టుల నియామకాల్లో కుట్ర జరుగుతోందని, గతంలో కూడా గ్రూప్ 1లో పరీక్షలో తాము అనుకున్న వారికే ఉద్యోగాలను భర్తీ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక ఎగ్జామినేషన్ సెంటర్‌ను ఏర్పా టు చేశారని ఆరోపించారు. 'డిఎస్‌సిలో జిఒ నంబర్ 104, గ్రూప్స్ విషయంలో జిఒ నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జిఒ నంబర్ 46, గురుకులాలకు జిఒ నంబర్ 81,మహిళలకు రి జర్వేషన్లు రాకుండా జిఒ నంబర్ 4' నిరుద్యోగులకు తీవ్ర ఆటంకంగా మారిందదన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఒకరి అవినీతిని, మ రొకరు బయటపెట్టుకున్నారని, సిఎం రేవంత్ రెడ్డి బిఆర్‌ఎస్ బూజాన తూపాకిని పెట్టి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కాల్చారని తెలంగా ణ కవిత అన్నారు. రాజకీయ పార్టీ ఆవిర్భావం రోజున తమ ఏజెండాకే ప్రాధాన్య తనిస్తామని, ఉమా భారతి సహా పలువురు పెద్దల ఆశీర్వా దం కూడా తీసుకుంటామన్నారు. బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలు తనతో టచ్‌లోనే ఉన్నారని, సమయం వచ్చినప్పుడు వారి పేర్లను ప్రకటిస్తానని చెప్పారు. కల్వకుర్తి నియోజక వర్గంలో కుర్మిద్ద లో పెద్ద భూస్వాముల భూములను వదిలి, పేద గిరిజనుల భూములు టిజిఐసిసి స్వాధీనం చేసుకుంటుందని మండిపడ్డారు. త్వరలోనే వారి తరపున పోరాటం చేస్తామని కవిత అన్నారు.

---



## జర్మనీ, జపాన్‌లో నర్సులకు భారీ డిమాండ్


**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సులకు భారీ డిమాండ్ ఉందని, నెలకు రూ.2 లక్షల వరకు జీతాలు లభిస్తున్నాయని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. జర్మనీలోని ఉద్యోగావకాశాలను అధ్యయనం చేయడానికి త్వరలోనే ఓ ప్రతినిధి బృందం పర్యటించనున్నట్టు తెలిపారు. ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగానికి అవసరమైన 1 వెయ్యి మందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామని, అక్కడ యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయిందని తెలిపారు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకున్న వెంటనే అవకాశాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాసబ్ ట్యాంక్‌లోని టిజిఐఐసి భవనాన్ని మంత్రి వివేక్, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ కలిసి పరిశీలించారు. భవిష్యత్‌లో విదేశాల్లో ఉద్యోగాలు పొందే విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించేలా ఈ కార్యాలయాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. తెలంగాణలో టామ్ కామ్ సంస్థ ద్వారా పెద్ద ఎత్తున విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో టామ్ కామ్ కోసం ప్రత్యేకంగా రూ.90 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. విదేశాలకు వెళ్లే అభ్యర్థులకు అక్కడి సంస్కృతి, భాష, జీవన విధానం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల్లో చదువుతున్న వారిలో ఆసక్తి ఉన్న అభ్యర్థులను గుర్తించి విదేశీ ఉపాధికి అనుగుణంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. విదేశీ ఉద్యోగ అవకాశాలను ఆశించే యువత టామ్ కామ్‌లో నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు.

---

## ఆదిత్య డిగ్రీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

**ఒయూ అనుబంధ గుర్తింపు లేకుండా అడ్మిషన్లు నిర్వహించొద్దు : ఎఐవైఎఫ్ డిమాండ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఆదిత్య డిగ్రీ కళాశాలపై చర్య లు తీసుకోవాలని, ఎడిఎటి 2026 మెరిట్ టెస్ట్ పేరుతో విద్యార్థులను మో సం చేస్తున్న ఈ కళాశాలపై కేసులు నమోదు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేవారు. ఈ మేరకు మంగళవారం అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జి. నరేష్ రెడ్డికు వారు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కల్లూరు ధర్మేం ద్ర, టి.సత్య ప్రసాద్ మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలు మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని (నారాయణగూడ, దిల్‌సుఖ్ నగర్, ఆల్వాల్, హబ్సిగూడ, ఈసీఐఎల్, కూకట్‌పల్లి,,సాగర్ రింగ్ రోడ్, మణికొండ, సైదాబాద్, మియాపూర్, సనత్ నగర్, లింగంప ల్లి) ప్రాంతాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశారని, సదరు కళాశాలాలకు యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు స్పష్టత లేకుండానే డిగ్రీ అడ్మిషన్లు నిర్వహించడం, అలాగే మెరిట్ బేస్డ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎడిఎటి2026) పేరుతో విద్యార్థులను మోసం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే కార్పొరేట్ దోపిడీ, ప్రస్తుత ప్రభుత్వాల విద్యా విధానాల కారణంగా, ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కాలేజ్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

NIT No. 04/CMC/HQ/EE/2025-26 తేదీ: 31.03.2026

పని పేరు: అభివృద్ధి పనులు, అంచనా విలువ: రూ.26.00 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 02.04.2026న ఉ.10.30గం.ల నుండి 09.04.2026న ఉ.10.3గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిఎంసి, సెల్ నెం. 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, భవనాల నిర్వహణ, సిఎంసి - హెచ్‌క్యు.

DIPR R.O. No. : 17966-PP/CL/ADVT/1/2026-27, Date: 01-04-2026

**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**

గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల

Rc.No.76/2026 సీల్డ్ టెండర్ - కమ్ - బహిరంగ వేలము ప్రకటన తేదీ: 01.04.2026

ఈ క్రింద తెలిపిన టెండర్ హక్కుల గూర్చి తేదీ: 15.04.2026 రోజున ఉదయం 10 గంటల నుండి సీల్డ్ టెండర్స్ కమ్ బహిరంగ వేలములు నిర్వహించబడును.

**1. టెంకాయలు పూజ సామాగ్రితో అమ్ముకొను హక్కు, 2. ధాన్యము వ్రతపూజ సామాగ్రి ప్రోగు చేసుకొను హక్కు, 3. కిరాణం సామాగ్రి & ఆటబొమ్మలు అమ్ముకొను హక్కు, 4. వంట చెరకు, పూలు, పండ్లు అమ్ముకొను హక్కు, 5. హోటల్ నడుపుకొను హక్కు, 6. కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకొను హక్కు,**

1. సీల్డ్ టెండర్ దరఖాస్తు తీసుకొను చివరి తేదీ: 14.04.2026 సాయంత్రం 4:00 గంటల వరకు.
2. సీల్డ్ టెండర్‌లో పాల్గొను వారు ప్రతి టెండర్కు షెడ్యుల్ ధర 300/-ల చొప్పున నగదు చెల్లించవలెను.
3. షెడ్యుల్‌లో తెలిపిన ప్రకారం ధరావత్తు సొమ్ము నగదు / డి.డి. ద్వారా చెల్లించవలెను.
4. పూర్తి వివరములకు కార్యాలయము నందు లేదా సెల్ నెం. 8790121962 ద్వారా సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 17945-PP/CL/ADVT/1/2026-27, Date: 01-04-2026

తెలంగాణ ప్రభుత్వం

**ఇరిగేషన్ & CAD డిపార్ట్‌మెంట్**

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, I&CADD., ఇరిగేషన్ సర్కిల్, K.C. కాలనీ, వరంగల్ (U)-506015.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్

| క్ర.సం. | టెండర్ నోటీస్ & తేదీ | పనిపేరు | అంచనా వ్యయ విలువ |
|---|---|---|---|
| 1 | 16/2025-26(1st call), తేదీ 28.03.2026 | I&CADD-FDR-2025-26-O&M-కాకతీయ ప్రధాన కాలువ లైనింగ్‌కు Ch.236.585 కి.మీ. నుండి Ch.236.715 కి.మీ. వరకు మరమ్మతులు | రూ. 39.16 లక్షలు |

టెండర్ డాక్యుమెంట్ అందుబాటులో ఉండే తేదీ మరియు సమయం : 02.04.2026 ఉదయం 11.00 గంటల నుండి, మరిన్ని వివరాల కోసం మరియు టెండర్ డాక్యుమెంట్స్‌ను డౌన్‌లోడ్ చేసేందుకు దయచేసి https://tender.telangana.gov.in ను సందర్శించగలరు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, I&CADD., ఇరిగేషన్ సర్కిల్, K.C.కాలనీ, వరంగల్.

DIPR R.O. No. : 17905-PP/CL/ADVT/1/2026-27, Date: 01-04-2026

**నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**

N/D

కార్పొరేషన్ ఐడెంటిటీ నెంబర్ : U40 109 TG 2000 SGCO34119

టెండర్ నోటీస్ నెం. 01/2026-27

i). Bid Nos.I-200/2026-27 నుండి I-204/2026-27 & Bid Nos.II-1/2026-27 నుండి II-25/2026-27 వరకు గల వాటి ద్వారా TGNPDCL ప్రాంతంలో 28 33/11KV అవుట్‌డోర్ సబ్‌స్టేషన్లు మరియు 2 ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం.

ii) Bid No.I-(R)199/2025-26 ప్రకారం వరంగల్ సర్కిల్‌లోని ఫోర్ట్ వరంగల్‌లో గల 33/11 KVఫోర్ట్ రోడ్ సబ్ స్టేషన్‌కు, 132 KV గీసుకొండ సబ్‌స్టేషన్ నుండి ఉద్భవించే 33KV స్టేషన్ రోడ్ ఫీడర్ నుండి ట్యాపింగ్ ద్వారా 33/KV సబ్‌స్టేషన్ ఫోర్ట్ రోడ్‌కు ప్రత్యామ్నాయ సప్లయ్‌ను అందించడానికి 33KV లైన్ ఏర్పాటు.

సం/- చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) TGNPDCL, వరంగల్.

DIPR R.O. No. : 17914-PP/CL/ADVT/1/2026-27, Date: 01-04-2026

## ఎన్నికల ట్రిబ్యునల్‌లో తేల్చుకోండి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గ్రామ సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన వివాదాల్లో నేరుగా హైకోర్టును ఆశ్రయించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఇలాంటి అంశాలు ఎన్నికల పిటిషన్ ద్వారా సంబంధిత అధికారుల ముందే పరిష్కరించుకోవాలంది. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనల ప్రకారం ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలంది. కొమరంభీం అసిఫాబాద్ జిల్లా టి. సిర్పూర్ మండలం దోరపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన తనకు 21 ఏండ్లు లేవని చెప్పి సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను సోయం సమీర హైకోర్టులో సవాలు చేశారు. తనను కాదని సర్పంచ్‌గా రాసపల్లి మంగక్కను ఆర్‌డిఒ ఎంపిక చేయడాన్ని సవాల్ చేశారు. ఇది ఎన్నికల వివాదమని, ఎలక్షన్ పిటిషన్ వేసుకోవాలని జస్టిస్ ఈవీ వేణుగోపాల్ ఇటీవల తీర్పు చెప్పారు. ఆర్‌డిఒ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని చెప్పి పిటిషన్‌ను కొట్టేశారు.

## కేంద్రం కౌంటర్ వేయాలి

కెవిపి పిటిషన్‌పై హైకోర్టు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** అంతర్జాతీయ పోలీసు ఆదేశాల మేరకు వెలువడిన రెడ్‌కార్నర్ నోటీసును సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత కె.వి.పి.రామచంద్రరావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. కేంద్ర ప్రభుత్వం తమ వాదనలు తెలియజేయాలంది. కేంద్ర హోం, విదేశాంగ శాఖలు తమ వాదనలతో కౌంటర్లు సమర్పించాలని ఆదేశించింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చాలని పిటిషనర్‌ను ఆదేశించింది. అమెరికా కోర్టులో ఎఫ్‌బిఐ పెట్టిన కేసులో 2014 ఏప్రిల్ 28న ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్‌ను జారీ చేసింది. దీనిని కెవిపి సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ తుకారాంజీ విచారించారు. నాడు ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కుట్రతో పెట్టిన కేసని, కేంద్రం కౌంటరు దాఖలు చేయలేదని పిటిషనర్ వాదన. గతంలోని స్టేను ఎత్తివేయాలని సిబిఐ కోరింది. కౌంటర్లు వేస్తామని కేంద్రం చెప్పింది. దీంతో విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

## రాజీ ప్రయత్నించకుండా కేసులా?

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పిల్లలు పట్టించుకోవడం లేదంటూ నేరుగా కోర్టుల్లో పిటిషన్లు వేయడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. నిరాదరణ వ్యవహారంపై తల్లిదండ్రులు రాజీ ప్రయత్నాలు చేయకుండానే నేరుగా కోర్టుకు రావడం సరికాదని అభిప్రాయపడింది. ఆశాజనకంగా ప్రయత్నాలు ఉండాలంది. తన కొడుకు పట్టించుకోవడం లేదని, ఆస్తి తమ పేరిట తిరిగి బదలాయించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వ్యక్తి వేసిన పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. తల్లిదండ్రుల్ని చూడాల్సిన బాధ్యత కొడుకులతోపాటు కూతుళ్లకు కూడా ఉంటుందన్నారు. దీనిపై వివరాలివ్వాలని సూర్యాపేట అధికారులను ఆదేశించారు. విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేశారు.

## ఆటో గ్యాస్ కొరతను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలి

ప్రైవేట్ ఎల్‌పిజి కంపెనీల ప్రతినిధులకు స్టీఫెన్ రవీంద్ర ఆదేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ : నగరంలో నెలకొన్నఆటో (ఎల్‌పిజి) గ్యాస్ కొరతను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ ఎల్‌పిజి కంపెనీల ప్రతినిధులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర సూచించారు. మంగళవారం పౌర సరఫరాల భవన్‌లో ప్రైవేట్ ఆటో ఎల్‌పిజి మార్కెటింగ్ కంపెనీలైన ఎజిస్ గ్యాస్, సూపర్ గ్యాస్, గో గ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ గ్యాస్, ఎక్స్‌ట్రా గ్యాస్, యూని గ్యాస్ ప్రతినిధులతో ఒక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో, గ్యాస్ కొరతకు ముందు, ఆ తర్వాత ఉన్న సప్లై (సరఫరా) పరిస్థితులపై స్టీఫెన్ రవీంద్ర సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 110 బంకులతో ఆటో ఎల్‌పిజి మార్కెట్‌లో ఈ ప్రైవేట్ కంపెనీలకే 80 శాతం వాటా ఉన్న నేపథ్యంలో అన్ని మార్గాల ద్వారా వెంటనే ఎల్‌పిజీని దిగుమతి చేసుకుని అందుబాటు లో ఉంచాలని కమిషనర్ ఆయా కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో గ్యాస్ సరఫరాను పెంచాల్సిన అవసరం చాలా ఉం దన్నారు. ఆ గ్యాస్ సరఫరా తగినంతగా ఉంచడంలో ఎవరైనా విఫలమైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, ఆటో డ్రైవర్లకు గ్యాస్ అందేలా చూడటం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన విషయం అని ఆయన స్పష్టం చేశారు.

## కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలి

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కెటిఆర్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని కాజీపేటను రైల్వే డివిజన్ చేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు బుధవారం లేఖ రాశారు. ఈ లేఖను బిఆర్‌ఎస్ ఎంపిల బృందం కేంద్ర మంత్రికి స్వయంగా అందజేసింది. దక్షిణ మధ్య రైల్వేలో జరుగుతున్న అంతర్గత పునర్వ్యవస్థీకరణ, దక్షిణ తీర రైల్వే కార్యకలాపాల ప్రారంభంతో సికింద్రాబాద్ డివిజన్‌పైన పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. తాజా గణాంకాల ప్రకారం ప్రస్తుత సికింద్రాబాద్ డివిజన్ పరిధి 2,755 ట్రాక్ కిలోమీటర్లుగా ఉందని, రాబోయే కాలంలో వాడిరాయచూర్ ,విష్ణుపురం బిబి నగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే, ఇది సుమారు 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుందని కెటిఆర్ ఆ లేఖలో పేర్కొన్నారు. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది చాలా ఎక్కువగా ఉన్నదన్నారు. ప్రతిపాదిత కాజీపేట డివిజన్‌లో కాజీపేట బల్లార్షా, పెద్దపల్లి, నిజామాబాద్, కాజీపేట, ఎర్రుపాలెం, డోర్నకల్, మనుగూరు, సత్తుపల్లి వంటి కీలక మార్గాలను చేర్చడం ద్వారా సుమారు 2వేల ట్రాక్ కిలోమీటర్ల నెట్వర్క్‌ను సమర్థవంతంగా నిర్వహించవచ్చని కెటిఆర్ కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. పెద్దపల్లినిజామాబాద్ సెక్షన్‌ను హైదరాబాద్ డివిజన్‌కు బదిలీ చేసే ప్రతి పాదనను ఉప సంహరించుకోవాలని, భౌగోళిక సామీప్యత దృష్ట్యా దీనిని కాజీపేట డివిజన్‌లోనే ఉం చాలని డిమాండ్ చేశారు. అలాగే లాతూర్ రోడ్‌పర్లీ వైజనాథ్ సెక్షన్‌ను నాందేడ్ డివిజన్‌కు మార్చే అంశాన్ని కూడా పునః పరిశీలించాలని ఆయన కోరారు.

## టిజిటిడిసి ఎండిగా బాధ్యతలు స్వీకరించిన గౌతమి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న పి. గౌతమికి తెలంగాణ స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆమె బుధవారం హిమాయత్‌నగర్‌లోని టూరిజం కార్యాలయంలో పదవి బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం టూరిజం మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న వల్లూరు క్రాంతికి బుధవారం నుంచి జూలై 31 వరకు సెలవులో ఉన్నారు. ఆమె స్థానంలో గౌతమికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం గౌతమి అన్ని విభాగాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడం, పర్యాటకులకు మెరుగైన అనుభవం అందించడం, కొనసాగుతున్న ప్రాజెక్టులను వేగవంతం చేయడంపై దృష్టి సారించారు. సమన్వయంతో కూడిన ప్రయత్నాలు, కొత్త ఆవిష్కరణలు, సమర్థవంతమైన సేవల ద్వారా సంస్థ లక్ష్యాలను సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సెలవు పూర్తయ్యాక వల్లూరు క్రాంతి తిరిగి తన విధుల్లో చేరనున్నారు.

## 'మహాలక్ష్మి'తో ప్రభుత్వానికి ప్రతిష్ట..

# ఆర్‌టిసికి ఆర్థిక ఇబ్బందులు

- ఆర్‌టిసికి రూ.7,375 కోట్ల బకాయిలు ఎప్పుడు ఇస్తారు?
- నిధులిచ్చి ఆర్‌టిసిని, ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాలని కార్మికుల విజ్ఞప్తి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** 'మహాలక్ష్మి' లాంటి రాయితీ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్టను సాధించి పెట్టిన ఆర్‌టిసి మాత్రం ఆర్థిక ఇబ్బందుల్లో, అప్పుల్లో కూరుకుపోతున్నది. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల విలువైన ఆర్థిక సేవలను అందించిన ఆర్‌టిసికి ప్రభుత్వం నుంచి ఆ మేరకు నిధులు మాత్రం రాకపోవడమే ఇందుకు కారణంగా కనబడుతున్నది. ఆర్‌టిసి నుంచి మహిళా ప్రయాణికులు పొందిన మొత్తం రూ.10 వేల కోట్లలో ఇప్పటివరకు ప్రభుత్వం దశలవారీగా సుమారు రూ.7400 కోట్లను విడుదల చేసింది. ఇంకా సుమారు రూ.2600 కోట్లను చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు విద్యార్థులు, వికలాంగులు, విలేకరులు, ఉద్యోగుల రాయితీలకు సంబంధించిన రూ. 1500 కోట్లను కూడా ప్రభుత్వం ఆర్‌టిసికి బకాయిపడింది. పాత రాయితీల బకాయిలు, గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెల్లించాల్సిన 'మహాలక్ష్మి', ఇతర పథకాల రాయితీల మొత్తం దాదాపు రూ.7500 కోట్లను ఆర్‌టిసికి ప్రభుత్వం బకాయిపడింది. ఫలితంగా రాయితీల బకాయిలు నిత్యం పెరిగిపోయి ఆర్‌టిసి ఆర్థికంగా కుదేలవుతున్నది. సంస్థ అంతర్గత అవసరాలకు ఉద్యోగులకు చెందిన పిఎఫ్, ఎస్‌ఆర్‌బిఎస్, ఎస్‌బిటి, సిసిఎస్ ఖాతాల నుంచి కు రూ.2,100 కోట్లను వాడుకోవడం, ఏళ్లు గడుస్తున్నాప్పటికీ తిరిగి ఆ సంస్థలకు చెల్లించకపోవడం చూస్తే ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితి ఏ విధంగా ఉందో అవగతమౌతున్నది. ఈ నేపథ్యంలో 'మహాలక్ష్మి' లాంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్ట వస్తుండగా, ఆర్‌టిసికి మాత్రం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ''కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్‌టిసి బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 'మహాలక్ష్మి పథకం' పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులమంతా మనస్ఫూర్తిగా 'మహాలక్ష్మి'పథకాన్ని స్వాగతించి విజయవంతంగా కొనసాగిస్తున్నాం. అయినా అందుకు సంబంధించిన నిధులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇవ్వడం లేదు. తమ సమస్యలను కూడా ప్రభుత్వం పరిష్కరించడం లేదు. తమ న్యాయమైన డిమాండ్లను అంగీకరించడం లేదు. మాకు వేతన సవరణ, డిఎ పెంపు లేదు. బకాయిల చెల్లింపు లేదు. ట్రేడ్ యూనియన్లు లేవు. ఉద్యోగ భద్రత కొరవడింది. ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. కనీసం ఆర్థిక వనరులతో సంబంధం లేని సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో సరేసరి... కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా మాకు న్యాయం జరగడంలేదు'' అని కార్మికులు ప్రభుత్వంపై తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2026–27 సంవత్సరానికి రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది. బడ్జెట్ శాఖల వారీగా పంపకాలు జరిగాయి. బడ్జెట్‌లో ఆర్‌టిసికి మహాలక్ష్మి పథకానికి సంబంధించి రూ.4305 కోట్లను ప్రతిపాదించింది. మహిళా ప్రయాణికులు ఆర్‌టిసి బస్సులో ప్రయాణించినందుకు ప్రభుత్వం ప్రతినెలా రూ.382 కోట్లను ఆర్‌టిసికి చెల్లించాలి. ఆ లెక్కన వార్షిక బడ్జెట్‌లో మొత్తం రూ.4,590 కోట్లు అవసరం. ఆర్‌టిసికి ఇవ్వాల్సిన దానికంటే రూ.285 కోట్లను బడ్జెట్‌లో తక్కువ పెట్టారు. రెండున్నర ఏళ్ళకాలంలో ఈ పథకానికి ప్రభుత్వం నుండి ఇంకా ఆర్‌టిసికి రావలసిన రూ. 2,500కోట్ల బకాయిలు ఉన్నాయి. మహాలక్ష్మి పథకం పాత బకాయిలు, బడ్జెట్‌లో వాస్తవ ఖర్చు కలిపి రూ. 7,375 కోట్లు కేవలం ఈ పథకానికే బడ్జెట్‌లో పెట్టాల్సి ఉంది. 'మహాలక్ష్మి పథకం రూ.10 వేల కోట్ల సేవల మార్క్ దాటిన సందర్భంగా బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగిస్తూనే ఆర్‌టిసిని కాపాడుకుంటామని రవాణా శాఖ మంత్రి ప్రకటించడం హర్షణీయమే. అయితే ప్రభుత్వం నుంచి ఆర్‌టిసికి రా వాల్సిన బకాయిలు నిత్యం పెరిగిపోతూ సంస్థ అప్పుల పాలవుతున్నదని, మరి మహాలక్ష్మి రాయితీ నిధులను, బకాయిలను ఎప్పటికప్పుడు ఇవ్వకుండా అరకొర నిధులిచ్చి ఆర్‌టిసిని ఎలా బతికిస్తారని, ఈ సంస్థను ఎలా ముందుకు తీసుకెళ్తారని కార్మికులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. 'మహాలక్ష్మి' పథకాన్ని ఉపయోగించుకుని ప్రతిష్టను పెంచుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమైన నిధులను విడుదల చేసి ఆర్‌టిసి కార్మికులను, సంస్థను తద్వారా ప్రజా రవాణా వ్యవస్థను కాపాడాలని కార్మికులు కోరుతున్నారు.

## దక్షిణ మధ్య రైల్వే రికార్డు సృష్టి

రూ. 21 వేల కోట్లకు పైగా ఆదాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే 2025–26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.21,211.92 కోట్ల స్థూల ఆదాయాన్ని నమోదు చేసి సరికొత్త శిఖరాలను అధిరోహించింది. జోన్ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే అత్యధిక ఆదాయం కావడం విశేషం. గత నాలుగు ఆర్థిక సంవత్సరాలుగా వరుసగా రికార్డు స్థాయి ఆదాయాన్ని నమోదు చేస్తున్న ఈ జోన్, 2024–25తో పోలిస్తే 2025–26లో 3.12 శాతం వృద్ధిని సాధించింది. ముఖ్యంగా సరుకు రవాణా, ప్రయాణీకుల విభాగాలలో మెరుగైన పనితీరు ఈ వృద్ధికి దోహదపడింది. సరుకు రవాణా విభాగంలో 147.87 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి రూ. 13,835.27 కోట్ల ఆదాయాన్ని సాధించింది. అదే సమయంలో ప్రయాణీకుల విభాగంలో రూ. 6,235.37 కోట్ల ఆదాయం నమోదు కాగా, ఇది గత ఏడాది కంటే 9.11 శాతం అధికం. మొత్తం 286.44 మిలియన్ల మంది ప్రయాణికులు ఈ జోన్ సేవలను వినియోగించుకున్నారు. ఇతర కోచింగ్ విభాగంలో రూ. 515.18 కోట్లు, ఇతర ఆదాయాల కింద రూ. 626.10 కోట్లు సాధించడం గమనార్హం. గత ఏడాదితో పోలిస్తే ఇతర ఆదాయాల్లో 36.98 శాతం వృద్ధి నమోదైంది. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులు, సిబ్బంది కృషిని అభినందించారు. సమిష్టి నిబద్ధత, సమన్వయంతో ఈ విజయాన్ని సాధించామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆవిష్కరణలు, సామర్థ్య మెరుగుదల, వినియోగదారుల సేవలపై దృష్టి సారించాలని సూచించారు.

## కొండచరియను ఢీకొన్న రష్యా సైనిక విమానం

30 మంది దుర్మరణం



**మాస్కో:** రష్యా సైనిక విమానం కొండ చరియను ఢీకొని పర్వత ప్రాంతంలో కుప్పకూలిపోయింది. అందులో ప్రయాణిస్తున్న 30 మంది అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎవ్వరూ సజీవంగా లేరు.భారత కాలమానం ప్రకారం మార్చి 31వ తేదీ రాత్రి 8.30 గంటలకు ప్రధాన కేంద్రంతో విమానం సంబంధాలు కోల్పోయింది.క్రిమియాలోని బఖ్‌చిసరాయ్ అరణ్యప్రాంతంలో ఎ.ఎన్–26 సైనిక రవాణా విమానం కొండ చరియను ఢీకొని కుప్పకూలిపోయిందని ఆ ప్రాంతంలో ఉన్న సాక్ష్యుల ద్వారా సమాచారం తెలిసింది. ఈ విమానంలో ఏడుగురు సిబ్బందితోపాటు 23 మంది ప్రయాణికులు ఉన్నారు. తర్వాత గాలింపు చర్యల్లో సహాయ బృందం ప్రమాద ఘటనా ప్రాంతాన్ని కనుగొన్నట్టు రష్యా రక్షణమంత్రిత్వశాఖ ప్రకటించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమికంగా అంచనావేశారు. రక్షణమంత్రిత్వ శాఖ కమిషన్ ప్రమాద స్థలంలో తన బాధ్యతలు నిర్వహిస్తోంది. ఐతే విమానానికి ఎక్కువగా ఎలాంటి నష్టం కలగలేదని వర్గాలు సమాచారం తెలియజేశాయి. రష్యన్ క్రిమినల్ కోడ్‌లోని 351వ నిడబంధన(విమానయాన నియమాలు లేదా సన్నాహక నిబంధనలు) ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేశారు.ఈ ఘటనలో ఇతరుల జోక్యం ఉందా? అనే విషయం నిర్ధారించుకునేందుకు క్రిమియాలోని అటవీ ప్రాంతంలో రష్యా దర్యాప్తు కమిటీకి చెందిన క్రిమియా గణతంత్ర–సెవస్టోపోల్ నగర ప్రధాన డైరెక్టరేట్ అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు తీవ్ర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

## హెచ్‌సిఎలో రూ.600 కోట్ల అక్రమాలు

సిఎం, సిఎస్, డిజిపికి ఫిర్యాదు చేసిన టిసిఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో భారీ ఆర్థిక అక్రమాలు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, డిజిపి బి. శివదర్ రెడ్డి, అదనపు డిజిపి (సిఐడి) చారు సిన్హా లకు ఫిర్యాదు చేశారు. గత రెండు దశాబ్దాలుగా క్రికెట్ అభివృద్ధి పేరుతో వచ్చిన నిధులను వ్యవస్థాగతంగా మళ్లించి దుర్వినియోగం చేశారని, దీనివల్ల అంచనా రూ.600 కోట్లకు పైగా నష్టం జరిగిందని టిసిఎ ఆరోపించింది. ఇందులో రూ.69 కోట్ల విశాఖ ఇండస్ట్రీస్ ఆర్బిట్రేషన్ చెల్లింపుల స్కామ్ కీలకంగా ఉందని పేర్కొంది. అదేవిధంగా ఐపిఎల్ టికెట్ల బ్లాక్ మార్కెటింగ్, ప్రతిపాదిత టి20 లీగ్ జట్లను బ్యాక్‌డోర్ డీల్స్ ద్వారా విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో వెల్లడించింది. ప్రభుత్వ, మున్సిపల్ ఆస్తులైన జిహెచ్‌ఎంసి, ఎంసిహెచ్‌కు చెందిన 17 క్రికెట్ క్లబ్‌లను అక్రమంగా ప్రైవేటీకరించి, ఒక్కో క్లబ్‌ను రూ.2 నుంచి రూ.2.5 కోట్ల వరకు తీసుకొని ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేశారని ఆరోపించింది. అలాగే 103 అసలు క్లబ్‌లను మాయం చేసి, 80కి పైగా నకిలీ క్లబ్‌లను చేర్చి ఎన్నికలు, ఓటర్ లిస్టులను మానిప్యులేట్ చేసినట్లు పేర్కొంది. ఈ అంశాలపై జస్టిస్ ఎ.ఆర్.దవే, జస్టిస్ ఎన్.ఎ.కక్రు, జస్టిస్ ఎల్. నాగేశ్వర రావు కమిటీలు కూడా తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు టిసిఎ తెలిపింది. అలాగే సుప్రీంకోర్టులో సాగుతున్న ఎస్‌ఎల్‌పి నం. 6779/2021 విచారణలో కూడా ధృవీకరించిన సభ్యత్వ రిజిస్టర్ లేకపోవడం వంటి అక్రమాలు బయటపడినట్లు పేర్కొంది. ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే సిఐడి, ఎసిబి, సిట్ విచారణ చేపట్టాలని, హెచ్‌సిఎ బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయాలని, రికార్డులను స్వాధీనం చేసుకోవాలని, బాధ్యుల ఆస్తులను అటాచ్ చేసి దోచుకున్న నిధులను రికవరీ చేయాలని టిసిఎ డిమాండ్ చేసింది. అదేవిధంగా అక్రమంగా బదిలీ అయిన జిహెచ్‌ఎంసి, ఎంసిహెచ్ క్లబ్‌లను తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని కోరింది.

## వయోవృద్ధుల సంక్షేమం, భద్రతే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్


**ప్రజాపక్షం/జగిత్యాల :** వయోవృద్ధుల సంక్షేమం, భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ, పర్యవేక్షణ చట్టం అమలుపై బుధవారం జగిత్యాల కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధులతో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని ఉద్యోగులు తమ వయోవృద్ధుల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆర్థిక, వైద్య అవసరాలను తీర్చేందుకు ఉద్యోగులు తమ వేతనం నుంచి కనీసం 15 శాతం లేదా రూ. 10వేలు ఏది ఎక్కువైతే ఆ మొత్తాన్ని కేటాయించి నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ బిల్లు అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. తల్లిదండ్రుల సంరక్షణలో నిర్లక్ష్యం చూపిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకునేలా ఈ బిల్లు నిబంధనలు రూపొందించబడినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులు స్వీకరించిన 60 రోజుల లోపు పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.
ఈ బిల్లు ద్వారా రాష్ట్రంలో వృద్ధుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేసి, కుటుంబ బాధ్యతలను చట్టబద్ధంగా అమలు చేయడం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వయోవృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక, నైతిక బాధ్యత అని వివరించారు. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును రూపొందించినట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల కోసం దేశంలోనే మొట్టమొదటి సారిగా పూర్తి స్థాయిలో పటిష్టమైన బిల్లును ప్రవేశ పెట్టి ఆమో దం తెలిపేలా కృషి చేసిన సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కేం ద్రంలో ఏర్పాటు చేసిన వయోవృద్ధుల భవనాని కి అన్ని వసతులు కల్పించేలా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకవచ్చిన ఈ బిల్లు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ వయోవృద్ధులసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రూపొందించిన ఈ బిల్లును జిల్లాలో సమర్థవం తంగా అమలు చేస్తామన్నారు. అనంతరం వ యోవృద్ధుల శాఖ డైరెక్టర్ శైలజ వయోవృద్ధుల సంక్షేమం, ప్రభుత్వం అమలులోకి తీసుకవచ్చిన నూతన బిల్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదనపు కలెక్టరులు లత, రాజ గౌడ్, లైబ్రరీ చైర్మన్ దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వాణి, సంక్షేమ శాఖ అధికారి రాజ్ కుమార్, సీనియర్ సిటిజన్ల నాయకుడు హరి అశోక్ కుమార్‌ఉన్నారు.

## మొయినాబాద్ డ్రగ్ కేసులో కస్టడీ విచారణ ముమ్మరం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొయినాబాద్ ఫార్మ్‌హౌస్ డ్రగ్ కేసులో దర్యాప్తు అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు కీలక నిందితులను చంచల్‌గూడ కేంద్ర కారాగారం నుంచి బుధవా రం కస్టడీలోకి తీసుకుని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్ ) ప్రశ్నించింది. మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారి నమిత్ శర్మలను వేర్వేరుగా పలువురు అధికారులు గంటల తరబడి విచారించినట్లు సమాచారం. ఫార్మ్‌హౌస్‌లో జరిగిన పార్టీ, డ్రగ్స్ వినియోగం, సరఫరా మార్గాలు, అలాగే తు పాకీ కాల్పుల ఘటనపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి, ఎవరు సరఫరా చేశారు అనే అంశాలపై పదేపదే ప్రశ్నించగా, తమకు సరఫరాదారుల వివరాలు తెలియవని నిందితులు తెలిపినట్లు తెలుస్తోం ది. మరోవైపు పరీక్షల్లో ముగ్గురు నిందితులు డ్రగ్స్ వినియోగించినట్లు ఇప్పటికే నిర్ధారణ కావడంతో, ఆ దిశగా కూడా విచారణ కొనసాగుతోంది. నమిత్ శర్మ కు సంబంధించిన తుపాకీ కాల్పుల ఘటనపై కూడా అధికారులు వివరాలు సేకరించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించడంతో కాల్పులు జరిపానని అత డు చెప్పినట్లు సమాచారం. ఇదిలా ఉండగా డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌పై పోలీసు లు దృష్టి కేంద్రీకరించి, గోవా కనెక్షన్ సహా ఇతర కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. కస్టడీ విచారణలో లభించిన వివరాల ఆధారంగా మరికొంతమంది నిందితులను గుర్తించి అరెస్ట్ చేసే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

## ఎసిబి తనిఖీలలో విస్తుపోయే నిజాలు

రూ.14.23 కోట్లు వసూలు కాలేదా?
బిల్ కలెక్టర్, మేనేజర్, సిబ్బంది మధ్య అనుమానాస్పద లావాదేవీలేమిటి?




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** సత్తుపల్లి మున్సిపాలిటీలో మంగళవారం ఉదయం నుండి బుధవారం తెల్లవారు జాము 4 గంటల వరకు సాగిన ఎసిబి అధికారుల సోదాలలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిపిన తనిఖీల్లో రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పన్నులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, కార్యాలయం యొక్క మొత్తం పని తీరును తనిఖీ చేయగా, ఈ క్రింది అవకతవకలు గమనించబడినట్లు ఎసిబి డి.ఎస్.పి రమేష్ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీంకు రూ.16,44,15,000 వసూలు కావాల్సి ఉండగా, రూ.3,36,00,000 మాత్రమే వసూలైనట్లు రికార్డులు చెపుతున్నాయి. ఇంకా రూ. 13,08,15,000 వసూలు కాకపోవటానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎల్ ఆర్‌ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకున్న వారు తప్పకుండా పైసాతో సహా కట్టి పనులు చేసుకుంటారు కాని ఇక్కడ సుమారు రూ.13 కోట్లు వసూలు కాకపోవటానికి అధికారులకే తెలియాలి. అదే విధంగా ఆస్తి పన్ను రూ.5,12,68,000 రావాల్సి ఉండగా, రూ. 4,09,85,000 వసూలు కాగా ఇంకా రూ. 1,02,83.000 బ్యా లన్స్ ఉంది. షాపింగ్ కాంప్లెక్స్ ఆస్తి పన్ను రూ. 62, 61,525 రావాల్సి ఉండగా కేవలం రూ.53, 38, 655 వసూలైనట్లు అధికారులు రికార్డులలో చూపగా, రూ.8,72,870 రావాల్సి ఉంది. ప్రకటన పన్ను రూ.3,80,679 రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా వసూలు కాకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. మొత్తంగా రూ.22,23,25,204 రావాల్సి ఉండగా, కేవలం రూ.7,99,23,655 వసూలు కాగా, సుమారు రూ.14,23,51,549 వసూలు కావాల్సి ఉన్నట్లు తెలుస్తుంది. ఎసిబి అధికారుల సోదాల్లో సిబ్బంది మొ బైల్ ఫోన్‌లను తనిఖీ చేసే సమయంలో అనుమానాస్పద లావాదేవీలు గమనించబడ్డిన ట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా సత్తుపల్లి మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ నాగుబండి నరసింహారావు మొబైల్ ఫోన్‌లో, సత్తుపల్లి మున్సిపాలిటీ మేనేజర్ ఎం.శ్రీనివాస్, ఇతరులు పాల్గొన్న అనుమానాస్పద లావాదేవీలు వెల్లడయ్యాయన్నట్లు తెలుస్తుంది. ధృవీకరణ సమయంలో, రికార్డుల నిర్వహణ, ఆదాయాల వసూళ్లలో మరికొన్ని అవకతవకలు కూడా గమనించబడ్డినట్లు తెలుస్తుంది. లోపాల పరిధిని నిర్ధారించడానికి, సంబంధిత అధికారులపై బాధ్యతను నిర్ణయించడానికి రికార్డుల త దుపరి పరిశీలన కొనసాగుతోందన్నారు. బాధ్యులైన మున్సిపల్ అధికారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి ఒక సవివరమైన నివేదిక సమర్పించబడుతుందన్నారు. ఏదైనా ప్రభుత్వ అధికారి లంచం డిమాండ్ చేసిన సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ప్రజలు ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించవలసిందిగా కోరారు. ఎసిబి తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్ బుక్ (తెలంగాణ ఎసిబి), ట్విట్టర్ తెలంగాణ ఎసిబి ద్వారా కూడా సంప్రదించవచ్చునన్నారు. తెలంగాణ ఎసిబిని సంప్రదించడానికి, ఎసిబి క్యూఆర్ కోడ్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించబడుతుందని, బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎసిబి డిఎస్ రమేష్ తెలిపారు.

### ఎఫ్‌సిఆర్ఎ బిల్లు వ్యతిరేకిస్తూ...

# ప్రతిపక్ష ఎంపిల నిరసన




**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేతృత్వంలోని పలువురు ప్రతిపక్ష ఎంపిలు బుధవారం పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ప్రతిపాదిత చట్టాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. 'ఎన్జీవోలు, సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం ఆపండి' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను ప్రదర్శిస్తూ, ఎంపిలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో పలువురు కాంగ్రెస్ ఎంపిలు, ఎస్‌పికి చెందిన డింపుల్ యాదవ్, రామ్ గోపాల్ యాదవ్, ఐయుఎంఎల్‌కు చెందిన ఇటి మహమ్మద్ బషీర్, ఎన్‌సిపి(ఎస్‌పి)కి చెందిన సుప్రియా సూలే, ఆర్ఎస్‌పికి చెందిన ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ తదితరులు పాల్గొన్నారు. పార్లమెంటులో ఎఫ్‌సిఆర్ఎ సవరణలను బిజెపి బుల్డోజర్‌తో ఆమోదింపజేయడానికి ప్రణాళిక రచిస్తోందని, స్పష్టంగా రాజ్యాంగ విరుద్ధమైన, క్రూరమైన బిల్లును ఆమోదించనివ్వబోమని కాంగ్రెస్ మంగళవారం ఆరోపించింది. బుధవారం పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు, పార్టీ ఎంపిలు తక్షణమే ఢిల్లీకి చేరుకోవాలని కోరినట్లు కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్ఎ)ను సవరించే బిల్లును మార్చి 25న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విదేశీ నిధుల ద్వారా బలవంతపు మత మార్పిడులకు పాల్పడే వ్యక్తులను వదిలిపెట్టబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. విదేశీ విరాళాల (నియంత్రణ) సవరణ బిల్లు, 2026ను ప్రవేశపెడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, ఈ చట్టం పారదర్శకతను పెంచడం, విదేశాల నుండి అందిన నిధుల సరైన వినియోగాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. అంతకుముందు మంగళవారం, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లు కేవలం జాతీయ భద్రత, ప్రయోజనాలకు వ్యతిరేకంగా విదేశీ నిధుల వినియోగాన్ని ఆపడానికే ఉద్దేశించబడిందని, ఏ మత సంస్థను లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు.

# వాణిజ్య గ్యాస్ ధర భారీగా పెంపు

### రూ.2వేలు దాటిన సిలిండర్
### ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలదీ అదే దారి

**న్యూఢిల్లీ :** ట్రంప్ తెచ్చిన యుద్ధం ప్రపంచ దేశాల ఆర్థిక, ప్రజా వ్యవస్థలను అతలాకుతలం చేస్తోంది. ఇక భారతదేశంలోనూ పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధంతో ప్రపంచమంతటా చమురు, గ్యాస్ సంక్షోభానికి దారితీసింది. భారత్‌లో మోదీ సర్కార్ పరిస్థితి అదుపులోనే ఉందని చెప్పుకొస్తున్నప్పటికీ పెట్రో, గ్యాస్ ధరలు పెరుగుతూ వస్తున్నాయి. తాజాగా ఢిల్లీలో 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.195 పెరగడంతో అది రూ.2,078.50కు చేరింది. అదే సమయంలో 5 కిలోల ఎఫ్‌టిఎల్ సిలిండర్ ధర ఇప్పుడు ఒక్కో రీఫిల్‌కు రూ.549 గా ఉంది. ఇది రూ.51 పెరుగుదలను ప్రతిబింబిస్తోందని ఆ వర్గాలు తెలిపాయి. కోల్‌కతాలో 19కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధర రూ.218 పెరిగింది. మరోవైపు, గహావసరాల వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధరలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. చివరిసారిగా మార్చి 7న 14.2 కిలోల సిలిండర్‌పై రూ.60 పెంచిన తర్వాత ప్రస్తుతం ఆ ధరల్లో ఎటువంటి మార్పు లేదు. ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర రూ.913 గా ఉంది. 19 కేజీల సిలిండర్‌పై చివరిసారిగా మార్చి 1 న రూ.114.5 మేర పెరిగింది. అయితే పెట్రోల్, డీజిల్, గహ వినియోగ ఎల్‌పీజీ ధరలలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర ప్రభుత్వం బుధవారం స్పష్టం చేసింది. ఢిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు రూ.94.77, డీజిల్ ధర లీటరుకు రూ.87.67 గానే ఉంది. గత నెలలో ప్రపంచ పెట్రోలియం ధరలు 100 శాతం వరకు పెరిగినప్పటికీ, ఏప్రిల్ 1, 2026 నాటికి ఉన్న ఆర్ఎస్‌పీ స్థాయి ప్రకారం, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు పెట్రోల్‌పై లీటరుకు రూ.24.40, డీజిల్‌పై లీటరుకు రూ.104.99 నష్టాన్ని చవిచూస్తున్నాయి. కేవలం ప్రీమియం పెట్రోల్ ధర మాత్రమే మునుపటి కంటే పెరిగింది. గత వారం ప్రీమియం పెట్రోల్ శ్రేణులయిన ఎక్స్‌పీ 95, పవర్ 95, స్పీడ్ అధిక ఆక్టేన్ కలిగిన ఉత్పత్తులపై లీటరుకు రూ.2 చొప్పున ధరలను పెంచారు. ఢిల్లీలో ఎక్స్‌పీ 100 పెట్రోల్ ధర ఇప్పుడు లీటరుకు రూ.160 కి చేరింది. ఇంతకు ముందు దీని ధర రూ.149 ఉండేది. ఎక్స్ గ్రీన్ ప్రీమియం డీజిల్ ధర ఇప్పుడు లీటరుకు రూ.92.99గా ఉంది. ఇంతకుముందు దీని ధర రూ.91.49 ఉండేది. అంతర్జాతీయ మార్గాల్లో ప్రయాణించే దేశీయ విమానయాన సంస్థలకు ఎటిఎఫ్ ధరలు కూడా భారీగా పెరిగాయి. ఢిల్లీలో ఏటీఎఫ్ ధరలను మొదటగా కిలో లీటరుకు రూ.96,638.14 నుంచి రూ.2,07,341.22కు పెంచారు. ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.2 లక్షల మార్కును దాటడం ఇదే మొదటిసారి. కోల్‌కతాలో ఇది కిలో లీటరుకు రూ.2,05,953.33 గా నమోదయింది. ముంబైలో ఏటీఎఫ్ ధర కిలో లీటరుకు రూ.1,94,968.67 గా, చెన్నైలో కిలో లీటరుకు రూ.2,14,597.66 గా ఉంది. ఈ ధరల పెరుగుదల విమానయాన సంస్థల కార్యకలాపాలపై, మొత్తం విమాన ప్రయాణ ఖర్చులపై ప్రభావం చూపుతోంది.




## మార్చిలో రూ.2లక్షల కోట్లకు పైగా జిఎస్‌టి వసూళ్లు

### ఇవి 2025-26 ఆర్థిక సంవత్సరంలో 3వ అత్యధిక నెలవారీ వసూళ్లని ప్రభుత్వ గణాంకాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** దిగుమతులు, దేశీయ అమ్మకాలు కొనుగోళ్ల ద్వారా వసూళ్లు పెరగడంతో మార్చి నెలలో జిఎస్‌టి రాబడులు సుమారు 9శాతం పెరిగి పన్నుకోతకు ముందుస్థాయి అయిన రూ. 2లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది 2025–26 ఆర్థిక సంవత్సరంలో మూడవ అత్యధిక నెలవారీ వసూళ్లు అని బుధవారం ప్రభుత్వగణాంకాలు వెల్లడించాయి. ఈ నెలలో స్థూల దేశీయ ఆదాయాలు 5.9శాతం పెరిగి ర.1.46లక్షల కోట్లకు పైగా చేరగా, దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం 17.8శాతం పెరిగి రూ.53.861 కోట్లకు చేరుకున్నాయి. మార్చి 2025లో స్థూల వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు రూ.1.8లక్షల కోట్లుగా ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్, మార్చి) 2026లో మూడవ అత్యధిక వసూళ్లు నమోదు కాగా, ఏప్రిల్ 2025లో రూ.2.36లక్షల కోట్లకు పైగా అత్యధిక జిఎస్‌టి ఆదాయాలు నమోదయ్యాయి. ఆ తర్వాత మే నెలలో రూ.2.01లక్షల కోట్లకు పైగా వసూళ్లు నమోదయ్యాయి.

2025–26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి జిఎస్‌టి వసూళ్లు గతేడాదితో పోలిస్తే 8.3శాతం వృద్ధి చెంది రూ.22.27లక్షల కోట్లకు చేరాయి. సెప్టెంబరు 2025 నుండి అమలులోకి వచ్చేలా సుమారు 375 వస్తువులపై జిఎస్‌టి రేట్లను తగ్గించడంతో వస్తువుల ధరలు తగ్గాయి. అలాగే 5, 12, 18 శాతం ఉన్న నాలుగు పన్ను శ్లాబులను 5, 18 శాతంగా ఉన్న రెండు శ్లాబులుగా విలీనం చేశారు. ఎంపిక చేసిన కొన్ని అత్యంత విలాసవంతమైన వస్తువులు పొగాకు ఉత్పత్తులకు అత్యధికంగా 40సెంట్ల శ్లాబులను కేటాయించారు. పన్ను అమలు జరిగిన మొదటి నెలలో జిఎస్‌టి వసూళ్లు తొలుత తగ్గాయి. నవంబరులో రాబడి రూ.1.70లక్షల కోట్లకు పడిపోయింది. ఇది డిసెంబరులో రూ.1.74లక్షల కోట్లకు, జనవరిలో మరో రూ.1.93లక్షల కోట్లకు పెరిగింది. ఫిబ్రవరిలో ఇది రూ.1.83లక్షల కోట్లకు పైగా ఉంది. కాగా మార్చి నెలలో రీఫండ్ జారీ 13.8శాతానికి పెరిగి రూ.22,074 కోట్లకు చేరిందని తాజా గణాంకాలు వెల్లడించాయి. రీఫండ్‌లను సర్దుబాటు చేసిన అనంతరం మార్చి నెలలో నికర జిఎస్‌టి రాబడి సుమారు రూ.1.78లక్షల కోట్లుగా నమోదైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే 8.2 శాతం అధికం. డెలాయిట్ ఇండియా భాగస్వామి ఎం.మణి మాట్లాడుతూ ఈ వసూళ్లు వినియోగ సెంటిమెంట్ బలంగా కొనసాగుతోందని సూచిస్తున్నప్పటికీ స్థూల జిఎస్‌టి వసూళ్లలో 8శాతానికి పైగా వృద్ధికి, ప్రభావవంతమైన జిఎస్‌టి వసూళ్లు గణనీయంగా దోహదపడటం ఆసక్తికరంగా ఉందని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలు బలమైన వృద్ధిని కొనసాగిస్తుండగా హర్యానా, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు నెమ్మదైన వృద్ధిని కనబరుస్తున్నాయి.

### భారత్ అధిక దిగుమతి సుంకాలతో పాటు...

# సుంకాలేతర అడ్డంకులనూ విధిస్తోంది


### అమెరికా '2026 జాతీయ వాణిజ్య అంచనా (ఎన్‌టిఇ)' నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు, మద్యపానీయాలతో సహా పలు రకాల వస్తువులపై భారతదేశం అధిక దిగుమతి సుంకాలతో పాటు వివిధ సుంకాలయేతర అడ్డంకులను కూడా విధిస్తోందని అమెరికా పునరుద్ఘాటించింది. తమ సుంకాలు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్యుటిఓ) నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని భారతదేశం ఎల్లప్పుడూ చెబుతూ వస్తోంది. మార్చి 31న విడుదలైన విదేశీ వాణిజ్య అవరోధాపై యుఎస్ వాణిజ్య ప్రతినిధి సంబంధిత 2026 జాతీయ వాణిజ్య అంచనా (ఎన్‌టిఇ) నివేదిక ప్రకారం డబ్ల్యుటిఓ నిర్దేశిత, అమలలో ఉన్న రేట్ల మధ్య పెద్ద వ్యత్యాసం కారణంగా వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులు రెండింటిపై సుంకాలను ఎప్పుడైనా మార్చడానికి భారతదేశానికి గణనీయమైన వెసులుబాటు ఉంది. ఇది యుఎస్ కార్మికులు, రైతులు, పశుపోషకులు, ఎగుమతిదారులకు తీవ్రమైన అనిశ్చితిని సృష్టిస్తోంది. ఇది ఒక వార్షిక నివేదిక. యునైటెడ్ స్టేట్స్ ఎగుమతులు, పెట్టుబడులు, డిజిటల్ వాణిజ్యాన్ని ప్రభావితం చేసే దేశాల కీలక విధానాలు, పద్ధతులను జాబితా చేస్తోంది. 2025లో కూడా భారతదేశంలో దిగుమతి సుంకాలు ఎక్కువగా ఉన్నాయని ఈ నివేదిక ఆరోపించింది. ఈ నివేదిక అమెరికా భారతదేశం మధ్య సుంకాలు, సుంకేతర అడ్డంకులు, మేధో సంపత్తి. సేవలు, డిజిటల్ వాణిజ్యం, పారదర్శకత వంటి పలు వాణిజ్య నియంత్రణ సవాళ్లను వెలుగులోకి తెచ్చింది. వాణిజ్య నిపుణుల ప్రకారం చాలా సమస్యలు గతంలో వచ్చిన నివేదికల పునరావృతాలే కాగా కొన్ని ఇప్పటికే పరిష్కరించబడ్డాయి. కీలక విధానాలు, పద్ధతులను జాబితా చేస్తోంది. భాకతదేశం అనేక రకాల వస్తువులపై అధిక సుంకాలను విధిస్తోంది. వాటిలో కూరగాయల నూనెలు (45శాతం వరకు) : యాపిల్, మొక్కజొన్న, మోటారు సైకిళ్లు (50శాతం), ఆటో మొబైల్స్, పువ్వులు (60 శాతం), సహజ రబ్బరు (70శాతంబ), కాఫీ, రైసిన్స్, వాల్‌నట్స్(100 శాతం): ఆల్కహాలిక్ బెవరేజెస్ (150శాతం) ఉన్నాయి' అని ఆ నివేదిక తెలియజేసింది. దీనికితోడు ప్రాణ రక్షక మందులు, ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర మందుల జాబితాలో ఉన్న పూర్తిస్థాయి మందులతో సహ ఔషధ ఫార్ములేషన్లపై భారతదేశం చాలా అధిక ప్రాథమిక కస్టమ్స్ సుంకాలను విధిస్తోందని నివేదిక పేర్కొంది.'అధిక సుంకాల రేట్లు కూడా వాణిజ్యానికి గణనీయమైన అవరోధంగా కూడా నిలుస్తోంది. ఇతర వ్యవసాయ ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు (ఉదాహరణకు చికెన్, బంగాళాదుంపలు, సిట్రస్, బాదం, పెకాన్లు, ఆపిల్స్, ద్రాక్ష, డబ్బాలలోని పీచెస్, చాక్లెట్, గడ్డకట్టిన ఫ్రెంచ్ ఫ్రైస్, ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్లలో ఉపయోగించే ఇతర సిద్ధం చేసిన ఆహారాలు' అని నివేదిక వివరించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన వ్యవసాయ ఉత్పత్తులపై భారతదేశ సుంకం రేట్లు ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్నాయి. ఇవి సగటున 113.1శాతం నుంచి గరిష్ఠంగా 300శాతం వరకూ ఉన్నాయి. భారతదేశం పలు రకాల వ్యవసాయ ఉత్పత్తులపై సర్‌చార్జ్‌ను తరచూ మారుస్తుందని ఆ నివేదిక పేర్కొంది. భారతదేశపు టారిఫ్ రేట్లను వార్షిక బడ్జెట్‌తో పాటు ప్రకటిస్తారని, ప్రజాభిప్రాయ సేకరణకు అవకాశం ఇవ్వకుండా గెజిట్‌లో నోటిఫికేషన్ల ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన సవరిస్తారని కూడా ఆ నివేదిక ఆరోపించింది. ఉత్పత్తి వినియోగదారుడు ఉద్దేశించిన ఉపయోగం లేదా నిర్దిష్ట ఎగుమతి ప్రయోజనాన్ని బట్టి సుంకాల రేట్లు అనేక మినహాయింపులకు లోబడి ఉంటాయి. భారతదేశంలో ఒక సమగ్ర ప్రభుత్వ విధానం కొరవడిందని, దాని ఫలితంగా ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల మధ్య ప్రభుత్వ సేకరణ పద్ధతులు, విధానాలు విభిన్నంగా ఉంటాయని ఆ నివేదిక పేర్కొంది.గత సంవత్సరం మాదిరిగానే ఈ నివేదిక మేధో సంపత్తి విధానాలు, సేవల రంగానికి సంబంధించిన వివిధ ఆందోళనలను ఎత్తిచూపింది. ఆర్థిక సేవలు, రిటైల్ సహా కొన్ని ప్రధాన రంగాలలోని వ్యాపారాలలో విదేశీ పెట్టుబడులు, విదేశీ ఈక్విటీకి లోబడి ఉంటాయి. వృత్తిపరమైన సేవలలో విదేశీ భాగస్వామ్యం గణనీయంగా పరిమితం చేయబడిందని తెలిపింది.అంతేకాకుండా ఎలక్ట్రానిక్ చెల్లింపుల ప్రదాతలపై విధించినటువంటి డిజిటల్ వాణిజ్యం, ఎలక్ట్రానిక్ లావాదేవీలకు ఉన్న అడ్డంకులు అనేకరకాల సేవలపై పరోక్ష ప్రభావం చూపుతాయని నివేదిక వెల్లడించింది. భారతదేశం ఇటీవల సంవత్సరాలలో అనేకసార్లు స్థానికంగా ఇంటర్నెట్‌ను నిలిపివేసిందని, ఈ నిలిపివేతలు సమాచారం, సేవలకు ప్రాప్యతను పరిమితం చేస్తూ వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని, తద్వారా స్వేచ్ఛాయుత, బహిరంగ ఇంటర్నెట్‌ను బలహీనపరుస్తూ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్నాయని నివేదిక పేర్కొంది. వీటి ప్రభావాన్ని అమెరికా సంయుక్త రాష్ట్రాలు పర్యవేక్షిస్తూనే ఉందని సేవల ఎగుమతులతో సహా యునైటెడ్ స్టేట్స్ వాణిజ్యం, పెట్టుబడులపై సంఘటనలను అది జోడించింది.

### యుపి, మణిపూర్‌లా తమిళనాడులో

## హింసను సృష్టించేందుకు బిజెపి కుట్ర

### ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శ



**తిరుచిరాపల్లి :** ఉత్తరప్రదేశ్, మణిపూర్ మాదిరిగా తమిళనాడులో హింసను సృష్టించడానికి బిజెపి కుట్ర పన్నిందని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆరోపించారు. అయితే, ఆ కుట్రను తాము అధిగమించామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం తిరుచిరాపల్లిలో జరిగిన డిఎంకె ర్యాలీలో ప్రసంగిస్తూ, అధికార డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్, తమ ప్రభుత్వం తిరుచిరాపల్లి ప్రాంతంలో అమలు చేసిన పథకాలను వివరించారు. పంచాపూర్ బస్ టెర్మినస్, మినీస్టేడియం, జల్లికట్టు అరేనా, మోడల్ స్కూళ్లు, సంయుక్త తాగునీటి పథకాల వంటి కార్యక్రమాలను ఆయన ప్రస్తావించారు. తమ పార్టీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే, ఈ ప్రాంతంలో కామరాజర్ పేరుతో ఒక మెగా లైబ్రరీ, ఒక టైడెల్ పార్క్, ఒక ఒలింపిక్ అకాడమీని ప్రారంభించనున్నామని, తిరుచిరాపల్లి అభివృద్ధి రాజధాని నగరం చెన్నైకి ఒక సవాలు అని ఆయన అన్నారు. గత ఐదేళ్లలో తిరుచిరాపల్లికి రూ. 26,066 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తయ్యాయని, అందుకే మీ ఓట్లు కోరుతూ వచ్చాను అని స్టాలిన్ అన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో సహా, తమ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని ఆయన పేర్కొన్నారు. అలాగే, 9 లక్షల మంది విద్యార్థులకు ఉన్నత విద్య కోసం నెలకు రూ. 1,000 చొప్పున సహాయం అందిందని ఆయన నొక్కి చెప్పారు. ఈ ఏడాది జనవరిలో, పంట పండుగ పొంగల్ సందర్భంగా బియ్యం రేషన్ కార్డుదారులందరికీ రూ. 3,000 నగదు బహుమతిని అందించారు. ఫిబ్రవరిలో 1.31 కోట్ల మంది మహిళా లబ్ధిదారులకు రూ. 5,000 పంపిణీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు రూ. 2,000 వేసవి గ్రాంటుకు అదనంగా, 3 నెలలకు సరిపడా నెలకు రూ. 1,000 చొప్పున ఈ సహాయం అందించారు మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రకటించిన హామీతో కూడిన పింఛను పథకం (టిఎపిఎస్) గురించి కూడా ఆయన ప్రస్తావించారు. 'అన్నింటికంటే ముఖ్యంగా, తమిళనాడులో కుల ఘర్షణలు లేవు, బిజెపి పాలిత రాష్ట్రాల్లో కనిపించినటువంటి మత పరమైన ఘర్షణలు లేవు. ఉత్తరప్రదేశ్‌లో కనిపించినటువంటి మూకదాడులు లేవు. మణిపూర్‌లో లాగా నిరంతర హింస లేదు' అని ఆయన పేర్కొన్నారు. 'ఈ పరిస్థితులన్నింటినీ సృష్టించడానికి బిజెపి పన్నిన కుట్రలను కూడా మేము భగ్నం చేశాము. మా పాలనలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కారణంగానే నేడు తమిళనాడుకు పెట్టుబడులు తరలి వస్తున్నాయి. ఈ వృద్ధిని తదుపరి స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఆ లక్ష్య సాధన కోసం ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికగా డిఎంకె ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశాను' అని స్టాలిన్ పేర్కొన్నారు.

## అసోంలో వనరులన్నీ ఒకే కుటుంబం దోచుకుంటోంది

### ప్రజలకు ఏమీ లేకుండా పోయింది : ప్రియాంకాగాంధీ



**నజీరా/టింగ్‌ఖోంగ్ :** అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా విమర్శలు గుప్పించారు. వనరులతో సమృద్ధిగా ఉన్న ఈ రాష్ట్రంలో అంతా ఒకే కుటుంబం దోచుకుంటోందని, ప్రజలకు ఏమీ లేకుండా పోయిందని ఆమె ఆరోపించారు. బిజెపి ప్రభుత్వం ప్రజలను బెదిరిస్తూ పనిచేస్తోందని కూడా వాద్రా ఆరోపించారు. ప్రతిపక్ష నాయకుడు, పార్టీ అభ్యర్థి అయిన దేబబ్రత సైకియాకు మద్దతుగా బుధవారం నజీరాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన అమెరికాకు బానిస అని ఆరోపించారు. అసోంలో ఒకే కుటుంబం అంతా దోచుకుంటోందని, వాళ్లు దోచుకోనప్పుడు, గనులు, భూములు, ఇతర ఆస్తులన్నింటినీ పెద్ద పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నారని మండిపడ్డారు. అసోంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో అన్ని రంగాలలోనూ భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, ఆమె శారద, స్మార్ట్ సిటీ, ఎన్‌సి హిల్స్ వంటి అనేక పాత కుంభకోణాలను మళ్ళీ ప్రస్తావించారు. 'తాము డబుల్‌ఇంజిన్ ప్రభుత్వాన్ని ఇచ్చామని బిజెపి చెప్పింది. వాస్తవానికి, ఇది డబుల్‌గులామీ (బానిసత్వ) ప్రభుత్వం. ప్రధాని మోదీ అమెరికాకు బానిసగా ఉన్నారు, హిమంత బిస్వా శర్మ మోదీకి బానిసగా ఉన్నారు' అని వాద్రా ఆరోపించారు. తేయాకు తోట కార్మికుల రోజువారీ వేతనాలు పెంచుతామన్న వాగ్దానాన్ని నెరవేర్చడంలో విఫలమైనందుకు ఆమె బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తోటల ప్రజలు కూడా అదే విధంగా ఇబ్బందులు పడుతున్నారని ఆమె నొక్కి చెప్పారు. 'వివిధ గిరిజన వర్గాలు ఏళ్లుగా ఎస్‌టి హోదా కోసం డిమాండ్ చేస్తున్నాయి.

వారికి ఎస్‌టి హోదా కల్పిస్తామని బిజెపి హామీ ఇచ్చింది, కానీ ఇవ్వడంలో విఫలమైంది' అని ఆ లోక్‌సభ ఎంపి అన్నారు. వివిధ ప్రభుత్వ పథకాల నుండి, ముఖ్యంగా ప్రతిష్టాత్మక పేదరిక నిర్మూలన పథకం 'అరుణోదయ్' నుండి వారి పేర్లను తొలగిస్తామని బెదిరించి, ప్రధాని, ముఖ్యమంత్రి ర్యాలీలకు హాజరయ్యేలా అసోం మహిళలను బలవంతం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. 'ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి హిమంత దేశాన్ని, రాష్ట్రాన్ని భయం, బెదిరింపులతో పాలిస్తున్నారు. మా పోరాటం ఆ భయానికి వ్యతిరేకంగా, అసోం సంస్కృతి, నాగరికతను పరిరక్షించడం కోసమే' అని వాద్రా ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అభ్యర్థి బిపుల్ గొగోయికి మద్దతుగా టింగ్‌ఖోంగ్‌లో జరిగిన తన రెండవ ఎన్నికల సభలో ప్రసంగిస్తూ, అసోంలో భూమి, గనులు, చరిత్ర, ప్రకృతి, అడవులు, మరెన్నో వనరులు ఉన్నాయని వాద్రా పేర్కొన్నారు. 'ఈ నేల మీకు అన్నీ ఇచ్చింది. అయినా సరే, ప్రజల వద్ద ఏమీ లేదు. అసోంలో కేవలం ఒక్క కుటుంబం మాత్రమే సుసంపన్నమవుతోంది' అని ఆమె సభికులతో అన్నారు. రాష్ట్రం 'మాఫియా, సిండికేట్ల' చేతుల్లో నడుస్తోందని, ప్రభుత్వం ప్రజలను బెదిరిస్తూ పాలన సాగిస్తోందని కాంగ్రెస్ నాయకురాలు ఆరోపించారు.

గత ఏడాది సెప్టెంబరులో సింగపూర్‌లో ఈత కొడుతుండగా మరణించిన ప్రముఖ సంగీతకారుడు జుబీన్ గార్గ్, అసోం గళమని; ఆయన సౌభ్రాతృత్వం, ఐక్యత, ప్రేమ కోసం పాటలు పాడారని వాద్రా అన్నారు. 'కానీ అసోం ప్రభుత్వం ఆయన కుటుంబానికి ఎటువంటి న్యాయం చేయలేదు. జుబీన్ గార్గ్‌కు 100 రోజుల్లోనే న్యాయం చేసే ప్రభుత్వాన్ని మేము అధికారంలోకి తీసుకురావాలనుకుంటున్నాము' అని ఆమె ఉద్ఘాటించారు. 126 మంది సభ్యులు కలిగిన అసోం శాసనసభకు పోలింగ్ ఏప్రిల్ 9న జరగనుండగా, ఫలితాలు మే 4న వెలువడనున్నాయి.

## పర్యావరణ అనుమతులు లేని ప్రాజెక్టులపై 'సుప్రీం' తీర్పు వాయిదా



**న్యూఢిల్లీ :** ముందస్తు పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ప్రాజెక్టులు ప్రారంభించి ఉల్లంఘనలకు పాల్పడిన సంస్థలపై దాఖలైన అనేక పిటిషన్లపై విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు బుధవారం తీర్పు చెప్పకుండా వాయిదా వేసింది. తీర్పును రిజర్వు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును తక్షణం ప్రకటించకుండా తమ వద్దనే ఉంచుకుంది. ఈ అంశానికి సంబంధించి దాదాపు 49 పిటిషన్లపై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిన తర్వాత ఉల్లంఘనలకు పాల్పడ్డాయని, మరికొన్ని ప్రాజెక్టులకు అసలు ముందుగానే పర్యావరణ అనుమతుల అవసరం లేకుండానే నిర్మాణాలకు అవకాశం ఇచ్చారని, కానీ వారు సంబంధిత నిబంధనలను ఆ తర్వాత అమలు చేయకుండా తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడ్డారని అనేకమంది పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యాభట్ ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం తరపున విచారణకు హాజరై వాదనలు వినిపించారు.పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రాజెక్టులను నిర్మించుకోవడానికి అన్ని రకాల అనుమతులు ఇచ్చి ప్రోత్సహించడాన్ని భట్ సమర్థించారు. కేంద్ర ప్రభుత్వం గుడ్డిగా వారికి అనుమతులు ఇవ్వలేదని, ప్రాజెక్టులు ప్రారంభమైన తర్వాత వారు సంబంధిత నిబంధనలను పాటించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ కేసును నీరుగార్చడానికి తాము ఎలాంటి సిఫార్సులూ చేయడం లేదని భట్ ధర్మాసనానికి తెలియజేశారు. ఈ చట్ట పరిధిని విస్తృతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్, సంజయ్ పారిఖ్, ఇతరులు మాత్రం ప్రభుత్వం గుడ్డిగా ప్రాజెక్టు నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసిందని ధర్మాసనం ఎదుట విమర్శలు గుప్పించారు. 2025 మే 16వ తేదీన సుప్రీంకోర్టు ఈ కేసులో కొత్తగా మరికొన్ని పిటిషన్లను స్వీకరించి విచారణ ప్రారంభించింది.

## పౌరసత్వం తనిఖీ ఇసి పని కాదు

### 'సర్'పై ఒవైసీ అభ్యంతరం

**కోల్‌కతా:** భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(సర్)పై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అభ్యంతరం వ్యక్తం చేశారు. పౌరసత్వాన్ని తనిఖీ చేయడం ఎన్నికల సంఘం పరిధిలో లేదని, అది హోం మంత్రిత్వ శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు ఒవైసీ తెలిపారు. బెంగాల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్ ప్రక్రియకు తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో హుమాయన్ కబీన్ నేతత్వంలోని జన ఉన్నయన్ పార్టీతో కలిసి ఎంఐఎం పోటీ చేస్తోంది. ఈ కూటమి ద్వారా రాష్ట్రంలో రాజకీయ ప్రాధాన్యత పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేందుకు ఒవైసీ కోల్‌కతాకు చేరుకున్నారు. ముర్షిదాబాద్‌లో ఏర్పాటు బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఈ ర్యాలీ ద్వారా స్థానిక సమస్యలు, ఉద్యోగాలు, విద్య, మౌలిక సదుపాయాలుపై దష్టి సారించడంతో పాటు, జాతీయ స్థాయి అంశాలతో వాటిని అనుసంధానించేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే ఈ ఎన్నికల ర్యాలీ కేవలం ఒక ప్రచార కార్యక్రమం మాత్రమే కాదని, బంగాల్?లో తమ స్థానాన్ని పరీక్షించుకోవడానికి ఎంఐఎం చేస్తున్న ఒక ప్రయత్నంలో భాగంగా భావిస్తున్నారు.

## కోయంబత్తూర్ సీటు కోసం బిజెపిలో కుమ్ములాట!

**చెన్నై :** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నానా పాట్లు పడుతోంది. ఎఐఎడిఎంకె, బిజెపి కలిసి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. 27 స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నది. అయితే ఓ సీటు కోసం మాత్రం బిజెపిలో కుమ్ములాట సాగుతున్నట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్ జోక్యం చేసుకున్నప్పటికీ ఇద్దరు నేతలు మాత్రం ఆ సీటు కోసమే పట్టుబడినట్లు సమాచారం.

ఆ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై, మహిళా మోర్చా చీఫ్ వనతి శ్రీనివాసన్... ఒకే సీటు కోసం పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఆ ఇద్దరూ కోయంబత్తూరు నార్త్ నుంచి పోటీ చేయాలన్న ఆలోచనలో ఉన్నారు. 27 సీట్లను పంచుకునే క్రమంలో జరిగిన సమావేశంలో ఇద్దరు నేతలు కోయంబత్తూర్ సీటు కోసం పట్టుబట్టినట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వల్ల సింగనల్లూరు, కవుందంపాల్యం సీట్లను ఏఐఏడీఎంకేకు కేటాయించారు. అయితే కోయంబత్తూర్ నార్త్ సీటును వనతి శ్రీనివాసన్‌కు కేటాయించారు. అన్నామలై కూడా కోయంబత్తూర్ నార్త్‌ను కోరుకుంటున్నారు. దీంతో ఇద్దరు నేతల మధ్య యుద్ధం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

వనతి శ్రీనివాసన్ అనేక ఏళ్ల నుంచి ఆ నియోజకవర్గంలో పని చేస్తున్నారని, ఈ దశలో ఆ స్థానాన్ని మరొకరికి కేటాయించలేమని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు. కానీ ఇదే ప్రాంతం నుంచి పోటీ చేయాలని అన్నామలై కూడా ఆసక్తి ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు నేతల్లో ఒకరిని రామనాథపురం నుంచి పోటీ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

### లైంగిక వేధింపుల కేసులో

## దర్శకుడు రంజిత్ అరెస్ట్

**కొచ్చి :** మలయాళ చిత్ర దర్శకుడు రంజిత్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. లైంగిక దాడి కేసులో ఓ మహిళా నటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ అరెస్టు జరిగింది. ఫిల్మ్ సెట్‌లోనే డైరెక్టర్ రంజిత్ తనపై లైంగిక దాడి చేసినట్లు ఆ మహిళ తన ఫిర్యాదులో ఆరోపించింది. ఇడుక్కి జిల్లాలో రంజిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫిల్మ్ షూటింగ్ సమయంలో తనను కారవాన్‌కు రావాలని డైరెక్టర్ పిలిచారని, ఆ సమయంలో అతను లైంగిక దాడికి పాల్పడినట్లు ఆమె పేర్కొన్నది. కొచ్చి సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. తోడుపుజాలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఆ డైరెక్టర్ ఉన్నారు. మహిళా నటి ఇచ్చిన ఫిర్యాదును మహిళా పోలీసు స్టేషన్‌లో రికార్డు చేశారు. కేసు నమోదు చేసిన తర్వాత చాలా రహస్యంగా రంజిత్‌ను అరెస్టు చేశారు. మలయాళం ఫిల్మ్ ఇండస్ట్రీలో వేధింపులు ఎక్కువగా ఉన్నాయని ఇటీవల జస్టిస్ కె.హేమా కమిటీ ఒక నివేదికను విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో రంజిత్ పేరు కూడా ఉంది. 2024లో రంజిత్‌కు వ్యతిరేకంగా కేసు నమోదయింది. కొచ్చి నగర పోలీస్ కమిషనర్ వద్ద బెంగాలీ నటి ఫిర్యాదు చేసింది.

# సవాళ్లు విసురుతున్న 'విమర్శ'

డిజిటల్ యుగంలో ప్రజాస్వామ్యం మరింత బలపడుతున్నదా? లేక బలహీనపడుతున్నదా? విమర్శ స్వరాన్ని ఎంతవరకు అనుమతించాలి? అధికార యంత్రాంగం తనపై వస్తున్న ప్రతిస్పందనలను ఎంతవరకు స్వీకరించా లి? అనే ప్రశ్నలు కొత్తవి కావు. కానీ, సోషల్ మీడియా విస్తరణతో, సమాచార ప్రవాహం వేగంతో, ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యంతో ఇవి మరింత సంక్లిష్ట రూపం దాల్చాయి. ఒక వైపు ప్రజాస్వామ్య విలువలు, మరో వైపు భద్రత, సమగ్రత, సామాజిక శాంతి అనే పేర్లతో తీసుకునే చర్యలు. ఈ రెంటి మధ్య సమతుల్యతే ప్రధాన సవాలు. నిన్నమొన్నటి వరకూ ప్రజాస్వామ్యంలో విమర్శ ప్రాధాన్యాన్ని గొప్పగా ప్రస్తావించిన రాజకీయ నాయకత్వం, అదే విమర్శ స్వరాన్ని నియంత్రించే దిశగా అడుగులు వేస్తున్నదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. విమర్శను ప్రజాస్వామ్యానికి ప్రాణంగా పేర్కొంటూనే, సామాజిక మాధ్యమాలలో ప్రభుత్వంపై, ముఖ్యంగా నాయకత్వంపై విమర్శ వ్యక్తం చేసిన కంటెంట్‌ను తొలగించాలన్న ఆదేశాలు ఆశ్చర్యకరం. ఈ పరస్పర వైరుధ్యం, రాజకీయ వ్యూహమా లేక ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పుకు సంకేతమా అన్నది కీలకం. సామాజిక మాధ్యమాల ప్రభావం గత దశాబ్దంలో అమితంగా పెరిగింది. ఎన్నికల ప్రచారంలోనూ, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడంలోనూ ఈ వేదికలు కీలక పాత్ర పోషించాయి. ఈ వేదికల శక్తిని ముందుగానే గుర్తించిన రాజకీయ వ్యవస్థలు వాటిని సమర్థంగా వినియోగించుకున్నాయి. నేడు అవే వేదికల నుంచి విమర్శలు వినిపిస్తున్నప్పుడు, వాటిపై నియంత్రణ పెంచే ప్రయత్నాలు కూడా కనిపిస్తున్నాయి. ఇది సహజమైన రాజకీయ ప్రతిస్పందగా కాకుండా, ప్రజాస్వామ్య విలువల హననంగా మారుతున్నది. ఇటీవలి వారాల్లో వరుసగా జారీ అవుతున్న కంటెంట్ తొలగింపు ఆదేశాలు చర్చను మరింత వేడెక్కించాయి. వార్తా సంస్థల సోషల్ మీడియా పేజీలు, వ్యంగ్య రచయితల పోస్టులు, రాజకీయ వ్యాఖ్యాన ఖాతాలు... అన్నిటికీ ఇదే సూత్రాన్ని వర్తింప చేస్తున్నారు. ప్రభుత్వంపై లేదా నాయకత్వంపై వచ్చే విమర్శను పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారనడానికి ఇదో ఉదాహరణ. కేంద్రం ఈ చర్యలను తీసుకుంటున్నది కేవలం అసత్య సమాచారాన్ని, డీప్‌ఫేక్‌లను అడ్డుకోవడానికే అన్న వాదన వినిపిస్తోంది. ఇది కొంతవరకు సమంజసమే. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచార ప్రచారం సమాజానికి హానికరం. అవి ఎన్నికల ప్రక్రియను, సామాజిక ఐక్యతను దెబ్బతీస్తాయి. కానీ ఈ చర్యలు లక్ష్యం నిజంగా నియంత్రణా లేక విమర్శ స్వరాన్ని అణిచివేయడానికా అన్నది ప్రశ్న. ఒకవేళ సోషల్ మీడియా పూర్తిగా నియంత్రణ లేకుండా వదిలేస్తే, అది అశాంతికి దారితీసే ప్రమాదం ఉంది. ద్వేష ప్రసంగం, తప్పుడు ప్రచారం, విదేశీ జోక్యం వంటి అంశాలు నిజమైన సమస్యలే. కాబట్టి ప్రభుత్వానికి నియంత్రణ అవసరం లేదని చెప్పడం సరికాదు. కానీ, ఆ నియంత్రణ పరిమితి, పారదర్శకత, సముచితత్వం అనే ప్రమాణాలను పాటిస్తున్నదా? అన్నది కీలకం. చట్టపరమైన కోణంలో చూస్తే, సమాచార సాంకేతిక చట్టంలోని కొన్ని విభాగాలు ప్రభుత్వానికి విస్తృత అధికారాలను ఇస్తాయి. దేశ భద్రత, ప్రజా శాంతి, విదేశీ సంబంధాల పరిరక్షణ వంటి కారణాలతో ఆన్‌లైన్ కంటెంట్‌ను నిరోధించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ అధికారం రాజ్యాంగపరంగా సమర్థనీయమే. అయితే, ఆ అధికారాన్ని వినియోగిస్తున్న తీరే ప్రజాస్వామ్య నాణ్యతకు గీటురాయి. ఈ చట్టపరమైన నిబంధనలను ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా ఉపయోగిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఒక నిర్దిష్ట ప్రక్రియను అనుసరించకుండా, ఇతర విభాగాల ద్వారా కంటెంట్ తొలగింపును అమలు చేయడాన్ని దొడ్డిదారిన అమలవుతున్న సెన్సార్‌షిప్‌గా పేర్కొనవచ్చు. ఈ విధానం చట్టపరంగా సరైనదా అన్నది న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉన్నప్పటికీ, ప్రజాస్వామ్యపరంగా ఇది అనుమానాలకు తావిస్తుంది. పైగా, ఇలాంటి ఆదేశాల్లో పారదర్శకత లేదు. కంటెంట్ తొలగింపు ఆదేశాలు ఎందుకు జారీ అయ్యాయి? ఏ అంశం చట్టవిరుద్ధంగా ఉంది? దానిని తొలగించాలన్న నిర్ణయానికి ఆధారాలు ఏమిటి? అనే ప్రశ్నల్లో ఏ ఒక్కదానికీ సరైన సమాధానం లేదు. బాధితులకు ముందస్తు నోటీసు ఇవ్వకపోవడం, వాదనలు వినిపించుకునే అవకాశం లేకపోవడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం. కాగా, ఇటీవలి జియోపొలిటికల్ పరిణామాలు కూడా ఈ పరిస్థితిని ప్రభావితం చేస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో జరిగిన సంఘటనలపై ప్రభుత్వ వైఖరి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీసింది. విదేశాంగ విధానంపై విమర్శలు, దేశీయ ఆర్థిక ప్రభావాలపై చర్చలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున కనిపించాయి. ఈ నేపథ్యంలో విమర్శలను అణిచివేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్న భావన బలపడింది. ప్రభుత్వం విమర్శను అణిచివేస్తున్నదా? లేక అసత్య ప్రచారాన్ని అడ్డుకుంటున్నదా? ఈ రెండింటి మధ్య గీత ఎక్కడ ఉంది? ఒక వ్యంగ్య చిత్రం, ఒక రాజకీయ వ్యాఖ్య, ఒక సామాన్య వినియోగదారుడి వీడియో... నిజంగా దేశ భద్రతకు ముప్పుగా పరిగణించాలా? లేక ఇవి ప్రజాస్వామ్యంలో సహజమైన విమర్శ రూపాలా? ప్రజాస్వామ్యంలో అధికారానికి వ్యతిరేకంగా మాట్లాడే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. విమర్శ అనేది కేవలం వ్యతిరేకత కాదు. అది సరిదిద్దే ప్రక్రియ. తప్పులను గుర్తించే సాధనం. ప్రజల భావాలను ప్రతిబింబించే అద్దం. ఈ అద్దాన్ని మూసివేస్తే, వ్యవస్థలోని లోపాలు బయటపడవు. అవి లోపలే పెరిగి పెద్ద సమస్యలుగా మారి, దేశ భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉంది. అయితే, సోషల్ మీడియాలో విమర్శ నిర్మాణాత్మకంగా ఉంటుందన్న భరోసా లేదు. అది వ్యక్తిగత దూషణగా, తప్పుడు ప్రచారంగా మారే సందర్భాలు కూడా ఉన్నాయి. కాబట్టి నియంత్రణ అవసరం అనేది పూర్తిగా తిరస్కరించలేని వాస్తవం. కానీ ఆ నియంత్రణ సమానంగా అమలవుతున్నదా? లేక ఒకే వైపు విమర్శలను లక్ష్యంగా చేసుకుంటున్నదా? అన్నది ప్రధానం. ఏదిఏమైనా, విమర్శ ఉంటేనే వాస్తవం నిగ్గుతేలుతుంది. విమర్శతోనే గుణాత్మక మార్పులు సాధ్యమవుతాయి. వ్యక్తిగత దూషణలు.. అసత్య ప్రచారాలు... హింసను రెచ్చగొట్టే పోస్టులు ఎంత ప్రమాదమో, విమర్శ నోరు నొక్కడం కూడా ప్రజాస్వామ్యానికి అంతే ప్రమాదకరం. కాబట్టి విమర్శకు, కువిమర్శకు తేడా గుర్తించి చర్యలు తీసుకునేందుకు ప్రెస్ కౌన్సిల్‌లాగా ఒక తటస్థ ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. జనాంతిక నిర్ణయాలు ఎప్పుడూ సత్ఫలితాలను ఇవ్వవు. ●



## ప్రజా వ్యతిరేక పాలనను ఓడించాలి

**బిజెపి ప్రజా వ్యతిరేక పాలనను ఓడించాలి. బిజెపి పాలనతో అటు తమిళనాడుతో పాటు దేశవ్యాప్తంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మిక హక్కులు హరిస్తున్నారు, రైతులు, చిన్న, మధ్య తరగతి పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఏకపక్ష నిర్ణయాలతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారు. రాజ్యాంగ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నారు, కామన్ ఎంట్రన్స్ పరీక్షలతో సహా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, వ్యాపార పరం చేస్తున్నారు. హిందీ, సంస్కృతాన్ని బలవంతంగా రుద్దుతున్నారు. రాష్ట్ర సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా తమ పార్టీ డిఎంకె నాయకత్వంలోని ప్రజాస్వామ్య ప్రగతిశీల కూటమితో కలిసి ఎన్నికల్లో పొత్తు పెట్టుకుంది. ఎఐడిఎంకె, బిజెపి కూటమితో రాష్ట్రంలో కేంద్ర ఆధిపత్యం పెరుగుతోంది.**

– సిపిఐ తమినాడు కార్యదర్శి ఎం.వీరపాండ్యన్



## కోర్టు మెట్లు ఎక్కుతున్న కాపురాలు.. భరణం పోరు!

నేటి సమాజంలో వివాహ బంధం భావోద్వేగాలకే పరిమితం కాకుండా ఆర్థిక బాధ్యతలతో ముడిపడుతోంది. పట్టణీకరణ, మహిళల ఆర్థిక స్వావలంబన, ద్వంద్వ ఉపాధి కుటుంబాల పెరుగుదలతో విడాకుల సందర్భాల్లో భరణం ప్రధాన చర్చగా మారుతోంది. న్యాయ మంత్రిత్వ శాఖకు సమర్పించబడిన పలు నివేదికలు, కుటుంబ కోర్టుల వార్షిక గణాంకాలు సూచిస్తున్న దాని ప్రకారం, మెట్రో నగరాల్లో కుటుంబ వివాదాల నమోదు పెరుగుతున్న ధోరణి కనిపిస్తున్నట్లు అర్థమవుతోంది. ఇది సంబంధాల మార్పుకే కాకుండా, చట్టాలపై పెరిగిన అవగాహనకు కూడా సూచికగా భావించబడుతోంది. భరణం వ్యవస్థ ఉద్దేశం ఆర్థికంగా బలహీన భాగస్వామిని రక్షించడం అన్న మూల సూత్రాన్ని గుర్తు పెట్టుకోవడం అవసరం.

ఉద్యోగ ఒత్తిడి, వర్క్‌లైఫ్ అసమతుల్యత, ఆలస్య వివాహాలు, సూక్ష్మ కుటుంబాల పెరుగుదల వంటి అంశాలు దాంపత్య విభేదాలను వేగవంతం చేస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి మెట్రో నగరాల్లో కుటుంబ కోర్టుల కేస్ లోడ్‌పై వచ్చిన విశ్లేషణలు కొత్త పిటిషన్ల సంఖ్య పెరుగుతున్నట్లు న్యాయ వర్గాలు సూచిస్తున్నాయి. అదే సమయంలో, లీగల్ ఎయిడ్ సేవలు, కుటుంబ కోర్టుల విస్తరణ వల్ల న్యాయానికి చేరుకోవడం సులభమవడం కూడా కేసుల నమోదుకు ఒక కారణంగా భావించబడుతోంది.

భరణం కేసుల్లో పారదర్శకతను పెంచేందుకు సుప్రీంకోర్టు ఇచ్చిన రజనీష్ వర్సెస్ నేహా (2020) తీర్పు కీలక మలుపుగా నిలిచింది. ఈ కేసులో భార్యాభర్తలు ఇద్దరూ తమ ఆదాయం, ఆస్తులు, అప్పుల వివరాలను అఫిడవిట్ రూపంలో తప్పనిసరిగా వెల్లడించాలి అని స్పష్టం చేసింది. అనంతరం పలు హైకోర్టులు కూడా తప్పుడు అఫిడవిట్‌లు, ఆదాయం దాచడంపై కఠిన వ్యాఖ్యలు చేస్తూ, నిజమైన ఆర్థిక పరిస్థితిని వెలికి తీయడంపై దృష్టి సారిస్తున్నాయి. కోర్టు ఆదేశాలు, జడ్జిమెంట్ నోట్స్ భరణం నిర్ణయాల్లో ఆధారాల ప్రాముఖ్యతను బలపరుస్తున్నాయి. ఆర్థికంగా బలహీన భాగస్వామికి కనీస జీవన భద్రత కల్పించడం భరణం చట్టాల ప్రధాన లక్ష్యం. ఇటీవలి న్యాయ తీర్పులు భరణం హక్కు లింగపరంగా కాకుండా పరిస్థితుల ఆధారంగా నిర్ణయించవచ్చని స్పష్టం చేస్తున్నాయి. జీవన ప్రమాణం, ఆదాయం, విద్య, ఆరోగ్యం, ఆధారపడిన వారి సంఖ్య వంటి ప్రమాణాలను కోర్టులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భరణం చట్టాలు సమానత్వం దిశగా అభివృద్ధి చెందుతున్నాయి. అమెరికాలో అనేక రాష్ట్రాల్లో అధిక ఆదాయం ఉన్న భాగస్వామి లింగభేదం లేకుండా భరణం చెల్లించాల్సి ఉంటుంది. బ్రిటన్‌లో వైట్ వర్సెస్ వైట్ (2000) తీర్పు తర్వాత ఆస్తుల సమాన పంపిణీ సూత్రం బలపడింది. కెనడా, ఆస్ట్రేలియా మార్గదర్శకాలు ఆదాయ భాగస్వామ్యంపై స్పష్టతను ఇస్తున్నాయి. అదనంగా, ఫోరెన్సిక్ ఆడిట్, డిజిటల్ ఫైనాన్షియల్ ట్రాకింగ్, బ్యాంకింగ్ ట్రైల్ విశ్లేషణ వంటి పద్ధతులు ఆర్థిక వివరాలను ఖచ్చితంగా వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని దేశాల్లో వివాహానికి ముందే అగ్రిమెంట్లు వివాదాలను ముందుగానే తగ్గించడంలో సహాయపడుతున్నాయి. ఇవి భారతదేశంలో కూడా చర్చకు వస్తున్న అంశాలుగా నిలుస్తున్నాయి.

ఫిరోజ్ ఖాన్, 9640466464

# కేరళ ఎన్నికలలో హోరాహోరీ పోరాటం

కల్యాణి శంకర్

కేరళలో గడిచిన దశాబ్దకాలంగా ప్రతిపక్షంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ 2026 ఎన్నికలలో తన ప్రాభవాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలలో సాధించిన మంచి ఫలితాలతో మరింత బలోపేతమైన కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ అధికారాన్ని చేజిక్కించుకోవాలని చూస్తోంది. అధికార సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకోవడానికి తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది.

యుడిఎఫ్ నుంచి ఎదురవుతున్న గట్టి సవాలును ఎదుర్కొని వరుసగా మూడవసారి అధికారాన్ని నిలబెట్టుకోవడంలో ఎల్‌డిఎఫ్ సామర్థ్యానికి వచ్చే ఎన్నికలు పరీక్షగా నిలవనున్నాయి. (పోలింగ్ ఏప్రిల్ 9, ఓట్ల లెక్కింపు మే 4).

1982 నుండి ఓటర్లు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్), ఐక్య ప్రజాతంత్ర సంఘటన (యుడిఎఫ్)లకు తమ మద్దతును మార్చుకుంటూ వచ్చారు. ఇది ఏ ప్రభుత్వాన్నీ దీర్ఘకాలం అధికారం లో కొనసాగకుండా నిరోధించింది. 2021లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ వరుసగా రెండోసారి అధికారాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఈ రెండు పార్టీలు మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ, ముస్లిం ఓటర్ల మద్దతు కోసం పోటీ పడుతున్నాయి.

కేరళలో తమ ప్రభావాన్ని పెంచుకోవాలని ఎన్‌డిఎ భావిస్తోంది. బిజెపి తన ఓట్ల శాతాన్ని పెంచుకోవడం, ముఖ్యమైన సీట్లను గెలుచుకోవడంపై దృష్టి సారించింది.

రాష్ట్ర స్థాయిలోని కాంగ్రెస్ నేతలు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. అయితే, క్షేత్ర స్థాయిలో నెలకొన్న తీవ్రమైన సమస్యలు భవిష్యత్ ఎన్నికలలో వారి అవకాశాలను దెబ్బతీయగలవు.

కేరళలో ఎల్‌డిఎఫ్ ఆధిపత్య రాజకీయ కూటమి. యుడిఎఫ్ నుండి బిజెపి కొన్ని ఓట్లను రాబట్టింది. కాంగ్రెస్ కూటమిలో ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), కేరళ కాంగ్రెస్ ఉన్నాయి. ఇవి వరుసగా సుమారు 27 శాతం ముస్లింలు, 18 శాతం క్రైస్తవులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

కేరళలోని ఆరు జిల్లాలలో కనీసం పది స్వింగ్ (గెలుపును నిర్దేశించే) నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాలు ముఖ్యమైనవి. ఎందుకంటే అక్కడ గత రెండు శాసనసభ ఎన్నికలలో మూడు కూటములు దాదాపు ఒకే స్థాయిలో ఓటర్ల మద్దతును పొందాయి.

కాంగ్రెస్‌లోని అంతర్గత ఘర్షణలు, ముఖ్యంగా అభ్యర్థుల ఎంపిక విషయంలో పార్టీ ఐక్యత ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సతీశన్, రమేశ్ చెన్నితాల, కె.సి.వేణుగోపాల్ వంటి నాయకులు ఐక్యంగా కనిపిస్తున్నప్పటికీ,యుడిఎఫ్ గెలిచే పక్షంలో వారంతా ముఖ్యమంత్రి పదవి కోసం ఇప్పటి నుంచే పోటీ పడుతున్నారు.


పినరయి విజయన్
ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం)


బినయ్ విశ్వం
(సిపిఐ)


సతీషన్
ప్రతిపక్ష నాయకుడు– కాంగ్రెస్

2026 కేరళ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి క్రైస్తవ ఓటర్లను, ప్రత్యేకించి మధ్య కేరళలో ఆకట్టుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఆ పార్టీ స్థానిక సమూహాలతో మమేకమవ్వాలని, కీలక సమస్యలపై దృష్టి సారించాలని, తమ ప్రయత్నాలలో సీనియర్ నాయకులను భాగస్వాములను చేయాలని యోచిస్తోంది. యుడిఎఫ్‌కు బలమైన ప్రత్యామ్నాయంగా తమను తాము నిరూపించుకోవడమే వారి లక్ష్యం.

మౌలిక సదుపాయాలు, ఉద్యోగాలు, భద్రతపై బిజెపి దృష్టి సారించింది. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికలలో ఎన్‌డిఎ మంచి ఫలితాలనే సాధించింది. ఇది యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్‌ల ఆధిపత్యంలో ఉన్న కేరళ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చటం బిజెపి ధ్యేయం.

అభ్యర్థుల ఎంపిక విషయంలో కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు, టికెట్ల పంపిణీ విషయంలో రాహుల్ గాంధీ ఆందోళన వంటి అంశాలు పార్టీ ఐక్యతను బలహీనపరిచి, ఓటర్ల విశ్వాసాన్ని దెబ్బతీయవచ్చు. ప్రతిపాదిత జాబితాలోని అభ్యర్థులలో సుమారు 60 శాతం మంది ఏదోరకంగా లోక్‌సభ సభ్యుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి అయిన కె.సి.వేణుగోపాల్‌తో సంబంధం ఉన్నవారే. కాంగ్రెస్‌లో మరింత సంస్థాగత విధానాన్ని అవలంబించాలని రాహుల్ గాంధీ కోరారు. ఎన్నికల కమిటీ కేవలం రాష్ట్ర యూనిట్ నామినేషన్లపైనే ఆధారపడకుండా కుల సమీకరణాలు, విజయావకాశాలు, గత ఎన్నికల ఫలితాలు వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తోంది. అభ్యర్థుల జాబితాలో మహిళలకు ప్రాతినిధ్యం లేకపోవడంపై కూడా పార్టీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్రస్థాయిలో పరిస్థితి స్పష్టంగా ఉంది. సమర్థవంతమైన ప్రచారం, స్పష్టమైన నిర్మాణం ద్వారా ఎల్‌డిఎఫ్ బలంగా ముందుకు దూసుకుపోతోంది. ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ తన సభ్యులను సంఘటితం పరచటంలో ఇంకా ఇబ్బందులు పడుతోంది.

ముఖ్యమంత్రి కావాలనుకునే కొందరు తమ మద్దతుదారులకు టిక్కెట్లు ఇప్పించేందుకు తీవ్రంగా కృషి చేశారు. వారు కేవలం తమ విధేయులైన కార్యకర్తలకు సహాయం చేయడమో, కొత్త నాయకులను తయారు చేయడమో చేయడం లేదు. వారు తమ సొంత వర్గాలను బలోపేతం చేసుకోవాలని కూడా చూస్తున్నారు.

శాసనసభ ఎన్నికలకు ముందు సతీషన్, చెన్నితాల, వేణుగోపాల్ అరుదైన ఐక్యతను ప్రదర్శిస్తున్నారు. అయినప్పటికీ, రాజకీయ నాయకత్వం కోసం పోటీ స్పష్టంగానే ఉంది.

బిజెపి క్రైస్తవ ఓటర్లకు, ముఖ్యంగా మధ్య కేరళలోని సైరో– మలబార్ వర్గానికి చేరువయ్యేందుకు చురుకుగా ప్రయత్నిస్తోంది. స్థానికంగా మమేకమవడం, సమస్యల ఆధారిత ప్రచారాలు నిర్వహించడం, నాయకత్వంతో ఉన్నత స్థాయి సమావేశాలను ఏర్పాటు చేయించటం ద్వారా సంప్రదాయ యుడిఎఫ్ కూటమికి ఆచరణీయమైన ప్రత్యామ్నాయం గా తనను తాను నిరూపించుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది.

ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రాథమిక సర్వేల ప్రకారం యుడిఎఫ్ స్వల్పంగా ముందంజలో ఉన్నప్పటికీ, అంతర్గత విభేదాలను ఎదుర్కొంటోంది.

2024 లోక్‌సభ ఎన్నికల నాటి 19 శాతం ఓట్ల వాటాను బిజెపి నేతృత్వంలోని కూటమి నిలబెట్టుకుంటే, 2021 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే అది 7 శాతం ఓట్లను అదనంగా పొందినట్లవుతుంది. ఈ పెరుగుదలను ఎల్‌డిఎఫ్ లేదా యుడిఎఫ్‌లలో ఎవరి ఓట్ల నుంచి సాధిస్తుందనేది కీలక ప్రశ్న.

క్రైస్తవ, ముస్లిం వర్గాలు ఓటు వేస్తాయా? వారు కాంగ్రెస్ పార్టీలో తిరిగి కలుస్తారా లేదా బిజెపిని సవాలు చేయడానికి మెరుగైన స్థితిలో ఉందని కొందరు భావిస్తున్న ఎల్‌డిఎఫ్‌తోనే ఉంటారా అనేది అస్పష్టంగా ఉంది. ఈ వర్గాలు ప్రాతినిధ్యం వహిస్తున్న 47 స్థానాల ఫలితాలు 2026 ఎన్నికల పర్యవసానాన్ని నిర్ధారించగలవు.

చివరికి యుడిఎఫ్ మెజారిటీ సాధించగలదా లేకపోతే ఎల్‌డిఎఫ్ మూడోసారి రికార్డు సృష్టించగలదా అన్నదే ప్రశ్న. ఇప్పుడు ఆ నిర్ణయం ఓటర్ల చేతుల్లోకి వెళ్లింది.

*(ఐపిఎ సర్వీస్)*

# పతనానికి సిద్ధమైన ఫాసిల్ ఇంధన వ్యవస్థ

మన ఫాసిల్ ఇంధన ఆర్థిక వ్యవస్థ ఒక పతనానికి సిద్ధమైన గృహం. ఇరాన్‌పై ట్రంప్ యుద్ధం దాన్ని కూల్చబోతోంది. స్వచ్ఛమైన శక్తి మార్పు అవసరం ఇంత స్పష్టంగా ఎప్పుడూ లేదు. ప్రొఫెసర్ మైఖేల్ మాన్, పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలోని పెన్ సెంటర్ ఫార్ సైన్స్ డైరెక్టర్. ఆయన పీటర్ హోటెజ్‌తో కలిసి రచించిన తాజా పుస్తకం సైన్స్ అండర్ సీజ్, హౌ టు ఫైట్ ఫైవ్ మోస్ట్ పవర్ఫుల్ ఫోర్సెస్' వారి అభిప్రాయాలు సూక్ష్మ ంగా:

ఇరాన్‌పై ట్రంప్ యుద్ధం మనం ఫాసిల్ ఇంధనాల పై ఆధారపడటం వల్ల ఉన్న అన్ని సమస్యల ప్రతిబిం బం. అదే సమయంలో, పునరుత్పాదక శక్తులకు మార్పు ఎంత అత్యవసరమో ఇది స్పష్టంగా చూపిస్తోంది. ఇరాన్‌లో ఆయిల్ డిపోపై జరిగిన దాడుల తర్వాత జరిగిన అగ్నిప్రమాదం (మార్చి 8). యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇంధన మౌలిక వసతులు తీవ్రంగా లక్ష్యంగా మారాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై చేసిన యుద్ధం, మనం ఫాసిల్ ఇంధనాలపై కొనసాగుతున్న ఆధారపడుటలోని లోపాలను స్పష్టంగా చూపిస్తుంది. అదే సమయంలో, స్వచ్ఛమైన శక్తి మార్పు అవసరాన్ని కూడా ఇది బలంగా రుజువు చేస్తుంది. పునరుత్పాదక శక్తి – గాలి, సౌర, భూగర్భ ఉష్ణశక్తి, నిల్వ సాంకేతికతలు మరింత సురక్షితమైన, దేశీయంగా నిలకడైన, ఎప్పటికీ తగ్గని శక్తి వనరులను అందిస్తాయి.

ఇవి భూమి ఉష్ణోగ్రత పెరగడానికి, వాతావరణ అస్థిరతకు కారణం కావు. అలాగే, దూర ప్రాంతాల్లో ప్రమాదకరమైన యుద్ధాల్లో పాల్గొనాల్సిన అవసరం కూడా ఉండదు.

ఇది మొదటిసారి కాదు, ఒక ప్రపంచ ఘటన మనకు ఫాసిల్ ఇంధనాల నుంచి దూరమయ్యే ప్రయోజనాలను చూపించింది. ఐదేళ్ల క్రితం జరిగిన కోవిద్ మహమ్మారి సమయంలో కూడా, కొంతమేర వెండి వెలుగులాంటి అనుభవం కలిగింది. భారీ ప్రాణనష్టం జరిగినప్పటికీ, అది మనకు అసుస్థిర మార్గాల నుండి బయటపడే అవకాశం ఇచ్చింది ఒక గ్రీన్ రీసెట్. మహమ్మారి, లాక్‌డౌన్‌ల వల్ల చమురు ధరలు తొలిసారి క్షీణించాయి. మనం ప్రయాణించకపోయినా, ఫాసిల్ ఇంధనాల అవసరం లేకుండా జీవించగలిగాం. కానీ పునరుత్పాదక శక్తి, డిమాండ్ తగ్గినా కూడా స్థిరంగా నిలిచింది. ప్రభుత్వాలు ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ఇది ఒక మంచి అవకాశం — కాలుష్యకారక ఫాసి ల్ ఇంధన మౌలిక వసతులను తొలగించి, వాటి స్థానంలో స్వచ్ఛమైన గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ ను నిర్మించడానికి. కానీ అది జరగలేదు. నా సహరచయిత డాక్టర్ పీటర్ హోటెజ్‌తో కలిసి నేను వివరించినట్లుగా, ఫాసిల్ ఇంధన పరిశ్రమలు ఈ అవకాశాన్ని అడ్డుకోవడానికి భారీ ప్రచారం, తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేశాయి. గ్రీన్ రీసెట్ అనే భావనను ఒక కుట్ర సిద్ధాంతం గా మార్చారు. ఈ అవకాశాన్ని కోల్పోవడానికి మరో కారణం, తక్షణ సంక్షోభం, పర్యావరణ కారకాలను అనుసంధానించడం క్లిష్టంగా ఉండటం. ఉదాహరణకు, జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు వ్యాపించడం వంటి అంశాలు. కానీ ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం విషయంలో (వెనిజులాపై దాడులు కూడా), ఈ సంబంధం చాలా స్పష్టంగా కనిపిస్తుంది.

భూమి వేడెక్కడం వల్ల తీవ్ర తుఫాన్లు, సముద్ర మట్టం పెరుగుదల, తీరప్రాంత ముంపులు, తీవ్రమైన వాతావరణ ఘటనలు పెరుగుతున్నాయి. ఇవన్నీ ఫాసిల్ ఇంధనాల వినియోగం వల్లే జరుగుతున్నాయి. ట్రంప్ ఇరాన్‌పై యుద్ధం కూడా ఇదే నేపథ్యానికి చెందినది.ఈ యుద్ధం సౌదీ అరేబియా, రష్యా వంటి పెట్రోస్టేట్ల ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్తుంది. అలాగే హోర్ముజ్ సముద్ర స్రోతసులో చమురు, ఎల్ఎన్జీ ప్రవాహాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తుంది. అమెరికా కూడా ఫాసిల్ ఇంధన పరిశ్రమకు మద్దతుగా నిలుస్తోం ది. స్వచ్ఛమైన శక్తి ప్రాజెక్టులను అడ్డుకుంటోంది. ఫాసిల్ ఇంధనాలపై ఆధారపడటం మన దేశాన్ని బలహీనంగా చేస్తోంది. ఇది విదేశాలతో యుద్ధాలకు దారితీస్తోంది. భారీ ఆర్థిక నష్టం, రక్తపాతం జరుగుతోంది. చివరకు ఇది వాతావరణ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోం ది. హోర్ముజ్ జలసంధి మూసివేత వల్ల అమెరికాలో పెట్రోల్ ధరలు ఎన్నో సంవత్సరాల తర్వాత గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇది వస్తువుల ధరలు, సేవలపై ప్రభావం చూపుతోంది. పునరుత్పాదక శక్తి ఇప్పుడు ఫాసిల్ ఇంధనాల కంటే చవకగా మారింది. ఇంకా వాతావరణ మార్పు ల వల్ల కలిగే నష్టాలను ఇందులో పరిగణలోకి తీసుకోలేదు. ఇవి దేశీయంగా ఉత్పత్తి చేయవచ్చు, స్థిరత్వం మరియు భద్రతను అందిస్తాయి.

అయితే ఫాసిల్ ఇంధన పరిశ్రమ ఇంకా ప్రభావవంతంగా ఉంది. స్వచ్ఛమైన శక్తి మార్పును అడ్డుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఇటీవల నివేదిక ప్రకారం, ట్రంప్ ప్రభుత్వం ఒక కంపెనీకి ఒక బిలియన్ డాలర్లు చెల్లించి, సముద్ర గాలి విద్యుత్ ప్రాజెక్టును ఆపించింది. 'ట్రంప్ విధానాల వల్ల శక్తి ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో అతని ఇరాన్ యుద్ధం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. అయితే ఆశ ఉంది. కొన్ని రాష్ట్రాలు, ముఖ్యంగా వర్జీనియా, స్వచ్ఛమైన శక్తి వైపు అడుగులు వేస్తున్నాయి. గవర్నర్ అబిగైల్ స్పాన్‌బెర్గర్ గాలి విద్యుత్ ప్రాజెక్టును ప్రోత్సహిస్తున్నారు. ఎన్నికలకు ప్రభావం ఉంటుంది. రాబోయే ఎన్నికలు ఈ విధానాలకు అడ్డుకట్ట వేయడానికి అవకాశం. ఒక మంచి భవిష్యత్తు: స్వచ్ఛమైన శక్తితో, జీవించదగిన వాతావరణంతో, ఫాసిల్ ఇంధనాల కోసం యుద్ధా లు చేయాల్సిన అవసరం లేని ప్రపంచం మనకు అవస రం.

డా.ముచ్చుకోట సురేష్ బాబు

# నేత్ర సమస్యలు నిర్లక్ష్యం చేస్తే అంధత్వం రావచ్చు!

పంచేంద్రియాల్లోకి నేత్రాలు ప్రధానమైనవి మనకు తెలుసు. చూపు మందగిస్తే బతుకు చీకటిమయం అవుతుంది. చూపు కలిగిన వారికి దృష్టి ప్రాధాన్యం పెద్దగా అర్థం కాదు. ప్రపంచ వ్యాప్తంగా 2.2 బిలియన్ల ప్రజలు దృష్టి సమస్యలతో బాధపడుతున్నారు. వీరిలో 10 మిలియన్లకు పైగా భారతీయులు కూడా ఉండడం విచారకరం. రాజస్థాన్, ఎంపి రాష్ట్రాల్లో అంధత్వ సమస్య ఎక్కువగా ఉన్నది. నేత్ర సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 01– 07 ఏప్రిల్ వరకు దేశవ్యాప్తంగా అంధత్వ నివారణ వారోత్సవాలు (ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ వీక్) నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అంధత్వ నివారణ, అంధ పాఠశాలల నిర్వహణ, హక్కుల పరిరక్షణ, నేత్ర దాన ఉద్యమాలు, అంధులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పన లాంటి చర్యలు తీసుకోవడం నేటి ప్రభుత్వాల, పౌర సమాజ కనీస బాధ్యత అని తెలపడానికి ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

**రైట్ టు సైట్ మన నినాదం కావాలి:** నేత్ర ఆరోగ్య ప్రాధాన్యతను గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 08 అక్టోబర్ రోజున ప్రపంచ దృష్టి దినం, మార్చి 07 నుంచి 13 వరకు ప్రపంచ గ్లకోమా వారం, అక్టోబర్ నెలను అంధత్వ అవగాహన మాసంగా పాటించడం జరుగుతున్నది. అంధత్వం మూడు రకాలుగా కనిపిస్తుంది. వీటిలో ట్రకోమా, కాటరాక్ట్, విటమిన్ ఎ లోపం కారణాలతో అంధత్వ సమస్య ఉత్పన్నం అవుతున్నది. డబ్ల్యూహెచ్ఒ చేపట్టిన రైట్ టు సైట్ (దృష్టి హక్కు) నినాదంతో అంధత్వ నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. విటమిన్ 'ఎ' లోపం కారణంగా వచ్చే అంధత్వం నివారించదగినదని ప్రభుత్వాలు, ప్రజలు గుర్తించాలి. గ్లకోమా, కంటి శుక్లాలు, కండ్ల కలకలకు వైద్యం సకాలంలో అందితే అంధత్వం రాకుండా కాపాడుకోవచ్చు.

**నివారణ చర్యలు:** ఎలక్ట్రానిక్ ఉపకరణాలను గంటల తరబడి వాడడంతో నేత్ర సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంధత్వ సమస్యలు 80శాతం వరకు నివారించదగినవే. వయస్సు 50 ఏండ్లు దాటిన వారికి నేత్ర సమస్యలు అధికంగా కనిపిస్తాయి. నేత్ర గాయాలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం, కంటి గాయాలకు సత్వరమే చికిత్స తీసుకోవడం, తరుచుగా నేత్ర పరీక్షలు చేయించుకోవడం, విటమిన్ ఎ కలిగిన పోషకాహారం తీసుకోవడం, కాటరాక్ట్ చికిత్సలు చేయించుకోవడం, నేత్రాలను కళ్లద్దాలతో పరిరక్షించుకోవడం, నేత్ర శుభ్రతను పాటించడం, ముందస్తు లాంటి చర్యలు, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండడం లాంటి చర్యలు అంధత్వాలను నివారిస్తాయి. మనం మరణించిన తర్వాత కూడా నేత్ర దానంతో మరో జన్మకు అర్థాన్ని, దృష్టిని ఇవ్వవచ్చు.

*(01—07 ఏప్రిల్ అంధత్వ నివారణ వారోత్సవాలు సందర్భంగా)*




## ఇంటింటికీ సిపిఐతో ప్రజా సమస్యలపై కొత్త దిశ

### జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్రంలో ఇంటింటికి సిపిఐతో ప్రజా సమస్యలు తెలుసుకుని రాజకీయాలకు కొత్త దిశ చూపించనున్నట్లు జాతీయ మహిళ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రజా పోరాటాల ద్వారా పరిష్కారాలు చూపి ప్రజల హక్కులను కాపాడుతామన్నారు. ప్రతి గడపకు సిపిఐ లక్ష్యాలను తీసుకెళ్లి ప్రజల గొంతుకగా మారనున్నట్లు తెలిపారు. ప్రజా ఉద్యమ పార్టీకి ప్రజలు చేయూతనిచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పోజు సూర్యనారాయణ, కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, కందుల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, జడ శ్రీనివాస్, యల్లావుల రమేష్, వాసుదేవరావు, ఉప్పతల కోటమ్మ, ఇందిరాల వెంకటేశ్వర్లు, వీరయ్య, యల్లావుల ఉమా, గుంజ సీతరాములు, శ్యాంసన్, యల్లావుల శివ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారం పార్టీ కార్యక్రమాల బలోపేతం లక్ష్యంగా సిపిఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమంలో నిర్వహించారు. చౌటుప్పల్ మండల కేంద్రంలో పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని విరాళాలు సేలకరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఐకి ప్రజలు ఆర్థికంగా తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉడుత రామలింగం, టంగుటూరి రాములు, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, నరసింహ నీళ్ల బిక్షపతి, దాసరి అంజయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లర్లు... పట్టింపులేని అధికారులు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైస్ మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకుండా నిలువుదోపిడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం బాధాకరమని రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం రైతులు మిల్లు వద్దకు అమ్మకాలకు ధాన్యం తీసుకొచ్చారు. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర అందక పెట్టిన పెట్టుబడులు వెళ్లక ప్రతి ఏటా రైతులు అప్పుల ఊబిలో కూరుకపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. గతం వారం రోజుల నుంచి రూ.2750 చెల్లించిన మిల్లర్లు క్రమంగా రోజుకొక రేటును నిర్ణయిస్తూ రైతులను రూ.250 తగ్గించడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రైతులు వెంకటయ్య, స్వామి, రామకృష్ణ, గోవింద్, వరప్రసాద్,సింహాద్రిలు ఉన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలోని అన్ని శాఖా గ్రంథాలయాల సమస్యలను పరిష్కరించి, వాటిని పాఠకులకు మరింత చేరువ చేసేలా అభివృద్ధి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీ ఎండి అవైస్ ఉర్ రెహ్మాన్ చిస్తీ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ శాఖా గ్రంథాలయాల్లో నెలకొన్న భవన మరమ్మతులు, విద్యుత్ సరఫరా మరియు మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాల సమస్యలను గ్రంథపాలకులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించి, జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు అన్ని శాఖా గ్రంథాలయాలను మోడల్ గ్రంథాలయాలుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలు, మండల పరిషత్, గ్రామ పంచాయతీల నుండి రావాల్సిన గ్రంథాలయ సెస్సును సకాలంలో వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ముగ్గురు గ్రంథాలయ ఉద్యోగులను చైర్మన్, కార్యదర్శి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో వారు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.

## అనుమతులు లేకుండా అంబుజా సిమెంటు పరిశ్రమ పనులు చేస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/రామన్నపేట :** అదాని లాజిస్టిక్స్ లిమిటెడ్ పేరుతో అంబుజా సిమెంట్ కాలుష్య పరిశ్రమ పనులు చేస్తే మరో మహా ప్రజా పోరాటం తప్పదని పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండీ రెహాన్ హెచ్చరించారు. రామన్నపేట అంబుజా సిమెంట్ ప్రతిపాదిత స్థలంలో భారీ యంత్రాలతో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న పనులను పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిల పక్షాల ఆధ్వర్యంలోస్థానిక నాయకులు పరిశీలించి పనులు ఆడుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జల్లెల పెంటయ్య, ఎండి రెహాన్ మాట్లాడుతూ విష కాలుష్యంతో ప్రజల ప్రాణాలు తీసే అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పవద్దని మండల ప్రాంత ప్రజానీకం పెద్ద ఎత్తున ఆందోళన చేయగా వెనక్కి తగ్గి మళ్ళీ ఎదో సాకుతో పనులు ప్రారంభించడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక అఖిలపక్షాల నాయకులు గోదాస్ పృథ్వీరాజ్, ఊట్కూరు నర్సింహా, ఎండీ జమీరుద్దీన్, మిర్జా ఫజల్ బెగే, శానగొండ వెంకటేశ్వర్లు, కొమ్ము శేఖర్, మోట మహేష్, సుదర్శన్, కొమ్ము రామస్వామి, అశోక్, గురిజాల మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

# 4 లేబర్ కోడ్‌లు కార్మికహక్కులపై దాడి

### వెంటనే రద్దు చేయాలి

### ఎఐటియుసి జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే సందర్భంగా నిరసనలు




**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న 4 లేబర్ కోడ్లు కార్మిక హక్కులపై తీవ్రమైన దాడి అని ఎఐటియుసి నేతలు పేర్కొన్నారు. ఈ కోడ్లు చట్టాల మార్పు కాదని, కార్మిక హక్కుల అపహరణేనని విమర్శించారు. జాతీయ పిలుపులో భాగంగా ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండలో సుభాష్ విగ్రహం వద్ద బ్లాక్ డేగా నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరా రెడ్డి, ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య, ఐఎఫ్‌టీయూజిల్లా అధ్యక్షుడు బి.నరసింహ మాట్లాడుతూ కొత్త లేబర్ కోడ్లు కార్మికులపై భారం పెంచి,ఉద్యోగ భద్రతను తగ్గిస్తున్నాయని తెలిపారు. పని గంటల పెంపు, కాంట్రాక్ట్ విధానం ప్రోత్సాహం, యూనియన్ హక్కులపై పరిమితులు వంటి అంశాలు కార్మికులకు నష్టం కలిగిస్తాయని అన్నారు.కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ 4 లేబర్ కోడ్లను రద్దు చేసి,పాత కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని,ఉద్యోగ భద్రతతో పాటు గౌరవప్రద వేతనాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఈ నిరసన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు దొనకొండ వెంకన్న ,ఎండి సలీం,సుంకిశాల వెంకన్న, బొమ్మిడి నగేష్,దండేపల్లి సత్తయ్య,అవుట రవి, ఏం నందం,సంబి రెడ్డి, యూసుఫ్,నాగరాజు,నరసింహ, సీతరాములు,శంకర్,ఇందూరి సాగర్,సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ:** ఎఐటియుసి జాతీయ కమిటి పిలుపులో భాగంగా కోదాడ ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకవచ్చిందని వాటి రద్దు కోసం అలుపెరగని పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. తక్షణమే లేబర్ కమిషన్‌లో ఖాళీగా ఉన్న జిల్లాలను పూర్తి చేయాలన్నారు. ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు షేక్ లతీఫ్, నాయకులు గోవిందరావు, ఎస్‌కె జానీ, నర్సింహరావు, శ్రీధర్, ఎస్‌కె సైదా, వెంకట్‌రెడ్డి, వీరభద్రచారి, గౌరి నాయుడు, గోవింద్, రాఘవులు, శ్రీనివాస్, మోసిన్, సైదులు, సాయిలు పాల్గొన్నారు.






**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్ర ఎఐటియుసి పిలుపుమేరకు బుధవారం చేపట్టిన బ్లాక్ డేలో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని ఇందిర చౌక్‌లో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్ మాట్లాడుతూ లేబర్ కోడ్ వల్ల యావత్ కార్మిక లోకానికి పూర్తి స్థాయిలో నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, రైతు సంఘం నాయకులు కంబాల శ్రీనివాస్, ఎఐటియుసి జిల్లా నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, సిపిఐ గరిడేపల్లి మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, జెట్టి ప్రసాద్, ఎల్లావుల శివ, వీరయ్య పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/దేవరకొండ:** కేంద్ర ప్రభుత్వ నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. బుధవారం ఈ మేరకు దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. పాత 29 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ గౌరవాధ్యక్షులు మైనోద్దీన్, నగేష్, రమేశ్వరమ్మ, ప్రణయ్, దేవరాజ్, పద్మ, తారమ్మ, లక్ష్మీ, వనజ తదితరులు పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మునుగోడు:** కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ 4 లేబర్ కోడ్లను రద్దు చేసి,పాత కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు చాపల శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ జాతీయ పిలుపులో భాగంగా మునుగోడు మండల సమితి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బ్లాక్ డే గా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాపల శ్రీను మాట్లాడుతూ కార్మిక హక్కుల రక్షణ కోసం ప్రతి కార్మికుడు పోరాటంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య,అధ్యక్షుడు దుబ్బ వెంకన్న, పందుల చిన్న నరసింహ, బొల్లు సైదులు,శ్రీను, లింగస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ పనులపై తనిఖీలు - అధికారులకు సూచనలు

### శాలిగౌరారం మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

**ప్రజాపక్షం/నల్లగొండ(శాలిగౌరారం):** వర్షాకాలానికి ముందే మొక్కల నాటేందుకు స్థలాలను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. శాలిగౌరారం మండలంలో బుధవారం సుడిగాలి పర్యటన నిర్వహించి వల్లాల,అడ్లూరు గ్రామాలలో పలు ప్రభుత్వ సంస్థలు, అభివృద్ధి పనులను తనిఖీ చేశారు.వనమహోత్సవం నర్సరీని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాన్ని కూడా పరిశీలించి అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు.ఉపాధి హామీ పనులను తనిఖీ చేస్తూ కూలీలకు నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. అలాగే ఎక్కువ పనులు చేసి మెరుగైన వేతనం పొందాలని కూలీలకు సూచించారు.ఇందిరమ్మ ఇల్లు, గ్రామపంచాయతీ, తెలంగాణ మోడల్ స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సమస్యలను తెలుసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామసభ ఏర్పాట్లను సమీక్షిస్తూ అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని, గ్రామ సమస్యలను చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసిల్దార్ వరప్రసాద్,వల్లాల పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య,ఎంఈఓ సైదులు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కృష్ణమోహన్ కలెక్టర్ వెంట ఉన్నారు.



## మున్సిపాలిటీలో ఆక్రమణల తొలగింపు

**ప్రజాపక్షం/హాలియా:**మున్సిపాలిటీ కేంద్రమైన హాలియాలో ఆక్రమణలు చేసి వ్యాపారాలు చేస్తున్న స్థలాలను మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ సహకారంతో తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.బుధవారం హాలియా సెంటర్లో రహదారులను ఆక్రమించి తోపుడు బండ్లపై వ్యాపారాలు వాటిని తొలగించారు. రహదారులకు ఇరువైపులా కొందరు చిరు వ్యాపారులు ఫుట్పాత్ ఆక్రమించి చేస్తున్న వ్యాపారాల వలన జరుగుతున్న ప్రమాదాలతో వీటిని తొలగిస్తున్నట్లు కమిషనర్ రవీందర్ రెడ్డి చెప్పారు.తోపుడు బండ్ల తో పాటు రహదారిని ఆక్రమించి వ్యాపార చేస్తూ పలువురికి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రాంతాలను గుర్తించి వాటిని కూడా అక్కడి నుంచి తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఆక్రమణల వలన ప్రయాణికులు, ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటిని గుర్తించి ఈఆక్రమణ గురైన ప్రాంతాలను తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. చిరు వ్యాపారం చేసుకునే వారు తోపుడుబండ్లను వ్యాపారం ముగిసిన తర్వాత వారితో పార్టీ ఇంటికి తీసుకెళ్లాలని లేనట్లయితే వాటిని సీజ్ చేసి జరిమానా విధించనున్నట్లు కమిషనర్ చెప్పారు.బుధవారం నిర్వహించిన ఈకార్యక్రమాల్లో తోపుడుబండ్లపై వ్యాపారం చేస్తూ ఇబ్బందులు కలిగిస్తున్న వ్యాపారులకు 2వేల రూపాయలు జరిమాన విధించినట్లు తెలిపారు. ఎస్సై సాయి ప్రశాంత్ తన సిబ్బందితో కలిసి ఆక్రమణకు గురైన ప్రాంతాలను మున్సిపల్ అధికారులతో పాటు గుర్తించి వ్యాపారులకు కౌన్సిలింగ్ ఇచ్చి రహదారులపై వ్యాపారాలు చేయడం వలన జరుగుతున్న ప్రమాదాలను వివరించి స్వచ్ఛందంగా వారు అక్కడి నుంచి రహదారులకు లోపల వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు.





## మెరుగైన వైద్యం అందించాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం శారజీపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం రోజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వార్డులను పరిసరాలను, క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజూ శానిటేషన్ పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రి లో రోజు ఎంత మంది పనిచేస్తున్నారని, సిబ్బంది సంఖ్య, వారి హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది విధిగా విధులకు హాజరు నమోదు చేసుకుంటున్నారా లేదా అనే విషయాన్ని డైలీ అటెండెన్స్ లాగిన్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు. ప్రతి రోజు ఓపికి వచ్చే రోగుల సంఖ్య, వారి వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగుల రిజిస్టర్ను సరిగా నిర్వహించాలనీ, ప్రతి రోగి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రి లో అవసరమైన ఔషధాలు సరిపడా ఉన్నాయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.రోగులకు అందిస్తున్న మందుల వివరాలను సక్రమంగా రికార్డు చేస్తున్నారా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి మనోహర్, శారజీపేట వైద్యాధికారిణి హైమావతి వైద్యఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట దేవస్థానం ఇఓ 'రివర్స్' రాజకీయం

### బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకే పాత కోటరీపై ప్రేమ!

### కొత్తవారికి సామర్థ్యం లేదా? పాతవారే మేధావులా?

### బదిలీపై వెళ్లిన 20 మంది కోసం ఈవో భవాని శంకర్ 'ఆరాటం'

### జూనియర్ అసిస్టెంట్లు లేనిదే పాలన సాగదా?

### విస్తుపోతున్న భక్తులు





**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో పాలన గాడితప్పుతోందా? ఐఏఎస్ హోదాలో ఇఓగా బాధ్యతలు చేపట్టిన భవాని శంకర్ తీసుకుంటున్న నిర్ణయాలు ఇప్పుడు క్షేత్రస్థాయిలో పెను సంచలనంగా మారాయి. ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, కనీసం రెండు నెలలు కూడా గడవకముందే.. 'పాతవారే ముద్దుకొత్తవారు వద్దు' అన్న చందంగా వ్యవహరించడం వెనుక మర్మమేంటని భక్తులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బదిలీపై వెళ్లిన వారిని తిరిగి రప్పించేందుకు ఆయన పడుతున్న తాపత్రయం వెనుక అసలు కథ ఏమిటనే చర్చ జోరుగా సాగుతోంది.

**రెండు నెలలకే సామర్థ్యం తేల్చేశారా?**

ఫిబ్రవరిలో పదవీ బాధ్యతలు స్వీకరించిన ఈవో భవాని శంకర్, ఆలయ వ్యవస్థను అధ్యయనం చేయకముందే ఇక్కడి సిబ్బందిపై ఒక నిర్ణయానికి వచ్చేయడం విడ్డూరంగా ఉంది. ఇతర దేవస్థానాల నుండి బదిలీపై వచ్చిన అధికారులకు సామర్థ్యం లేదని ముద్ర వేస్తూ, గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిన వారికే పట్టు ఉందని సర్టిఫికేట్ ఇవ్వడం వెనుక ఆంతర్యమేమిటి? మార్చి 7నే ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ రాయడం చూస్తుంటే, ఆయన స్వతంత్రంగా ఆలోచిస్తున్నారా లేక పాత అధికారుల కోటరీ ఆయన్ను తప్పుదారి పట్టిస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**జూనియర్ అసిస్టెంట్లతోనే అభివృద్ధి సాధ్యమా?**

ఈవో కోరుతున్న జాబితాలో కేవలం ఇంజనీర్లు మాత్రమే లేరు. డిప్యూటీ ఈఈ, ఏఈఈలతో పాటు 6 గురు సూపరింటెండెంట్లు, 6 గురు సీనియర్ అసిస్టెంట్లు, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఒక ఐఏఎస్ అధికారి స్థాయి వ్యక్తి, జూనియర్ అసిస్టెంట్లు లేకపోతే పరిపాలన సాగదని, అభివృద్ధి ఆగిపోతుందని లేఖ రాయడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందికి సామర్థ్యం లేదని ఈవో శంకిస్తుండటం వారిని అవమానించడమేనన్న విమర్శలు వస్తున్నాయి.

**బదిలీల వెనుక అసలు 'మర్మం' ఇదేనా?**

గతంలో యాదగిరిగుట్టలో తిష్టవేసి, టెండర్ల నిర్వహణలో, నిధుల వినియోగంలో ఆరోపణలు ఎదుర్కొన్న వారే ఇప్పుడు ఈవోకు అత్యంత సమర్థులుగా కనిపిస్తుండటం గమనార్హం. వీరిలో కొందరు ఇప్పటికే డిప్యుటేషన్ పేరిట దొడ్డిదారిన ఇక్కడికి చేరుకోవడం వెనుక పెద్ద ఎత్తున ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. పాతవారే వస్తేనే పనులు జరుగుతాయన్న ఈవో వాదనలో వాస్తవమెంత? పనిచేసే శక్తి లేని వారిని, అవకతవకలకు పాల్పడిన వారిని మళ్లీ నెత్తిన పెట్టుకోవడం వల్ల భక్తులకు కలిగే లాభమేమిటి?

ఇఓ టార్గెట్గా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో పారదర్శకత కోసం బదిలీలు చేస్తే, క్షేత్రస్థాయి అధికారిగా ఉన్న ఇఓ ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పాతవారి కోసం లేఖ రాయడం శాఖాధిపతుల మధ్య చర్చకు దారితీసింది. కొత్తగా వచ్చిన అధికారులను ప్రోత్సహించాల్సింది పోయి, వారిని అసమర్థులుగా చిత్రించడం ఈవో స్థాయికి తగదని భక్తులు మండిపడుతున్నారు. చూడాలి మరి, ఈ 'రివర్స్ బదిలీల' వ్యవహారంపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో!

## బాధితులకు అండగా పోలీసు శాఖ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి నెలా 100కుపైగా ఫోన్స్ రికవరీ చేసి బాధితులకు మొబైల్స్ అందించి జిల్లా పోలీసు శాఖ బాధితులకు అండగా నిలిచిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలో 11వ సారి బాధితులకు మొబైల్స్‌ను ఆయన అందించిన అనంతరం మాట్లాడారు. ఈ సెల్‌ఫోన్ రికవరీ మేళాలలో సుమారు రూ.20లక్షల విలువ గల 106 ఫోన్లను గుర్తించి బాధితులకు అందించామన్నారు. మొబైల్ ఫోన్ అనేది ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరికి నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్య, ఉద్యోగం, ఆర్థికపరమైన లావాదేవీలకు వినియోగిస్తున్నామన్నారు. ఇటువంటి మొబైల్ ఫోన్లు ఆన్‌లైన్ మోసగాళ్ళ చేతిలో పడితే విలువైన సమాచారంతోపాటు, డబ్బు కూడా పోయే ప్రమాదం ఉందన్నారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేస్తున్నారని వివరించారు. పోలీసులు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పనిచేస్తుంది తప్ప తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండదని స్పష్టం చేశారు. ఐటి కోర్ సిబ్బంది, పోలీసు స్టేషన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది, మొబైల్ పోగొట్టుకున్న బాధితులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
గురువారం
02-04-2026
www.prajapaksham.in


# గద్దర్‌ను 'తెలంగాణ జాతిపిత'గా ప్రకటించాలి

6న తెల్లాపూర్‌లో భారీ బహిరంగ సభ




ప్రజాపక్షం/ఖైరతాబాద్: తెలంగాణ సమాజం గర్వించ దగ్గ ప్రజా విప్లవగళం, ప్రజాయుద్ధనౌక, దివంగత గద్దర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గద్దర్ గుండెల్లో తుపాకీ తూటాలను దింపిన రోజును నిరసిస్తూ గద్దర్‌గళం ఆధ్వర్యంలో ఏర్పాటైన రౌండ్ టేబ్ సమావేశంలో 'గద్దర్ గళం' సభ్యులు కొల్లూరి సత్తయ్య, కొల్లూరి భరత్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, సీనియర్ ఉద్యమకారులు పాశం యాదగిరి, పృథ్వీరాజ్ లతో పాటు పలువురు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. ప్రజా యుద్ధ నౌక గద్దర్‌ను ప్రభుత్వం అధికారికంగా 'తెలంగాణ జాతి పిత'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించని పక్షంలో పల్లె పల్లెనా వ్యవస్థీకృత ప్రజా ఉద్యమాన్ని నిర్మించి, ప్రజలందరి భాగస్వామ్యంతో గద్దర్‌ను 'తెలంగాణ జాతిపిత'గా మేమే స్వయంగా ప్రకటించుకుంటామని తేల్చిచెప్పారు. ఒక ఫ్యూడల్ నేపథ్యం ఉన్న వ్యక్తి తెలంగాణ జాతిపిత ఎలా అవుతారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. తెలంగాణ అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తికే ఆ అర్హత ఉంటుందన్నారు. శరీరంలో బుల్లెట్లు ఉన్నప్పటికీ, ప్రాణాలకు తెగించి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు నిలకడగా పోరాడిన ఏకైక వ్యక్తి గద్దర్ అని, జాతిపితకు ఉండాల్సిన అన్ని లక్షణాలు, అర్హతలు ఆయనకు పుష్కలంగా ఉన్నాయని వక్తలు కొనియాడారు. తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ విముక్తి కోసం గద్దర్ చేసిన త్యాగాలను స్మరిస్తూ, ఆయనను తెలంగాణ జాతిపితగా ప్రకటించే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని 'గద్దర్ గళం' ప్రతినిధులు ప్రకటించారు. ఈ నెల 6న తెల్లాపూర్‌లోని 'గద్దర్ సర్కిల్' వద్ద 'గద్దర్ గళం' ఆధ్వర్యంలో రోజంతా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి రాజకీయ నాయకులు, ప్రజా గాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, ఉద్యమ కారులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ నలుమూలల నుంచి ప్రజలు, గద్దర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.




## ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్ పోటీలు

11 పతకాలు సాధించిన ఆదిత్య ఫౌండేషన్ అథ్లెట్లు

ప్రజాపక్షం/బంజారాహిల్స్: ఫిలిప్పీన్స్‌లో జరిగిన ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్–2026లో హైదరాబాద్‌కు చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్)లో శిక్షణ పొందిన పారాసైక్లిస్టులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. భారత పారాసైక్లింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వారు మొత్తం 11 పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో విశ్వ అద్భుత ప్రదర్శన కనబరిచారు. అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో లిషా భారత పతకాల పట్టికను మరింత బలోపేతం చేశారు. పవన్ కుమార్ ఎలిమినేషన్ రేస్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయం భారత పారాసైక్లింగ్ క్రీడాకారుల పట్టుదలకు, ఆదిత్య మెహతా ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణకు నిదర్శనంగా నిలిచింది.

## స్వామినాథన్ అవార్డుకు డాక్టర్ శ్రీనివాసరావు ఎంపిక



ప్రజాపక్షం/ఖైరతాబాద్: భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ వైస్ ఛాన్సలర్ డా.సిహెచ్ శ్రీనివాసరావును ప్రతిష్టాత్మక 'ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్' జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు రిటైర్డ్ ఐసీఏఆర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డా.త్రిలోచన్ మోహపాత్ర ఆధ్వర్యంలోని నిపుణుల కమిటీ సభ్యులు డా.విజయ్ గుప్తా, డా.బాలరవి, డా.సౌమ్య స్వామినాథన్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ అవార్డును ఏప్రిల్ 18న సాయంత్రం 5 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ సంస్థలో జరిగే కార్యక్రమంలో బంగారు పతకం, ప్రశంసాపత్రం, రూ.2 లక్షల నగదు బహుమతితో ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని.. భారత ఆహార భద్రతకు విశేష సేవలందించిన శాస్త్రవేత్తలకు గుర్తింపుగా నూజివీడు సీడ్స్ లిమిటెడ్ సహకారంతో ఈ అవార్డు స్థాపించడం జరిగిందన్నారు. వ్యవసాయ రంగంలో వినూత్న పరిశోధనలు చేసిన డా.శ్రీనివాసరావు వాతావరణ అనుకూల వ్యవసాయం, సహజ వనరుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించినట్లు వారు వివరించారు.

## వైద్యుడు లేడు.. మందులు లేవు

గౌలిపురా బస్తీ దవాఖానాలో దుస్థితి




ప్రజాపక్షం/యాకుత్‌పురా: పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. అంతేకాకుండా మందులు సైతం లేవు. వైద్యులు లేని కారణంగా రోగుల దయనీయ పరిస్థితి చూడలేక అక్కడ విధులు నిర్వహించే నర్సింగ్ స్టాఫ్ వైద్య సేవలు అందిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారం వారం రోజులుగా సాగుతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే గౌలిపురా డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటైన బస్తీ దవాఖానాలో వారం రోజులుగా వైద్యుడు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మందులు కూడా బయట కొనుగోలు చేయాలని సూచిస్తున్నట్లు తెలిసింది. ఇకనైనా హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి వైద్యులు అందుబాటులో ఉండేలా.. మందులు అందించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా మోత్కపల్లి

మండల అభివృద్ధి అధికారి సురేందర్‌రెడ్డి



ప్రజాపక్షం /కోట్‌పల్లి: వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని మోతుకుపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డుకు ఎన్నిక కావడం గొప్ప విషయం అని మండల అభివృద్ధి అధికారి సురేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మోతుకుపల్లి గ్రామ పంచాయతీ సుపరిపాలనలో అత్యుత్తమ పనితీరుతో దేశస్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని అయన తెలిపారు. పాలనలో పాదర్శకత బాధ్యతాయుత పనితీరు, ప్రజలభాగస్వామ్యం సమర్థవంతమైన సేవలు అందజేత వంటి అంశాల్లో చేసిన వినూత్న కార్యక్రమాలు అవార్డుకు ఎంపికకు దోహదం చేశాయని తెలిపారు. గ్రామంలో డిజిటల్ సేవలు పర్యావరణ పరిరక్షణ సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు సమర్థంగా అమలు చేయడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచగలిగామన్నారు. ప్రజల సహరం, నాయకత్వం, అధికారుల కృషి ఈ విజయానికి ప్రధాన కారణాలన్నారు. ఈ అవార్డు గ్రామ అభివృద్ధికి ప్రేరణగా నిలిచి భవిష్యత్తులో మండలంలోని మరికొన్ని గ్రామాలు మదే బాటలో నడిచి మరిన్ని కార్యక్రమాలు అమలు చేయడానికి మార్గదర్శకంగా ఉండాలని అయన కోరారు.

## రూ.46లక్షలతో గ్రామ అభివృద్ధి పనులు

ప్రజాపక్షం/వికారాబాద్ రూరల్ : వికారాబాద్ మండల పరిధిలోని అత్వెల్లి గ్రామ పంచాయతీలో రూ.46 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని విజయలక్ష్మి మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ రూ.10 లక్షలతో ఓపెన్ వెల్ డ్రైనేజ్, రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మణం, రూ.4 లక్షలతో సైడ్ డ్రేనేజ్, రూ.10 లక్షలతో మహిళా సమఖ్యభవనం, రూ.10 లక్షలతో వర్క్‌షేడ్ ఏర్పాటు, రూ.2 లక్షలతో మినీ వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్ గ్రామంలో జరుగుతున్న పనుల నాణ్యత పురోగతిని పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తుల సహరంతో గ్రామం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పుర్ణిమ, ఉపసర్పంచు, వర్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

ప్రజాపక్షం/చార్మినార్ : రాత్రి వేళ వెలగాల్సిన వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. ఈ వ్యవహారం గౌలిపుర డివిజన్ పరిధిలోకి వచ్చే అయోధ్యనగర్ కాలనీలో నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యుత్ దుబారా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా బల్దియా వీధి దీపాలను పర్యవేక్షించే అధికారులు స్పందించి వీధి దీపాల వ్యవహారాన్ని సరిచేయాలని కోరుతున్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కార్పొరేషన్ తేవాలి

ప్రభుత్వానికి గవ్వల శ్రీకాంత్ డిమాండ్



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ దిల్‌కుషా గెస్ట్‌హౌస్‌లోని జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ నిర్వహించిన ప్రత్యేక కోర్టు కార్యక్రమంలో శ్రీకాంత్ మాట్లాడారు. వివిధ శాఖల్లో నిరుద్యోగ యువకులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా సొసైటీల యాజమాన్యాలు నియమిస్తూ భవిష్యత్తులో రెగ్యులర్ అవుతారని మభ్యపెడుతూ వారి వద్ద నుంచి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చే జీతాలలో కూడా సొసైటీలు కటింగ్ చేస్తున్నాయని తెలిపారు. సొసైటీల తరపున కాకుండా ప్రభుత్వమే ఉద్యోగాలను నియమించి నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేయాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కోట శివ శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు సొంబారి ప్రశాంత్‌కుమార్ , మీసాల చంద్రయ్య, తీగల శేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ర్యాలీలకు అనుమతివ్వాలి

ఎడిజిపి మహేశ్ భగవత్‌కు బిషప్ భాస్కర్ వినతి



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్: గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ ప్రార్థనల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు నిర్వహించే ప్రార్థనలకు, ర్యాలీలకు అనుమతులివ్వాలని భారత్ క్రిస్టియన్స్ కౌన్సిల్ అధ్యక్షులు బిషప్ భాస్కర్ రాష్ట్ర ప్రభుతానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బుధవారం అడిషనల్ డిజిపి మహేశ్ భగవత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిషప్ భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 3న గుడ్‌ఫ్రైడే ఆరాధన, 4న ర్యాలీలు, 5న ఈస్టర్ ఆరాధన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో బిషప్‌లు, పాస్టర్లు, సువార్తికులు పాల్గొంటున్న నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఉండేలా స్థానిక పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తమ విజ్ఞప్తిపై ఎడిజిపి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎడిజిపిని కలిసిన వారిలో భారత్ క్రిస్టియన్ కౌన్సిల్, కో–ఆర్డినేటర్ బిషప్ ఉదయ, బ్రదర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థుల ప్రతిభ వారి అభివృద్ధికి దోహదం

ఎంజిఎం ఇంటర్నేషనల్ స్కూల్ సినర్జీ– 26లో ఎమ్మెల్యే నవీన్ యాదవ్

ప్రజాపక్షం/రవీంద్రభారతి : విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చాలని, అదే వారి సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని జూబ్లీహిల్స్ ఎంఎల్‌ఏ వల్లలా నవీన్ యాదవ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో యూసఫ్‌గూడ మారుతినగర్ బ్రాంచి ఎంజిఎం ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన "సినర్జీ–2026' వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌ఏ నవీన్ యాదవ్ విచ్చేసి, మాట్లాడారు. తాను కూడా విద్యార్థి దశలో ఇదే పాఠశాలలో చదువుకొని ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విలువైన అనుభవాన్ని సంపాదించానని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానాలను అధిరోహించి కుటుంబానికి, సమాజానికి మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎం.నాయుడు, ప్రధానోపాధ్యాయురాలు సబిత, ఇన్‌చార్జి ఇమ్రోజ్ కలిసి నవీన్ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం!

చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేనా భీమ్ భరత్



ప్రజాపక్షం/నవాబుపేట్ : కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదల కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ అన్నారు. నవాబ్ పేట్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని బుధవారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో డబుల్ బెడ్రూంలు ఇస్తా అని ఆశ చూపి ఇవ్వలేదన్నారు. కానీ ప్రజా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పేట్ మండలం అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షులు పోలీస్ మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నవాబ్ పేట సర్పంచ్ నరసింహ రెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఘనపురం ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, మండల నాయకులు శేఖర్, యాదయ్య, లక్ష్మణ్, పులుమామిడి సర్పంచ్ నరసింహులు, చించల్ పేట్ అనంత రాములు, పాండు రంగా రెడ్డి, మాదిరెడ్డి పల్లి రాజు, మాజీ ఉప సర్పంచ్ సంగారెడ్డి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు, కమిటీ మెంబెర్స్, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా

గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధించాలని గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం



ప్రజాపక్షం/నవాబుపేట్ : గ్రామస్తులు ఏకమై స్వచ్ఛందంగా గ్రామంలో మద్యపానం నిషేధిస్తూ బుధవారం తీర్మానం చేసుకొన్నారు. నవాబుపేట మండలంలోని నారేగూడ గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు. గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపిక దశరథ్ మాట్లాడుతూ, గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తీర్మానానికి విరుద్ధంగా గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సంతోషంగా జీవించాల్సిన కుటుంబాలు మద్యం కారణంగా చెల్లాచెదురు అవుతున్నాయన్నారు. మద్యానికి బానిసైన వారి ఆరోగ్య పరిస్థితులు రోజురోజుకు క్షీణించి, అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. గత మూడు నెలలలో మద్యం ఎక్కువ సేవించి ముగ్గురు చనిపోయారని గుర్తు చేశారు. ఏకగ్రీవ తీర్మానానికి బెల్ట్ షాపుల యజమానులు కూడా అందరు అంగీకరిస్తూ సంతకాలు చేశారు. గ్రామ పెద్దలు గ్రామసభ తీర్మానాన్ని అనుసరిస్తామని, ఈ తీర్మానాన్ని ఎవరు అతిక్రమించిన వారిపై లక్ష రూపాయల జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్వర్తి దీపికదశరథ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ వార్డు సభ్యులు శేఖర్ రెడ్డి, పర్మారెడ్డి, అమృతమ్మ, విష్ణు వర్ధన్ రెడ్డి, జహంగీర్, మహిళలు, గ్రామ పెద్దలు మైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, రఘునందన్ రెడ్డి, చంద్రారెడ్డి, హన్మయ్య, శివకుమార్, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పాలకవర్గం ఆలయాభివృద్ధి కృషి చేయాలి

ఎల్లమ్మతల్లి దేవాలయం ప్రభుత్వ వెబ్‌సైట్ చేర్చేందుకు కృషి చేస్తా : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరు: కోత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయం నూతన పాలవర్గం ఆలయాభివృద్ధి దోహదపడి మంచి పేరు ప్రతిష్టాలు తెచ్చుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. బుదవారం తాండూరు మండలం కోత్లాపూర్ ఎల్లమ తల్లి దేవాలయంలో ఏర్పాటు చేసిన నూతన పాలవర్గం చైర్మన్ పట్లోళ ప్రవీణ్‌రెడ్డి పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గోని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఆలయంలో అన్ని మౌళిక సదుపాయాలు చేసుకుందామన్నారు. తెలంగాణ కర్నాటక, ఆంధ్ర, మహారాష్ట్రం నుండి ఈ దేవాలయానికి పెద్దఎత్తున్న భక్తలు వస్తుంటారని అన్నారు. ఎల్లమ్మ తల్లి దేవాలయం ప్రభుత్వ వెబ్ సైట్ చేర్పించే విధంగా ఏర్పాట్లు చేస్తానని అన్నారు. ఆలయం పాలకవర్గానికి రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందన్నారు. ఆలయాభివృద్ధికి దేహదపది మంచి పేరు ప్రతిష్టాలు తెచ్చుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలను జుంటుపల్లి, ఏకాంబారి, భద్రప్ప దేవాలయం, పోట్లిమహారాజ్ దేవాలయాను అభివృద్ధి చేసుకుందామన్నారు. ముస్లీం సోదరులకు మసీదులు, ఖబ్రస్తాన్, ఈద్గాల అభివృద్ధి నిధులు మంజూరు చేశామని అన్నారు. క్రిష్టియన్ సోదరులకు చర్చీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని మతాలను, కులాలను సమానంగా చూస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చంద్రకళా, డిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, పట్లోళ బాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు నాగప్ప, నాయకులు సాయిలులు నవీన్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/ఉప్పల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. లబ్ధిదారులకు పూర్తి స్థాయి ప్రయోజనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల్ మండలానికి చెందిన 172 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెక్కుల పంపిణీ పారదర్శకంగా జరగాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించిన విధంగా రూ.1,16,000 నగదు సహాయంతో పాటు తులం బంగారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో పూల్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కల్యాణ లక్ష్మి, షాది ముభారక్ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సునీల్ కుమార్, ఆర్‌ఐలు అశ్విని గౌడ్, వీరేంద్ర సాయి,జూనియర్ అసిస్టెంట్లు అనంత రాములు,వెంకన్న, అలివేలు వనిత, అటెండర్లు సత్య నారాయణ, సంజీవ, స్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఖైదీలకు ఉచిత వైద్య పరీక్షలు

జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్

ప్రజాపక్షం/పరిగి: సబ్ జైల్‌లో ఖైదీలకు ఉచితవైద్య పరీక్షలుఏర్పాటు చేయడం జరిగిందని పరిగి సబ్ జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్ తెలిపారు.99రోజుల ప్రజాపాలన ప్రగతిప్రణాళికలో భగంగా బుదవారం శ్రీ సాయిడెంటల్ హస్పటల్ వరి సహకరంతో జైల్‌లోని ముద్దాయిలకు సిబ్బందికి మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో ముద్దాయిలందరికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ ప్రాథమిక కర్తవ్యమని ఇట్టి కార్యక్రమానికి ప్రైవేట్ హస్పటల్స్ సహకరించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా పంఫిణి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, వివేక్, శిశ్యప్రియ, కేజియా, గాయత్రీ దేవి, విశ్వనాథ్‌రావు, శ్రీను, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ



**లక్నో:** ఐపిఎల్ 2026లో ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. సమీర్ రిజ్వీ (70*; 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ట్రిస్టన్ స్టబ్స్ (39*; 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. లక్ష్యఛేదనలో ఢిల్లీకి ఆరంభంలోనే వరుస షాక్‌లు తగిలాయి. కెఎల్ రాహుల్, అక్షర్ పటేల్ డకౌట్ కాగా.. పాథుమ్ నిశాంక (1) నిరాశపర్చాడు. నితీశ్ రాణా (15) కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. దీంతో ఢిల్లీ 26 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సమీర్ రిజ్వీ.. స్టబ్స్‌తో కలిసి ఢిల్లీని విజయం దిశగా నడిపించాడు. ఈ జోడీ అభేద్యమైన ఐదో వికెట్‌కు 76 బంతుల్లో 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 2, మహ్మద్ షమి, మోసిన్ ఖాన్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్‌లో మిచెల్ మార్ష్ (35; 28 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), అబ్దుల్ సమద్ (36; 25 బంతుల్లో 3 ఫోర్లు 1 సిక్స్) రాణించారు. ఐదెన్ మార్‌క్రమ్ (11), నికోలస్ పూరన్ (8), రిషభ్ పంత్ (7), ఆయుష్ బదోని (0) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో నటరాజన్, లుంగి ఎంగిడి చెరో 3 వికెట్లు, కుల్‌దీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.

## ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రియ ముందంజ



**ఉలన్బాతర్(మంగోలియా):** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల మెరుగైన ప్రదర్శన కొనసాగుతున్నది. పోటీల రెండో రోజైన మంగళవారం జరిగిన మహిళల 60కిలోల బౌట్‌లో ప్రియ 5–0 తేడాతో రిమ్మా వోలెసెంకో(కజకిస్థాన్)పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ప్రియ పవర్‌ఫుల్ పంచ్‌లతో విరుచుకుపడుతూనే మరోవైపు ప్రత్యర్థికి దీటుగా బదులిస్తూ ముందుకు సాగింది. మరోవైపు పురుషుల 55కిలోల బౌట్‌లో జాదుమణిసింగ్ 2–3 తేడాతో రిమా యమగుచి(జపాన్)పై పోరాడి ఓటమిపాలయ్యాడు. ఈ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బాక్సర్‌గా కొనసాగుతున్న యమగుచికి జాదుమణి దీటైన పోటీనిచ్చాడు.

## స్లో ఓవర్ రేట్.. శ్రేయాస్ అయ్యర్‌కు ఫైన్



**ముల్లాన్పూర్:** ఐపిఎల్‌లో మంగళవారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు మూడు వికెట్ల తేడాతో విక్టరీ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా విధించారు. స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి రూ.12 లక్షల ఫైన్ వేశారు. ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద ఈ సీజన్ తొలి నేరంగా పరిగణిస్తూ .. స్లో ఓవర్ రేటు కింద అయ్యర్‌కు జరిమానా విధిస్తున్నట్లు ఐపిఎల్ తన ప్రకటనలో తెలిపింది.



చరిత్ర

# డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్..



డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ అనే విధానం ప్రకారం ఒక సంస్థానరాజుకు సహజంగా జన్మించిన పురుష వారసుడు లేకుండా మరణిస్తే ఆరాజ్యం బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధీనంలోకి వెళ్లేది. భారతీయ సంప్రదాయంలో దత్తపుత్రుడిని రాజ్యానికి వారసుడిగా గుర్తించే పద్ధతి ఉన్నప్పటికీ, ఈ విధా నం దాన్ని అంగీకరించలేదు. దత్తపుత్రుడు వ్యక్తిగత ఆస్తులను మాత్రమే పొందగలడని పేర్కొంది. ఈ విధానం ఆలోచన 1834 ప్రాంతంలోనే వచ్చినప్పటికీ, దీనిని విస్తృతంగా అమలు చేసినవాడు లార్డ్ డొల్హౌసీ. ఆయన గవర్నర్ జనరల్‌గా ఉన్న కాలంలో ఈ విధానాన్ని దూకుడుగా అమలు చేసి బ్రిటిష్ ప్రాంతాలను విస్తరించాడు. రాజుకు సహజ వారసుడు లేకపోవడాన్ని కారణంగా చూపించి అనేక సంస్థానాలను కంపెనీ రాజ్యంలో కలిపేశారు. బిటిష్ పాలనకు లోబడని సంస్థానాల ను క్రమంగా ఆక్రమించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం. రాజుకు సహజ పురుష వారసుడు లేకపోతే ఆ రాజ్యాన్ని కంపెనీకి కలిపి భూభాగాన్ని, ఆదాయాన్ని పెంచుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ విధానం ద్వారా అనేక సంస్థానాలు బ్రిటిష్ పాలనలో కలిశాయి. దీని ద్వారా, బ్రిటిష్ ఇండియాలో కలిసిన తొలి రాజ్యం సతారా (1848). ఆ తరువాత 1849లో జైపూర్, సంబాల్పూర్‌లను ఆక్రమించారు. 1850లో భగత్‌ను కలిపేసుకున్నారు. 1852లో ఉదయ్‌పూర్ సంస్థానాన్ని ఆక్రమించారు. మరుసటి సంవత్సరం, 1853లో ఝన్సీని బ్రిటిష్ పాలనలో కలిపారు. దీనికి వ్యతిరేకంగా అక్కడి పాలకురాలు రాణి లక్ష్మి బాయి తీవ్రంగా ప్రతిఘటించింది. 1854లో నాగపూర్‌ను కూడా ఈ విధానం ద్వారా ఆక్రమించారు. 1855లో తంజావూరు, ఆర్కోట్ సంస్థానాలు కూడా కంపెనీ పాలనలోకి వెళ్లాయి. కాగా, డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ విధానం భారతీయ సంస్థాన పాలకులలో తీవ్ర అసంతృప్తిని, భయాన్ని కలిగించింది. ఎప్పుడు తమ రాజ్యాన్ని కూడా బ్రిటిష్‌లు ఆక్రమిస్తారో అన్న అనిశ్చితి పెరిగింది. తరువాత జరిగిన 1857 సిపాయుల తిరుగుబాటు (మొదటి స్వాతంత్ర్య ఉద్యమం) ఎగసిపడడానికి ముఖ్య కారణాల్లో డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ ఒకటి. నాటి తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం ఈ విధానాన్ని నిలిపివేసింది. 1858లో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ముగిసి బ్రిటిష్ క్రౌన్ నేరుగా భారతదేశాన్ని పాలించడం ప్రారంభించిన తర్వాత డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ విధానం అధికారికంగా రద్దయింది. ఇలావుంటే 1856లో అవధ్‌ను కూడా బ్రిటిష్‌లు ఆక్రమించారు. అయితే దీనికి డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ ద్వారా కాకుండా దుర్వ్యవస్థాపన అనే కారణాన్ని చూపించారు. ఏదిఏమైనా, బ్రిటిష్ పాలన భారతీయ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసింది. స్వదేశీ పరిశ్రమల నాశనం, అధిక పన్నులు, రైతులపై భారం ప్రజలలో అసంతృప్తిని పెంచాయి. వెల్లూరు తిరుగుబాటు, కిత్తూరు రాణి చెన్నమ్మ తిరుగుబాటు, సన్యాసి, సంతాల్ ఉద్యమాలు ఈ అసంతృప్తికి ప్రతీకలుగా నిలిచాయి. అదే విధంగా, భారతదేశంలో బ్రిటిష్ విజయం వెనుక అనేక కారణాలు ఉన్నాయి. మొఘల్ సామ్రాజ్య పతనం వల్ల ఏర్పడిన రాజకీయ శూన్యత, భారతీయ పాలకుల మధ్య ఐక్యత లోపం, బ్రిటిష్ సైనిక, నౌకాదళ ఆధిక్యత, ఆర్థిక వనరులు, సంస్థాగత సమర్థత, అలాగే విభజించి పాలించు విధానం బ్రిటిష్ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. భారతదేశంలో బ్రిటిష్ పాలన స్థాపన ఒక చారిత్రక సంఘటన మాత్రమే కాదు, అది భారత సమాజం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయ నిర్మాణాన్ని శాశ్వతంగా మార్చిన ప్రక్రియ. వాణిజ్యంతో ప్రారంభమైన బ్రిటిష్ ప్రయాణం రాజకీయ ఆధిపత్యంగా మారి, చివరకు వలస పాలనకు దారితీసింది. ఈ చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా భారత దేశం తన వలస గతాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా, స్వాతంత్ర్య పోరాటానికి దారితీసిన కారణాలను స్పష్టంగా గ్రహించగలుగుతుంది.

## వ్యాపారుల నుంచి పాలకులుగా మారిన వైనం..

* 18వ శతాబ్దం ప్రారంభానికి మొఘల్ సామ్రాజ్యం బలహీనపడటం ప్రారంభమైంది.
* పాలకులు విలాసవంతమైన జీవితం గడపడం వల్ల ఆర్థిక వ్యవస్థ క్షీణించింది.
* ఔరంగజేబు మరణం (1707) తర్వాత బలహీన పాలకులు వచ్చారు.
* కేంద్ర అధికార బలహీనత కారణంగా సంస్థానాలు, సామంత పాలకులు స్వతంత్రంగా వ్యవహరించడం ప్రారంభించారు.
* భారత్‌లోని శక్తులు రాజపుత్రులు, మరాఠాలు, సిక్కులు వంటి వర్గాలుగా విడిపోవడం, ఐక్యత లేకపోవడం విదేశీయులకు అవకాశమైంది.
* బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి మొఘల్ అనుకూలత కూడా బ్రిటిషర్లకు ఉపయోగపడింది.
* బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ మొదట వ్యాపారం కోసం మాత్రమే భారతదేశానికి వచ్చింది.
* 1717లో మొఘల్ చక్రవర్తి ఫరూఖ్‌షియార్ కంపెనీకి బెంగాల్‌లో సుంకం లేకుండా వ్యాపారం చేసే ఫర్మాన్ ఇచ్చాడు.
* మొఘల్ సామ్రాజ్యానికి అంతర్గత తిరుగుబాట్లు, బయటి ప్రమాదాలు ఎదురవడంతో బ్రిటిష్ సైనిక సహాయం మీద ఆధారపడాల్సి వచ్చింది.
* స్థానిక పాలకులు తమ శత్రువులపై సహాయం కోసం కంపెనీని ఆశ్రయించడంతో కంపెనీ పరిపాలనలో పాత్ర పెరిగింది.
* మొఘల్ సామ్రాజ్య పతనం బ్రిటిషర్లకు కలిసొచ్చింది.
* బలహీన కేంద్ర పాలన వల్ల సామ్రాజ్యం విభజనకు గురైంది.
* అధిక పన్నులు, దుర్వ్యవస్థాపన వల్ల రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.
* విలాసవంతమైన రాజకోట జీవితం ఆర్థిక వనరులను ఖాళీ చేసింది.
* కంపెనీ పాలకులు 'విభజించి పాలించు' (డివైడ్ అండ్ రూల్) విధానాన్ని అనుసరించారు.
* ఒక పాలకుడిని మరొకరిపైకి రెచ్చగొట్టి, రాజకీయ లాభాలు పొందారు.
* 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం కీలక మలుపు.
* ఇందులో బ్రిటిషర్లు మీరఇ జాఫర్‌కు మద్దతు ఇచ్చి సిరాజుద్దౌలాను ఓడించారు.
* దీంతో బెంగాల్ వంటి సంపన్న ప్రాంతం కంపెనీ ఆధీనంలోకి వచ్చింది.
* సైన్య సహకార ఒప్పందం (సబ్సిడియరీ అలయెన్స్) విధానాన్ని లార్డ్ వెలస్లీ ప్రవేశపెట్టాడు.
* భారత రాజ్యాలకు రక్షణ పేరుతో బ్రిటిష్ సైన్యాన్ని అక్కడ నిలిపి రాజకీయ నియంత్రణ సాధించారు.
* డాక్ట్రిన్ ఆఫ్ లాప్స్ విధానాన్ని లార్డ్ డల్హౌసీ అమలు చేశాడు.
* వారసుడు లేకపోతే రాజ్యాన్ని బ్రిటిష్ పాలనలో కలిపేశారు.
* మరాఠాలు, మైసూరు, సిక్కులపై యుద్ధాలు చేసి బ్రిటిష్ తమ ఆధిపత్యాన్ని విస్తరించారు.
* 1850ల నాటికి ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో వాస్తవ పాలకులుగా మారింది.
* బ్రిటిష్ విధానాలపై పెరిగిన అసంతృప్తి కారణంగా 1857లో సిపాయిల తిరుగుబాటు (మొదటి స్వాతంత్ర్య యుద్ధం) జరిగింది.
* 1858లో కంపెనీ పాలన ముగిసి, బ్రిటిష్ రాజ్యం నేరుగా పాలించడం ప్రారంభించింది.

# ప్రజాసమస్యల పరిష్కారానికే ఇంటింటికీ సిపిఐ

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



వరంగల్...

**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం వరంగల్ నగరంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో ఇంటింటా సిపిఐ కార్యక్రమాన్ని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, వలివుల్లా ఖాద్రి, నాయకులు గుండె బద్రి బుస్సా రవీందర్, గన్నారపు రమేష్, జన్ను రవి ల్యాదెళ్ల శరత్, తాళ్లపల్లి రోహేల, కండె నర్సయ్య, టి. జాన్ పాల్, పరికరాల రమేష్, మస్కె సుధీర్ సంద్ర కుమార్ మనోహర్ శ్వేత చిలువేరి విజయ సారంగం చిరంజీవి పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐకి వెన్నుదన్నుగా నిలవండి : చాడ

**కరీంనగర్ :** సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని అలాంటి పార్టీకి ప్రజలే వెన్నుదన్నుగా నిలవాలని, వందేళ్లుగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఐకి విరివిగా ఆర్థిక సహాయాన్ని అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుండి 10వ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటింటికి సిపిఐ సామూహిక నిధి, విరాళాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం కరీంనగర్‌లోని కమాన్ చౌరస్తాలో పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పొనగంటి కేదారి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, బోయిని తిరుపతి, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, బండ రాజిరెడ్డి, చొక్కల్ల శ్రీశైలం, మావురపు రాజు, మచ్చ రమేష్, బావండ్లపెల్లి యుగేందర్ పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా బాగం హేమంతరావు

**ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ పనిచేస్తుందని పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాట కార్యాచరణను రూపొందించుకునేందుకు ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఖమ్మం టూటౌన్ పరిధిలో హేమంతరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మినారాయణ, ఎస్‌కె సైదా, వరదా నర్సింహారావు, జ్వాలా నర్సింహారావు, మందా వెంకటేశ్వర్లు, మాడుగుల నాగేశ్వరరావు, చానా పాల్గొన్నారు.

### పోరాటాల పార్టీకి అండగా నిలవాలి : కలవేణ శంకర్

**రామకృష్ణాపూర్ :** ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఏప్రిల్ 1 నుండి 10 వరకు ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలవేణ శంకర్ మాట్లాడుతూ పోరాటాల పార్టీకి ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మ ణ్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సమస్యల తెలుసుకునేందుకే ఇంటింటికీ సిపిఐ : బాల నరసింహ్మా

**నాగర్ కర్నూల్ :** ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కార దిశలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం చేపట్టామని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలో ప్రారంభించిన ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి బాల నరసింహ ప్రారంభిచారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేశవులు గౌడ్, తెలకపల్లి మండల కార్యదర్శి రవీందర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కె.శివకృష్ణ, బుగ్గ స్వామి, విష్ణు, నరేందర్‌రెడ్డి, డి.బిచ్చయ, మారేడు బిచ్చాలు, మారేడు బాల పీరు, అనంతపురం కురుమయ్య బాలస్వామి బాలు పాల్గొన్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజాపోరాటాల స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకెళతామని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్‌పాషా తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి పాషా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వై.ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్, జి.వీరస్వామి, భూక్యా ధన్రు, ఎస్‌కే ఫహీమ్, కొమారి హన్మంతరావు, దీటి లక్ష్మీ పతి పాల్గొన్నారు.

**కోరుట్ల :** ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమమని పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సుతారి రాములు తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమం కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నేతలు ఎండి ముక్రం, ఎన్నం రాధా,ఎండి మౌలానా,మొయినుద్దీన్ రాంబాబు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో గడప గడపకు సిపిఐ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దపల్లి మండల కార్యదర్శి పూసాల రమేష్, సహాయకార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్, విద్యార్థి సంఘ నాయకులు బాలసాని లెనిన్, చంద్రగిరి ఉదయ్, బండారి సదానందం, జోగుల రామస్వామి, కాదాసి సదయ్య, మాచర్ల లక్ష్మ ణ్, శంకర్, కల్లేపల్లి రవి, బాలాజీ, పెర్క రాయమల్లు, దొమ్మటి రాజేష్ పాల్గొన్నారు.

**సూర్యాపేట టౌన్ :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న సిపిఐ పార్టీకి ప్రజలు అండగా నిలిచి విరాళాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ఆయన పట్టణంలోని పిఎస్‌ఆర్ సెంటర్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు యల్లంల యాదగిరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె ఫయాజ్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జంపాల మల్లయ్య, దేశగాని హేమలత, పట్టణ కార్యవర్గ సభ్యులు పెంద్ర కృష్ణ, ఎండి పాషా, ఎఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, కామేష్, రాము, కొత్వాల్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

**కాజీపేట :** నిరంతరం ఉద్యమించే త్యాగాల పార్టీ సిపిఐని ఆదరించాలని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. కాజీపేట మండలం మడికొండలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని కర్రే భిక్షపతి ప్రారంభించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి, మండల కార్యదర్శి మాలోతు శంకర్‌నాయక్, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, కుడి స్వామి, రాసమల్ల దీన, స్వరూప, రమేష్, కృష్ణ, మణెమ్మ పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** పోరాట పార్టీ సిపిఐకి చేయూత నివ్వాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు కోరారు. 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమంలో బుధవారం మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, కలిపెల్లి మహేందర్, మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, పేరబోయిన పెంటయ్య, ఉపసర్పంచ్ కాటం శ్రీకాంత్, నమిల సంజీవ, తుమ్మల ఉపేందర్, రాకల మహేందర్, రేఖల మల్లుస్వామి, కలిపెల్లి శ్రీశైలం, కాటం బాలయ్య, గద్దం నర్సయ్య, కల్లెపెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరీంనగర్...



ఖమ్మం...



యాదగిరిగుట్ట...



కాజీపేట...



పెద్దపల్లి...



కోరుట్ల......



రామకృష్ణాపూర్...



నాగర్‌కర్నూల్...



భద్రాద్రి...



సూర్యాపేట...



## స్థలం కోల్పోయిన వారికి డబుల్ బెడ్ ఇళ్లను ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఉప్పల్:** డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణానికి స్థలం తీసుకున్న వారికి డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ డివిజన్ ఇందిరా నగర్ పరిధిలోని ఆదర్శ్ నగర్ ప్రాంతంలో స్థలం తీసుకుని గతంలో డబుల్ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చినప్పటికి స్థలం ఇచ్చినవారికి హామీ నెరవేరలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తుండడంతో స్థలం కోల్పోయిన వారితో కలసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు,కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

**దేవాలయానికి నిధులు కేటాయించాలని వినతి**



కుషాయిగూడ కాటమయ్య ఆలయాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కుషాయిగూడలోని గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి రెండు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గౌడ సంఘం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాండాల శివకుమార్‌గౌడ్, నాయకులు మహేష్‌గౌడ్, తాళ్ల వెంకటేష్‌గౌడ్, బుదంపల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సేవల్లో కార్పొరేట్ సంస్థల పాత్ర హర్షణీయం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** సామాజిక సేవల్లో స్వచ్ఛందంగా కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు ముందుకు వచ్చి భాగస్వాములవటం హర్షణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం పారిశ్రామిక వాడలోని ప్రముఖ సంస్థ వోయిత్ టర్బో ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ మల్లాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బయోగ్యాస్ ప్లాంట్, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీగా అందించిన రూ. 5 లక్షలతో చేపట్టిన పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట గ్యాస్ తయారీ ఖర్చు తగ్గుతుందని, విద్యార్థులకు పునరుత్పాదక ఇంధనంపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు శ్రీలత, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు ఈశ్వర్ ప్రసాద్, మోహనరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఇంద్రజ, మహేష్, నరసింహారావు, కాలనీ ప్రతినిధులు వాసుగౌడ్, ప్రవీణ్, ధర్మారెడ్డి, కాసం రాజిరెడ్డి, దయాకరరెడ్డి, రఘువరన్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటి కారిడార్ సిఐగా కనకయ్య గౌడ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ సిఐగా కె కనకయ్యగౌడ్ బుధవారం ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పోచారం ఐటి కారిడార్ సిఐగా పనిచేసిన రాజు వర్మ సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కనకయ్యను ఎస్సైలు, కానిస్టేబుల్ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇంజక్షన్ తీసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/వర్గపల్లి:** గుర్తు తెలియని ఇంజక్షన్ తీసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కీసర పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కీసర అహ్మద్‌గూడ శ్రీ లక్ష్మి ఎన్‌క్లేవ్‌కు చెందిన జోసెఫ్ వినోద్‌కుమార్ భార్య వీణపాణి మధ్య గత కొంత కాలంగా విభేధాలు, గొడవలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నారని ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు, తన కుమారుడి మృతికి కారణం తన భార్య వీణమణి చేసిన మానసిక వేధింపులకు గురై ఔటర్ రింగ్ రోడ్ రాంపల్లి దాయర వద్ద తన కారులో గుర్తు తెలియని ఇంజక్షన్ తీసుకుని మృతి చెందాడని మృతుడి తండ్రి ఆరోగ్యయ్య ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

### నాలుగు లేబర్ కోడ్‌ల అమలు

# తక్షణమే విరమించుకోవాలి

**ఎఐటియుసి, సిఐటియు ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ**




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కేంద్ర ప్రభుత్వం నేటి నుండి అమలు చేయనున్న 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర పూర్వ కార్యదర్శి విఎస్ బోస్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి జాతీయ సమితి పిలుపు మేరకు సిపిఐ ఉప్పల్ సమితి ఆధ్వర్యంలో ఇసిఐఎల్ కూడలి వద్ద బ్లాక్ డేగా పాటిస్తూ ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులను పరిరక్షించుకొనేందుకు కార్మికవర్గం ఏకమై పోరాటం చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి నేతలు శంకర్‌రావు, నారా నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.




**నిజాంపేట్:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ల అమలుని విమరమించుకోవాలని డిమాండ్ చేస్తూ షాపూర్ నగర్ రైతు బజార్ నుండి బస్టాండ్ వరకు ఎఐటియుసి, సిఐటియుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలను ధరించి ప్లకార్డుల తో భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్‌లు మాట్లాడుతూ బ్రిటీష్ వారు రాకముందు, బ్రిటీష్ వారి హయాంలో కార్మికులకు ఎలాంటి పని గంటలను నిర్ణయించకుండా పధ్నాలుగు , పదహారు గంటలు పనిచేయించు కుంటున్న తరుణంలో దేశ కార్మికులు ఎనిమిది గంటల పనిదినాన్ని అమలు అయ్యేలా పోరాడారని తెలిపారు. ఉద్యోగుల భద్రత, నష్ట పరిహారపు బిల్లు, జీతభత్యాల, బేరసారాల చట్టం లాంటి బ్రిటీష్ హయాంలో కార్మిక సంఘాల పోరాటం వల్ల చట్టాలను సాధించుకున్నామని, ఆ చట్టాల వల్ల ఇప్పటి వరకు కార్మికులు ఎనిమిది గంటల పని, భద్రత, జీతభత్యాల పెంపుకోసం యూనియన్ల ఆధ్వర్యంలో చర్చలు జరిగేవి. దీనివల్ల దేశంలోని కోట్లాదిమంది కార్మికులకు ఉపయోగం జరిగేదని వివరించారు. నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మికులు ఎనిమిది గంటల నుండి పన్నెండు గంటల వరకు పెంచారని, ఉద్యోగుల భద్రతను గాలికి వదిలేశారని, జీతాల పెంపుకోసం చర్చించే విధంగా లేకుండా చేసి ఉద్యోగులు యాజమాన్యాల దయా దాక్షిణ్యాలతో పనిచేసే విధంగా నూతన లేబర్ కోడ్‌లు ఉన్నాయని అన్నారు. వెంటనే నూతన లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా పాట 29 కార్మిక చట్టాలని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్మికులు, ఉద్యోగస్తులు ఈ బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను తెలుసుకుని రానున్న రోజుల్లో బిజెపికి గట్టి బుద్ధి చెప్పాలని లేకపోతే మన భవిష్యత్తు తరాలు పన్నెండు గంటల నుండి పదహారు గంటల వరకు కూడా పనిచేసే విధంగా చట్టాలను ఈ కేంద్ర ప్రభుత్వం చేసే ప్రమాదం కనిపిస్తుందని మండిపడ్డారు. ఇది ఒక్కరి సమస్య కాదని ప్రతిఒక్కరి సమస్యగా భావించి ప్రజలలో ముఖ్యంగా కార్మికులలో బిజెపి చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను పెద్దఎత్తున సమీకరించి ఆందోళనలను ఉధృతం చేయా లని అన్నారు. పోరాటాల వల్లే ప్రజలకున్న బానిస సంకెళ్లు తొలగించబడతాయని, అందరూ సమానంగా జీవించే హక్కు కాపాడబడుతుందని అన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలను, ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐటియుసి, సిఐటియు నాయకులు స్వామి, శ్రీనివాస్, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణం చేపట్టేవరకు పోరాటం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కాప్రా మండలం గబ్బిలాలపేట ప్రాంతంలోని ఎంపిపి ప్రభుత్వ పాఠశాల నూతన భవన నిర్మాణం చేపట్టే వరకు సిపిఐ పోరాటం కొనసాగిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్‌లతో కల్సి ఆయన బుధవారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, స్థానికులతో కల్సి పాఠశాలలో ఉన్న సమస్యలను తెలుసుకొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పాఠశాలకు శాశ్వత భవన నిర్మాణం కోసం గతంలో నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించినప్పటికి ఇప్పటి వరకు ఆ దిశగా పనులు చేపట్టక పోవటం జిల్లా విద్యాశాఖాధికారి, సంబంధిత అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ నిర్లక్ష్య స్పష్టంగా కనపడుతోందన్నారు. సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంలు ఈ పాఠశాల భవనం కోసం స్థలం కేటాయించేందుకు అసెంబ్లీలో ప్రస్తావించిన నేపథ్యంలోనే రెవెన్యూ అధికారులు స్పందించి స్థలం కేటాయించారన్న విషయాన్ని గుర్తు చేసారు. ప్రభుత్వ పాఠశాల పట్ల జిల్లా అధికారులు మాటలు తప్ప చేతల్లో ఏ మాత్రం శ్రద్ధ కనపరచలేదనటానికి ఈ పాఠశాల నిదర్శనమన్నారు. ఈ పాఠశాలలో ఉన్న 126 మంది విద్యార్థులకు కేవలం మూడు గదుల్లోనే బోధన జరుగుతుండ గా 46 మందికి నిబంధనల ప్రకారం అవసరమైన ఆధార్ కార్డులు సైతం లేక పోవటం, వాటి గురించి విద్యా శాఖాధికారులు శ్రద్ధ తీసుకోవటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం పాఠశాల శాశ్వత భవన నిర్మాణం చేపట్టి సమస్యలు తీర్చే వరకు తాము పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అన్వర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహులు, మండల సహాయ కార్యదర్శి రాజేశ్వరి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.




## యుద్ధం వల్ల అమాయక ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు

**సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్**

**ప్రజాపక్షం/తాండూరు:** గతంలో జరిగిన, రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సిపిఐ చేపట్టిన ఇంటింటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజలక్ష్మి పండిత్ పిలుపునిచ్చారు. బుధవారం తాండూరులో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం అనంతయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నేటి నుండి ఏప్రిల్ 10వరకు 'ఇంటింటికి సిపిఐ' అనే నినాదంతో చేపట్టనున్న కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు. అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ మారణకాండను తీవ్రంగా ఖండించారు. యుద్ధం వల్ల ఏ సమాజం కూడా బాగుపడదని, ఆర్థికంగా ఇప్పటికే పలు దేశాలు కుదేలైన పరిస్థితిల్లో మరింత పతనానికి దారితీస్తుందన్నారు. ఆస్తి ప్రాణ నష్టాలను లెక్కచేయకుండా యుద్ధోన్మాదులు చేస్తున్న పైశాచిక చర్య వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, మన దేశంలో గ్యాస్ ఇబ్బందులతో ప్రజలు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావన్నారు. కొంతమంది మాఫియాగా మారి ధరలను పెంచేస్తున్నారని వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమెరికాతో సహా పలు దేశాలు ప్రజలు రోడ్లపైకి వచ్చి యుద్ధానికి వ్యతిరేకంగా నిరసనలను తెలియజేస్తున్నారని మన దేశంలో ఆ స్థాయిలో చైతన్యం రావడం లేదన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి ఫీర్ మహ్మమద్, రవీందర్, వెంకటేష్, మునీర్, అహ్మద్, సురేష్, పుష్ప, రాజశేఖర్, బాబు, సుదర్శన్, లక్ష్మి తదితురులు పాల్గొన్నారు.

## ఈతను పాఠ్యాంశంగా చేర్చాలి

**కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన**

**ప్రజాపక్షం/దుండిగల్:** ఈతను పాఠశాల పుస్తకాలలో చేర్చాలనీ ఎన్నోసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, అధికారులకు చెప్పినా స్పందనలేదని కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యువకుల మరణానికి కారణం విద్యాశాఖదా, తల్లిదండ్రులదా, ప్రజాప్రతినిధులదా? విద్యార్థులకు ఈత ఒక సాధన అని బోధించాలనీ ఈత వచ్చినవాడు చేతులు కాళ్లు నీళ్లపై కొడుతూ నోటిలోని నీటిని చిమ్ముతూ, ఈదుకుంటూ పోతాడనీ ఈత రానివాడు భయంతో నీళ్లు తాగుతు చేతులు పైకి కాళ్లు కిందకు పెట్టి మునిగిపోతూ మరణిస్తారని అప్పుడు ఈత వచ్చినవాడు వాడి జుట్టు గానీ నడుముకు ఉన్న నిక్కరు దారం కానీ పట్టుకొని లాగగానే లేదా ఒక తాడు, కర్ర, దోతి, చున్నీ, చీర, అందించాలి. అలా చేయకుండా వాడిని కాపాడడానికి వెళితే గట్టిగా పట్టుకొని ఇద్దరు చనిపోతారనీ అన్నారు. దేశంలో ప్రతి ఏటా 40 నుంచి 50 వేల మంది రాష్ట్రంలో 1000 నుంచి 2000 మంది, యువత చనిపోతున్నారనీ అందుకని పాఠశాలలో విద్యార్థులకు ఇదొక సాధన అని పొడుపు కథ రూపంలో చెప్పాలనీ, ఈత నేర్చుకున్న వాడికి రెండు మార్కులు ఇస్తామని విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వాలనీ 25 సంవత్సరాల నుండి మాజీ సిఎం వైఎస్ఆర్ మొదలు ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రజాభవన్‌లో వినతి పత్రం అందజేశామన్నారు.అధికారులు స్పందించి యువత, విద్యార్థుల ప్రాణాలు కాపాడాలని అన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే సిపిఐ లక్ష్యం

**మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్**

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ సర్కిల్ 11వ డివిజన్ ఇందిరా నగర్ కాలనీలో మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ కుల, మత, అవకాశవాద రాజకీయాలను తిప్పికొడదాం. మానవ హక్కులను, రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం. దేశంలో పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల కష్టాలు, విద్య, ఆరోగ్య రంగాలలో సంక్షోభం ఇవన్నీ ప్రజల జీవితాలను కుదిపేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రజల పక్షాన నిలబడి ఇంటింటికి సిపిఐ ప్రజా సమస్యల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, పోరాటాల ద్వారా పరిష్కారం సాధించడం కోసం కార్యాచరణ రూపొందిస్తున్నాం. పంటలకు సరైన కనీస మద్దతు ధర ఎంఎస్‌పి లేకపోవడం ఎరువులు, విత్తనాల ధరలు పెరగడం రుణ భారం వల్ల ఆత్మహత్యలు పంట బీమా సరైన విధంగా అమలు కాకపోవడం. కార్మికుల సమస్యలు కనీస వేతనాలు అమలు కాకపోవ డం, కాంట్రాక్ట్ వ్యవస్థ పెరుగుదల కార్మిక హక్కుల ఉల్లంఘన. ఫీజుల భారంతో చదువు భారం అవుతుంది. ప్రభుత్వ పాఠశాల నిర్లక్ష్యం, ఉద్యోగ అవకాశలోపం, ఆరోగ్య సమస్యలు ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల లేమి. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ, మందుల ధరల పెరుగుదల. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గృహ సమస్యలు ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇవ్వడంలో విఫలం. గృహ పథకాలలో అవినీతి మౌలిక వసతులు, తాగునీటి సమస్య, డ్రైనేజీ, రోడ్లు దారుణ స్థితి పట్టణ ప్రాంతాలలో అభివృద్ధి లేకపోవడం. ప్రభుత్వం వైఫల్యాలపై ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, జి నాగరాజు, బిసి సంఘం జిల్లా నాయకురాలు కె. ప్రమీల, మండల కౌన్సిల్ సభ్యులు భూతం ఐలయ్య, నరసమ్మ, సిపిఐ నాయకులు ఇస్తారీ, సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ గ్యాస్ సిలిండర్లు, కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాలపై టాస్క్ ఫోర్స్‌దాడులు

**ప్రజాపక్షం/పరిగి:** మున్సిపల్‌లో అక్రమంగా సిలిండర్లు సరఫరా, కుళ్ళిన మాంసం, కల్తీ ఐస్‌క్రీమ్ కేంద్రాలపై టాస్క్ ఫోర్స్ మెరుపుదాడులు నిర్వహించింది. ఇందులో అక్రమంగా తయరు చేస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకోవడం సిఐ అన్వర్‌పాషా బృందం తెలిపారు. పరిగిలోని విద్యానగర్ కాలనీకి చెందిన కృష్ణ నివాసంలో సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు నిల్వ ఉంచినట్లు అందిన సమాచారం మేరకు తనిఖీల్లో నిండుగా ఉన్నఐదు సబ్సిడీ సిలిండర్లు, 4 ఖాళీ సిలిండర్లు , కమర్షియల్ 3, మొత్తం 12సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. మహ్మద్ ఖలీల్ తన మటన్ షాపులో కుళ్ళిన 35 కిలోల మాంసాన్ని సీజ్ చేశారు. మొయిన్ రోడ్డులోని ఎలాంటి అనుమతులు లేకుండా గడువు ముగిసిన ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్న శ్రీనిత ఐస్‌క్రీమ్ యూనిట్‌ను తనిఖీ చేశారు. వికారాబాద్‌కు చెందిన వర్కాల హన్మంతు కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసునమోదు నిమిత్తం పరిగి పోలీస్‌లకు అప్పగించడం జరిగిందన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

**ప్రజాపక్షం/పరిగి :** మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో పద్మమ్మ (65) అనే మహిళకు భర్త, కుమారుడు మరణించారు. ఒంటరిగా ఉంటున్న ఆ మహిళ అనుమానాస్పద స్థితిలో రక్తపు మడుగులో మృతిచెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు,పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముఖంపై ఛాతీపై రక్తం గాయాలు మాదిరిగా ఉండడంతో అనారోగ్యంతో రక్తం కక్కుకొని చనిపోయిందా లేదా ఫించన్ డబ్బులతో పాటు ఇతర డబ్బులకోసం హత్య చేసి ఉంటారని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

**ప్రజాపక్షం/పరిగి:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండు వెంకటేష్ అన్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది అన్నారు. అత్యవసర చికిత్సల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి 31వేలు చెక్కు ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేరాల అదుపునకు సిసి కెమెరాలు దోహదం

**నవాబుపేట ఎస్సై గిరి**



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నేరాల అదుపునకు సిసి కెమెరాలు దోహదపడతాయని ఎస్ఐ కె.గిరి అన్నారు. నవాబుపేట్ మండలంలోని దుకాణదారులు తప్పనిసరిగా సిసి కెమెరాలు వినియోగించుకోవాలని, దుకాణాల్లో సీసీ కెమెరాలు, హైసెక్యూరిటీ లాకర్లను ఏర్పాటు చేసుకోవాలని షాప్ యజమానులకు సూచించారు.బుధవారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన దుకాణ దారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు,సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని తెలిపారు. వ్యాపారం ముగిసిన తరువాత క్యాష్ సేఫర్ లో భద్రపర్చాలని, సేఫర్లు ఎవరికీ కనిపించని ప్లేస్‌లో పెట్టాలన్నారు. డిజిటల్ ట్రాన్సక్షన్స్ మాత్రమే చేయాలని తెలిపారు. సిసిటివి కెమెరాలు బిగించి, క్లౌడ్ స్టోరేజ్‌కి అనుసంధానం చేయాలన్నారు. దొంగతనాలు, సిసి కెమెరాల మరమ్మతుకు, అదనపు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామాలలోని దుకాణదారులు శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గిరి, పోలీస్ సిబ్బంది దుకాణదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏజెంట్ల నియామకానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

**కలెక్టర్ దీపక్ తివారి**



**ప్రజాపక్షం/వికారాబాద్:** బూతుస్థాయి ఏజెంట్ల నియామకానికి రాజకీయ ,పార్టీల ప్రతినిధులు ప్రత్యేకశర్ద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి సూచించారు. ప్రత్యేక ఎస్ఆర్ఐ లో భగంగా బూతుస్థాయి ఏజెంట్ల నియామకం ,మ్యాపింగ్ ప్రక్రియ ,ఓటర్ జాబితాలో మార్పులు చేర్పులు ,లా.ఇకల్ ఎర్రర్స్‌పై మసక బరిన ఫోటోలు ,ఫోటో వెనుక చెట్లు ,వేరే వారి ఫోటోలు ఉండడం జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేనట్లయితే ఎప్ఐఆర్ పారదర్శకంగా ఉంటుందన్నారు. జిల్లాలో 1133 వార్డులు ఉన్నాయని ,రాజకీయపార్టీలు పూర్తిస్థాయిలో బూత్ స్థాయిలో ఏజెంట్ లను నియమించడం లేదని ,గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ఏప్రిల్ 3నాటికి బిఎల్ఓలకు సబితాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో బూత్‌స్థాయి అధికారులను సంప్రదించి బోగస్ ,డబుల్ ,మరణించిన ఓటర్ల ను తోలగించే విషయంలో స్థానికంగా ఉన్న బిఎల్‌ఏల సహకరం ఎంతో అవసరమని కలెక్టర్ తెలిపారు. ఓటర్ జబితాకు సంబంధించిన ఏవైనా తప్పులు దొర్లినట్టయితే ఆన్‌లైన ద్వారా దరఖాస్తులు చేసుకునే విధంగా ప్రజలకు సూచించారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్రు ఓటరుగా నమోదు చేసుకొని ,పత ఫోటోలు ,ఇతర ఫోటోలు ఉన్న వటిని సరి చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపుకలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్ , ఆర్‌డిఓ వాసుచంద్ర తదితరులు పాల్గోన్నారు.

## సాంకేతిక ప్రపంచంలో నిరంతరం అభ్యాసం, ఆవిష్కరణలు అత్యంత కీలకం

**లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్, ఇంజనీరింగ్ హెడ్ హిమ బిందు**







**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రస్తుతం సాంకేతిక ప్రపంచంలో నిరంతరం అభ్యాసం, పట్టుదల, ఆవిష్కరణలు అత్యంత కీలకమని లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇంజనీరింగ్ హెడ్ హిమ బిందు వెజెల్లా అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లోని బివిఆర్ ఐటి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సినర్జియా–2026 కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యిమంది విద్యార్థులు పాల్గొనగా దేశవ్యాప్తంగా ఉన్న అరవై కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొనడం ఈ కార్యక్రమానికే ప్రత్యేకతను తీసుకువచ్చింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమం జరిగింది. మొదటి రోజు సాంకేతిక కార్యక్రమాలు, రెండవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, మూడవ రోజు కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సాంకేతిక కార్యక్రమాల్లో విద్యార్థుల జ్ఞానం, నైపుణ్యత, సృజనాత్మకతను ప్రతిబింబించేలా పలురకాల పరికరాలను రూపొందించారు. కోడింగ్ పోటీలు, ప్రాజెక్టు ప్రదర్శనలు, పేపర్ ప్రెజెంటేషన్స్, సాంకేతిక క్విజ్‌లు, డిజైన్ ఛాలెంజ్‌లు వంటి కార్యక్రమాలు విద్యార్థులకు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాన్ని కల్పించినట్లు పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ ఇంజనీరింగ్ హెడ్ హిమ బిందు వెజెల్లా మాట్లాడుతూ తన విశేష అనుభవాన్ని పంచుకుంటూ ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో నిరంతర అభ్యాసం, పట్టుదల, ఆవిష్కరణలు అత్యంత కీలకమని వివరించారు. తన వృత్తి ప్రయాణంలో ఎదురైన సవాళ్లు, సాధించిన విజయాలను విద్యార్థులతో పంచుకున్నారు. పట్టుదలతో విద్యార్థులు ముందు కు వెళ్లాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎల్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఉత్సవంలో చురుకుగా పాల్గొని తమలోని ప్రతిభను వెలికితీయాలని, నూతన విషయాలను నేర్చుకోవాలని, భవిష్యత్తులో సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎసి సాంస్కృతిక విభాగాధిపతి కె.వర్మా, సమన్వయకర్త డాక్టర్ వి.మాలతి, విద్యార్థి వ్యవహారాల మండలి అధ్యక్షురాలు సారా, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో గ్రామాభివృద్ధికి కృషి

సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్



**ప్రజాపక్షం/యాచారం :** గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మేడిపల్లి నక్కర్త గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ అన్నారు. బుధవారం మేడిపల్లి నక్కర్త గ్రామంలో నూతన డ్వాక్రా భవనం నిర్మాణానికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుగుణ మాట్లాడుతూ గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. గ్రామంలో అవసరమైన సిసి రోడ్లు, మురికి కాలువల నిర్మాణం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దెంది మధుకర్‌రెడ్డి, ఎపిఎం రవిందర్,పంచాయతి కార్యదర్శి తిరుపతయ్య, ఐకెపి సిసి గణేశ్,వార్డు సభ్యులు మాధవి, మమత, జ్యోతి,అనిల్,కళమ్మ,మహేశ్, పద్మ, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి : జక్కిడి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** రంగారెడ్డి జిల్లా నిరుద్యోగ ఎస్‌సి యువతి యువకులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన 2 వీలర్, 3 వీలర్ ఎలక్ట్రికల్ వెయికిల్స్ మరియు రైతులకు సోలార్ పంప్ సెట్ల పథకన్ని సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి అన్నారు తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ ఎస్‌సి యువతకు ఎస్‌సి కార్యాచరణలో భాగంగా ప్రవేశ పెట్టిన పథకానికి అప్లియ్ చేసుకొనే గడువు పొడిగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏప్రిల్ 8 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని జక్కిడి శివ చరణ్ రెడ్డి తెలిపారు.

## సమర్ధవంతంగా ఎస్‌సి, ఎస్‌టి చట్టాల అమలు

దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లాకార్యదర్శి రమేశ్



**ప్రజాపక్షం/యాచారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి చట్టాలను సమర్ధవంతగా అమలు చేయాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ మరియు పిపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ అవాకేనింగ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జోగు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం యాచారం మండల కేంద్రంలోని వికలాంగుల భవన్‌లో సిటిజన్స్ విజిలేన్స్ మానిటరింగ్ కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఎస్‌సి, ఎస్‌టి , బిసి, మైనార్టీలు అలాగే ఒ బిసిలుగా ఉన్నటువంటి సామాజిక న్యాయం మహిళల భద్రత భూమిలేని వారికి భూమి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సివిఎంసి కమిటీ ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ఎలాంటి అన్యాయం జరిగినా ప్రభుత్వపరంగా అందవల్సిన పథకాలు అందే విధంగా ఎస్‌సి, ఎస్‌టి చట్టం ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలన్నారు. సామాజిక న్యాయం మహిళల పట్ల భద్రత కల్పిచాలని కొరారు.భాదితులకు అండగా ఉంటామన్నారు. యాచారం మండల కార్యదర్శి బడే భాగ్యమ్మ,ఆద్వర్యంలో ఈ యొక్క కమిటీ వేయడం జరిగింది. కార్యక్రమంలో కొమ్మురాములు, సాయికిరణ్, రాములు, విష్ణు, యాదయ్యా, జంగయ్య, యాదయ్యా, కృష్ణ, నర్సింహ్మా, శివ, ప్రవిణ్, జంగయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేదల కళ్లల్లో ఆనందం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేద ప్రజల కళ్లల్లో ఆనందం కనిపిస్తుందని లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్‌ల ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రణాళికబద్దంగా అమలు చేస్తుందని వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్దిదారులు విధిగా నిర్మించేందుకు కృషిచేస్తున్నారని, బిల్లులు పెండింగ్ లేకుండా వస్తున్నాయని గుర్తుచేశారు. లబ్దిదారులు భీష్వ లావణ్య, చీపిరి బిక్షపమ్మల ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సురేష్ గౌడ్, వార్డు సభ్యులు మల్లేష్ యాదవ్, వీరేష్ గౌడ్, ఖదీర్, గంటెల శంకరయ్య, బోటిగుడెం శ్రీశైలం, బస్తపురం అంజయ్య, చాకలి మైసయ్య, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో గోదాం



**ప్రజాపక్షం/కేశంపేట:** ధాన్యం నిల్వ చేసేందుకు నిర్మించనున్న గోదాంకు అధికారులు శంకుస్థాపన చేశారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలో సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలంతో కలిసి ఏపిఎం కవిత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏపిఎం కవిత మాట్లాడుతూ అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నిల్వ చేసేందుకు సుమారు రూ.30లక్షలతో గోదాంను నిర్మించడం జరుగుతుందని వివరించారు. మహిళా సమాఖ్య ద్వారా అన్నదాతల నుండి కొనుగోలు చేసిన ధాన్యం నిల్వ చేసేందుకే ఈ గోదాంను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కేశంపేట ఎంపిడివో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎఫ్‌పిసి చైర్మెన్ విజయ, చంద్రకళ, ఏఈ నర్సింగ్‌రావు, మాజీ సర్పంచ్ యాదయ్య, కవిత, యాదయ్య, లక్ష్మమ్మ, లక్ష్మ ణ్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

## మూడు కార్పొరేషన్ల పరిధిలో..

# రూ.2,558 కోట్ల ఆస్తి పన్ను వసూలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆస్తి పన్ను వసూళ్లలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు రికార్డును సృష్టించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ. 2,558.80 కోట్ల పన్నులు వసూలయ్యాయి. అంతకుముందు 2024-25 ఆర్థిక సంవత్సరంలో పూర్వం జిహెచ్‌ఎంసి పరిధిలో రూ. 2,038.46 కోట్లు వసూలవ్వగా, గడిచిన ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ. 520.34 కోట్లు అదనంగా రావడం గమనార్హం. గత ఏడాది నవంబర్‌లో 27 స్థానిక సంస్థలను విలీనం చేయడం వల్లనే ఆస్తి పన్ను వసూళ్లు పెరాగాయని అధికారులు భావిస్తున్నారు. మొదటగా పూర్వ జిహెచ్‌ఎంసి రూ.3 వేల కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నప్పటికీ, మూడు కార్పొరేషన్ల విభజన తర్వాత ఆ లక్ష్యాన్ని రూ.2,500 కోట్లకు కుదించుకున్నది. కాగా ఆస్తిపన్నుల వసూళ్లలో గ్రేటర్ పరిధిలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) అగ్రస్థానంలో నిలిచింది.






### చివరి రోజు భారీగా చెల్లింపులు....

ఆర్థిక సంవత్సరం చివరి రోజు మార్చి 31న (మంగళవారం) పన్ను చెల్లింపుదారులు క్యూ కట్టారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే రూ.162.94 కోట్లు వసూలయ్యాయి. జిహెచ్‌ఎంసి రూ.84.70కోట్లు వసూలు చేసి మొదటి స్థానంలో నిలిచింది. కాగా మార్చినెలలో జిహెచ్‌ఎంసి రూ.203.20కోట్లు, సిఎంసి రూ.143.69 కోట్లు, ఎంఎంసి రూ.107.09 కోట్లు వసూలయ్యాయి.

### నేటి నుంచి 'అర్లీ బర్డ్' స్కీమ్...

నూతన ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభమైన నేపథ్యంలో మూడు కార్పొరేషన్ల పరిధిలో 'అర్లీ బర్డ్' పథకాన్ని అమలులోనికి వచ్చింది. ఈ పథకం కింద ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈ నెలలోనే ముందస్తుగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుంది. కాగా ఈ రాయితీ కేవలం ప్రస్తుత సంవత్సర పన్నుకు మాత్రమే వర్తించనుందని జిహెచ్‌ఎంసి జాయింట్ కమిషనర్(రెవెన్యూ) రజనీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**కార్పొరేషన్ల వారీగా ఆస్తిపన్నుల వసూళ్లు (2025-26 ఆర్థిక సంవత్సరం ):**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి ) రూ. 1,003.36 కోట్లు..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి ) రూ. 992.82 కోట్లు..

మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) రూ. 562.62 కోట్లు...

## ఎసిబికి చిక్కిన లంచావతారాలు



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** అవినీతి అధికారులు, ఉద్యోగులపై ఎసిబి ఉక్కుపాదం మోపుతోంది. బుధవారం క్యూర్ పరిధిలోకి వచ్చే వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్, ఎసిబి దాడులు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే ఎఎస్ఐ పూసల బాలయ్య రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఓ కేసు విషయంలో ఫిర్యాదుదారుడి క్రిమినల్ కేసును లోక్‌అదాలత్‌లో రాజీ చేసేందుకు సెక్షన్ మార్చుతానని హామీ ఇచ్చి లంచం డిమాండ్ చేయగా.. బాధితులు ఎసిబిని ఆశ్రయించాడు. ఇదిలాఉండగా.. ఉస్మానియా యూనివర్సిటీలో ఎసిబి అధికారులు ఇద్దరు ఉద్యోగులకు వల వేసి పట్టుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ పేబిల్ సెక్షన్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అరవింద్, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌లను లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. జూనియర్ అసిస్టెంట్ రమేష్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.13 వేలు లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా సిటీ రేంజ్2 బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఈ మొత్తం అతడు తనకే కాకుండా సీనియర్ అసిస్టెంట్ అరవింద్ తరఫున కూడా తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి తల్లి పెన్షన్ ప్రయోజనాలకు సంబంధించిన ఫైల్‌ను ఉన్నతాధికారులకు పంపడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రాసెస్ చేయడం కోసం ఈ లంచం తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విధులను సక్రమంగా నిర్వహించకుండా అనుచిత లాభం పొందేందుకు ప్రయత్నించినట్లు ఎసిబిగుర్తించింది. ఘటనలో సీనియర్ అసిస్టెంట్ అరవింద్, జూనియర్ అసిస్టెంట్ రమేష్లను అరెస్ట్ చేసి, ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఎసిబి టోల్ ఫ్రీ నెం:1064కు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలను కోరారు.

# సమృద్ధిగా ఇంధనం, ఎల్‌పిజి

అక్రమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

షేక్‌పేట, పంజాగుట్ట ఘటనలపై అప్రమత్తత

కలెక్టర్ హరిచందన దాసరి



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలో సమృద్ధిగా ఇంధనం, ఎల్‌పిజి నిల్వలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ ఇంధనం, ఎల్‌పిజి కొరత ఉందన్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోరారు. జిల్లా అవసరాలకు సరిపడా పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి లభ్యత ఉందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 18.62 గృహావసర ఎల్‌పిజి కనెక్షన్లు, 69 పంపిణీ కేంద్రాలు ఉన్నాయన్నారు, ఎల్‌పిజి సరఫరా సాధారణ స్థితిలో ఉన్నప్పటికి దిగుమతుల తగ్గుదల కారణంగా ప్రైవేటు ఆపరేటర్లు నిర్వహిస్తున్న ఆటో ఎల్‌పిజి కేంద్రాల్లో కొంత ఒత్తిడి ఉందన్నారు. వచ్చే 15రోజుల్లో సరఫరాను పెంచి పరిస్థితిని స్థిరీకరించాలని అధికారులను కలెక్టర్ హరిచందన ఆదేశించారు. షేక్‌పేట, పంజాగుట్ట ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఎల్‌పిజి ఘటనలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. ఒక సిలిండర్ కనెక్షన్ ఉన్న కుటుంబాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. రీఫిల్లింగ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని చెప్పారు. అధిక బుకింగ్స్, ఓటిపి ఆధారిత ధృవీకరణ కారణంగా వ్యవస్థపై ఒత్తిడి పెరిగి సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని, దీని వల్ల సిలిండర్ డెలివరీల్లో కొంత ఆలస్యం అవుతోందని ఏజెన్సీలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చాయి. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో చీఫ్‌రేషనింగ్ అధికారి రాజిరెడ్డి, జిల్లా పౌరసరాల శాఖాధికారి శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ అదనపు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### నియామక పత్రాల అందజేత

జిల్లాలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకాలు ఇచ్చారు. ఇట్టి నియామక పత్రాలను కలెక్టర్ హరిచందన దాసరి వారి కుటుంబసభ్యలకు బుధవారం అందచేశారు.



# కార్మిక వ్యతిరేక విధానాలు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని కార్మిక నాయకులు ఆమనగంటి వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం హయత్‌నగర్ డిపో గేటు వద్ద జెఎసి పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు వెంకన్న మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 లేబర్ కోడ్లను రద్దుచేసి నాలుగు గా కుదించి కఠిన నిర్ణయాలు తీసుకునే విధానాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేశారు. కేంద్ర ప్రభుత్వం మండివైఖరికి వీడనాడి అమలు చేసే కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలతో భవిష్యత్తులో డ్రైవరు అనే వ్యక్తికి మనుగడ లేకుంటే పోతుందన్నారు. కార్మిక వ్యతిరేకమైన ఈ బిల్లు



తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు బుద్ధ శాలు, కె.దశరథ, చంద్రయ్య, అన్నపూర్ణ, వీరన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరం సిఎం సహాయనిధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలాంటిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. బుధవారం నవాబుపేట మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండలానికి చెందిన అక్నాపూర్, పులుమామిడి, దాత పూర్, నవాబుపేట, తిమ్మారెడ్డి పల్లి, కేశపల్లి, ఎల్లకొండ, ఏక్ మామిడి, ముబారక్ పూర్,చిట్టిగిద్ద, గంగ్యాడ,మాదిరెడ్డి పల్లి మీనపల్లి గ్రామాలకు చెందిన 24మంది లబ్ధిదారులకు 10లక్షల 40వేల రూపాయల విలువగల చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో వున్నా ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్, ఏఎంసీ డైరెక్టర్లు నర్సింహా రెడ్డి, ఖదీర్, రాజశేఖర్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు బలవంత్ రెడ్డి పాల్గొన్నారు.

## అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** పోచారం గ్రామం నుండి జోడిమెట్లకు పోయే రోడ్లను వెంటనే పూర్తి చేయాలంటూ బిఆర్‌ఎస్ యువ నాయకుడు సామల సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో పోచారం బొడ్డురాయి నుండి డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పోచారం గ్రామ ప్రధాన రోడ్డు ఒకవైపు డ్రైనేజ్ కోసం పూర్తిగా తవ్వడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసువాలని కోరుతూ గ్రామస్తులు నాయకులు బుధవారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి వినతి ప్రత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సామల బుచ్చి రెడ్డి, ఆకిటి బాల్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, బద్దం నర్సింహరెడ్డి, ఎస్ శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, ఎస్ కొండల్ రెడ్డి, కనక చారీ, నరేష్, ఎస్ సత్తిరెడ్డి, ఎం,మహేందర్ రెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/కేశంపేట :** క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని నిర్థవెల్లి గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను సర్పంచ్ భాస్కర్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉండే యువత టోర్నమెంట్లను సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్ ఎంతో బంగారు మయంగా ఉండేందుకు అస్కారం ఉంటుందన్నారు. విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే గ్రామానికే కాకుండా పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. శారీరక, మానసిక ప్రశాంతతకు క్రీడలు ఉపయోగపడుతాయని, స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. సామాజిక నైపుణ్యాలకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని, వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి,



లింగంధాన సర్పంచ్ నాగిళ్ళ వెంకటేష్, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, వీర్లపల్లి సర్పంచ్ పాండు, భైర్‌ఖాన్‌పల్లి సర్పంచ్ తనయుడు శివా యాదవ్, తూర్పుగడ్డ సర్పంచ్ థౌర్యానాయక్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, ఆంజనేయులు యాదవ్, యాదయ్య, జంగయ్య, రాంరెడ్డి, సుదర్శన్, నాగరాజు, మురళి, పల్లటి క్రిష్ణ, సత్యనారాయణ, వార్డు సభ్యులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 'ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా నేటి నుంచి గ్రామసభలు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నేటినుంచి అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభను సమావేశపరచాలని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్ తెలిపారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా గ్రామ సభ నిర్వహణకు ప్రామాణిక నిర్వహన విధానాలు (ఎస్‌ఒపిస్), షెడ్యూల్ జారీ చేయుట గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ లను నియమించుటకు తగు సూచనలు జారీ చేశారు. ఈ విషయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల పంచాయతీ అధికారులకు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, డివిజినల్ పంచాయతీ అధికారులతోపాటు మండల ప్రత్యేక అధికారులకు ఏప్రిల్ 2 గ్రామ సభను నిర్వహణకు సంబందించిన పలు సూచనలు చేశారు. గ్రామ సభ ప్రత్యేక అధికారులు తమకి కేటాయించిన గ్రామ పంచాయతీలో గ్రామ సభ గురించి ప్రభుత్వం జారీ చేసిన ఎస్‌ఒపి ప్రకారము నిర్వహించబడే విధంగా పర్యవేక్షణ చేయాలి. గ్రామపంచాయతీ లోని అన్ని శాఖల అధికారుల సమన్వయముతో గ్రామ సభ సజావుగా జరిగేలా చూసుకోవాలని డిపిఒ సురేష్ మోహన్ ఆదేశించారు. మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజినల్ పంచాయతీ అధికారులు, గ్రామ సభల నిర్వహణపై పభుత్వం జారీ చేసిన ప్రామాణిక నిర్వహణ విధానాలు అమలు చేయాలని ఆదేశించారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం షాద్‌నగర్ ఆర్‌టిసి బస్టాండ్‌లో డిపో మేనేజర్ ఉష ఆధ్వర్యంలో మహాలక్ష్మి పథకం కింద 290కోట్ల మంది ఉచిత ప్రయాణం చేసి పదివేల కోట్ల రూపాయల ప్రయాణ చార్జీలను ఆదా చేసుకున్న శుభవేళ అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 6.91కోట్ల మంది మహిళలు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించి రూ.308.84 కోట్ల రూపాయల లబ్దిపొందారని వివరించారు. ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందడమే కాకుండా ఉపాధి, విద్య, వైద్యం వంటి రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని వివరించారు. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికే సోలాల్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసి బస్సులు అంధించడమే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పించడం జరుగుతుందని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రోత్సాహకాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అప్ప, వైస్‌చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, కౌన్సిలర్లు చాకలి పెంటయ్య, మురళీ మోహన్, బచ్చలి నరేష్, రాజునాయక్, సాధిక్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్ పాల్గొన్నారు.

‘జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్తో కలిసి నిహారిక కొణిదెల నిర్మించిన చిత్రం ‘రాకాస’. మానస శర్మ తెరకెక్కించిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు.’

# రీల్

## నాకు తెలియకుండానే ‘జీవిత’ బైక్ అమ్మేశారు : రాజశేఖర్



శర్వానంద్ , అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన రేసింగ్ డ్రామా ‘బైకర్’తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రాజశేఖర్ మీడియా చిట్ చాట్ నిర్వహించారు.

చాలా రోజుల తర్వాత నేను చేసిన సినిమా రిలీజ్ అవుతోంది. నేను బాగా ఇష్టపడి చేసిన సినిమా బైకర్. ఎప్పుడు ఏప్రిల్ 3న వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్ది చాలా ఆనందంగా ఉంది. నేను నటించిన సినిమా ఇది. నా సినిమా అనే ఎప్పుడు రిలీజ్ అవుతుంది? ఆడియన్స్ ఎంతలా మెచ్చుకుంటారు? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. నేను ఏ క్యారెక్టర్ చేసిన అది బాగుండాలి, నాకు నచ్చాలి. అప్పుడే నేను చేయగలుగుతాను. అలాగే క్యారెక్టర్ బాగుంటే సరిపోదు. సినిమా కూడా అద్భుతంగా ఆడాలి. కథ బాగుండాలి. నేను బైకర్ కథ విన్నప్పుడు నా క్యారెక్టర్, కథ రెండు నచ్చే ఈ సినిమా చేశాను. బైకర్ కథ పరంగా సూపర్‌గా హిట్ అవుతుంది. అలాగే నా క్యారెక్టర్ కూడా అద్భుతంగా వచ్చింది. సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. నేను నడిపే విధానం చూసి ‘మీరు చాలా రిస్క్‌తో నడుపుతున్నారని నాకు తెలియకుండానే జీవిత ఆ బైక్ అమ్మేశారు బైకర్‌లో నా క్యారెక్టర్ పేరు బుల్లెట్ సునీల్. ఈ క్యారెక్టర్ గురించి పూర్తి వివరాలు మీరు సినిమాలోనే చూడాలి. అభిలాష్ చాలా మంచి డైరెక్టర్. ఈ సినిమాలో నన్ను చాలా కొత్తగా చూపించారు. డైరెక్టర్ విజన్. కథ వల్లే అది సాధ్యపడింది. సినిమా చూసిన ప్రేక్షకులు కచ్చితంగా నా క్యారెక్టర్ ని అభినందిస్తారు.ఇందులో బైక్ రేసింగ్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. ఒక హాలీవుడ్ రేంజ్ సినిమాలా ఉంటుంది. అలాగే ఫాదర్ సన్ ఎమోషన్ కూడా అద్భుతంగా ఉంటుంది. చాలా సెంటిమెంట్ సీన్స్ ఉన్నాయి. కొత్త సినిమాలు రిలీజ్ అయితే నేరుగా థియేటర్స్‌కి వెళ్లి చూస్తుంటాం.

## నాకు నచ్చింది నేను చేస్తా

### నిర్మాత నిహారిక కొణిదెల



జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్తో కలిసి నిహారిక కొణిదెల నిర్మించిన చిత్రం ‘రాకాస’. మానస శర్మ తెరకెక్కించిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ మూవీని ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్ను నిర్వహించారు.ఈకార్యక్రమంలో

**నిహారిక కొణిదెల మాట్లాడుతూ**

‘మ్యాడ్ హౌస్’ అని ఓ సిరీస్ చేశాం. ఆ టైంలో మానస డైలాగ్స్ మొదటగా విన్నాను. ఆ తరువాత మానసని చూశాను. ఆమె తక్కువ మాట్లాడుతుంది. కానీ చాలా ఆలోచిస్తుంటుంది. 24 గంటలు సినిమా గురించి, కథ గురించే ఆలోచిస్తుంటుంది. మానస ఇంకా ఇంకా చాలా ఎత్తుకు వెళ్తుంది. మానస, మహేష్, యదు వంశీ వంటి వారిని ఇంట్రడ్యూస్ చేయడం నాకు గర్వంగా అనిపిస్తుంది. ‘కమిటీ కుర్రోళ్లు’ చేస్తున్నప్పుడు 11, 15 మంది కొత్త వాళ్లతో చేయడం ఎందుకు అన్నా రు?.. ‘రాకాస’ టైంలో ఇలాంటివి ఎందుకు ‘కమిటీ కుర్రోళ్లు’ లాంటి సినిమాలు చేసుకోవచ్చు కదా అని అన్నారు.. ‘బరి’ చే స్తుంటే.. ఫ్యామిలీ మెంబర్స్‌తో ఎందుకు? అని అంటున్నారు.. ఇలా అనే వాళ్లు అంటూనే ఉంటారు. నాకు నచ్చింది నేను చేస్తూనే ఉంటాను. ‘ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ’ వచ్చింది. దర్శకుడిగా మహేష్ ‘ఇట్లు అర్జున’తో బ్లాక్ బస్టర్ కొట్టబోతోన్నారు. చలికాలంలో రాత్రిపూట ఎక్కువగా షూటింగ్ చేశాం. మాకు ఈ ప్రయాణంలో సపోర్ట్ చేసిన ప్రతీ ఆర్టిస్ట్‌కి థాంక్స్. నయన్కి మంచి టాలెంట్ ఉంది. ఆమెతో పని చేయడం ఆనందంగా ఉంది. నయన్ సారిక, దర్శకురాలు మానస శర్మ, యదు వంశీ, గెటప్ శ్రీను, అనుదీప్ దేవ్, జీ స్టూడియోస్ కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ దివ్య, మైత్రిశశి, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

## ‘జెట్లీ’ ఫస్ట్ లుక్స్ పోస్టర్స్ రిలీజ్



కమెడియన్ సత్య, దర్శకుడు రితేష్ రానా ‘జెట్లీ’తో అలరించబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. రిలీజైన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ‘జెట్లీ’ ఫస్ట్ సింగిల్ సత్య ఈజ్ నాట్ జెట్లీ సాంగ్ ఏప్రిల్ 2న రిలీజ్ కానుంది. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ సత్య స్టైలిష్ అవతార్ ఆకట్టుకుంది. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వదలరా వెనుక ఉన్న మెయిన్ టీమ్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. రితేష్ రాణా స్టైల్, సిగ్నేచర్ హ్యూమర్తో పాటు హైఎనర్జీ యాక్షన్ మేలవించిన జెట్లీ ఫన్‌ప్యాక్డ్ ఎక్స్‌పిరియన్స్ అందించబోతుంది.

## అప్పుల్లో ఉన్నవారికి ధైర్యాన్నిచ్చే చిత్రం

### దర్శకుడు రామ్ చక్రి



పాత్వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ద్విభాషా చిత్రం ‘కార్మేని సెల్వం’. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయన్‌వి, హరిత పరాకోడ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కాబోతుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పివిఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రామ్ చక్రి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు ‘కార్మేని సెల్వం’ సినిమా మధ్య తరగతి జీవితంపై ఆధారపడి ఉంటుంది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ కథతో కనెక్ట్ అవుతారు. ముఖ్యంగా అప్పుల సమస్యతో బాధపడుతున్న వారికి ఈ సినిమా ఒక ధైర్యాన్ని ఇస్తుంది. మధ్య తరగతి కుటుంబాల్లో అప్పులు అనేవి కామన్‌గా ఉంటాయి. వాటి కారణంగా కుటుంబంలోని సంబంధాలు, వారు తీసుకునే నిర్ణయాలు ఎలా ప్రభావితం చేస్తాయనేది ఇందులో చూపించబోతున్నాం. చాలా రియలిస్టిక్‌గా మూవీ ఉంటుంది. సముద్రఖని గారు ఆయన పాత్రలోని ప్రతి షేడ్‌ను అద్భుతంగా పండించారు. మధ్యతరగతి భర్తగా, తండ్రిగా తనదైన ఎమోషన్‌ను పండించారు. ఆయనతోపాటు గౌతమ్ మీనన్ , లక్ష్మీ ప్రియా, అభినయ పాత్రలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. మ్యూజిక్ విషయానికొస్తే.. ఈ సినిమా కోసం మేము ఒక కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తున్నాం .‘మ్యూజిక్ యాజ్ ఎ సర్వీస్’ పేరుతో మా మ్యూజిక్ డైరెక్టర్ రామానుజన్ టీమ్ వర్క్ చేశారు. సంగీతం అనేది కేవలం మ్యూజిక్ డైరెక్టర్ లేదా సింగర్స్ కాదు.. ఇన్స్ట్రుమెంటలిస్టులు, సౌండ్ ఇంజినీర్లు, మిక్సింగ్ టీమ్, ఇంకా ఎంతో మంది టెక్నీషియన్లు కలిసి చేసే పనిగా వారు భావించారు. మా డిఒపి యువరాజ్ దక్షణ్, ఎడిటర్ జగన్‌లకు ఎంతో అనుభవం ఉంది. థియేటర్లో ఈ సినిమా విజువల్స్ చూస్తే, కథను ఎంత గ్రాండ్‌గా తీసుకెల్లామో అర్థమవుతుంది. ఇక మా ప్రొడ్యూసర్ అరుణ్ రంగరాజులుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. ఏప్రిల్ 3న ఈ సినిమాను విడుదల చేస్తున్నాము అని చెప్పారు.

## ఫ్యామిలీ అంతా కలిసి చూసే మూవీ ‘పళ్లిచట్టంబి’



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ ‘పళ్లిచట్టంబి’. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలిమ్స్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై నౌఫల్, బ్రిజీష్, చాణక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సందర్భంగా హీరో టొవినో థామస్, హీరోయిన్ కయదు లోహర్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

హీరో టొవినో థామస్ మాట్లాడుతూ దర్శకుడు డిజో నాకు చాలాకాలంగా తెలుసు. మేమిద్దరం ఒక ప్రాజెక్ట్ చేయాలని అనుకుంటూ ఉండే వాళ్లం. కొన్ని మూవీస్ కు డిస్కషన్స్ చేసుకున్నాం. అయితే అప్పటికి నాకు ఉన్న సినిమాల కారణంగా వెంటనే ఆయనతో సినిమా చేయలేకపోయాను. డిజో, నేను కలుస్తూనే ఉండేవాళ్లం. డిజో పళ్లిచట్టంబి కథ చెప్పినప్పుడు చాలా ఎగ్జాయ్‌టింగ్‌గా అనిపించింది. ఈ సినిమా చేయాలని ఫిక్స్ అయ్యాం. ఆ తర్వాత నేను కమిట్ మూవీస్ ఫినిష్ చేశాను. డిజో కూడా జనగణమన సినిమాతో పాటు మరో మూవీ రూపొందించాడు. ఆ తర్వాత ఈ సినిమా వర్క్స్ ప్రారంభించాం. కొద్ది రోజుల తర్వాత ప్రొడ్యూసర్ మారారు. మేము వేరే ప్రొడ్యూసర్స్‌ను ప్రాజెక్ట్ లోకి తీసుకున్నాం.ఈ కథ ప్రకారం హీరో బలంగా కనిపించాలి. విలన్స్‌ను విసిరిపారేసేలా ఉండాలి. అందుకే వెయిట్ పెరిగాను. అప్పటిదాకా డైటింగ్ చేసే నేను ఈ చిత్రం కోసం డైటింగ్ పక్కనపెట్టాను. హెయిర్ స్టైల్, మీస కట్టుతో ఒక మంచి లుక్‌లోకి మారాను. డిజోతో వర్క్ చేయడంలో ఎలాంటి ప్రెజర్ ఉండదు. సెట్‌లో కూల్‌గా వర్క్ చేసుకుంటూ వెళ్తాడు. ఆయనకు కోపం వస్తుందా అనేది కూడా తెలియదు. తెలుగులో ఇప్పటిదాకా చాలా మూవీస్‌కు డిస్కషన్స్ జరిగాయి. కానీ ఏదీ కన్‌ఫామ్ కాలేదు. మలయాళంలో నేను స్ట్రాంగ్ పొజిషన్ లో ఉన్నాను. అక్కడ మూవీస్ వదిలి మరో భాషకు వస్తే నన్ను నమ్ముకుని ప్రాజెక్ట్స్ చేసే వాళ్లు నష్టపోతారు. నేను తెలుగులో సినిమా చేయకున్నా తెలుగు ప్రేక్షకులు నా మలయాళ మూవీస్ చూసి ఆదరిస్తుండటం సంతోషంగా ఉంది.

## లోక్‌సభ ఆమోదం

**(మొదటి పేజీ తరువాయి)**

చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం లాంఛనమే అయ్యింది. చివర్లో ప్రసంగించిన కేంద్రమంత్రి నిత్యానందరాయ్ అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంపై సంతోషం వ్యక్తంచేశారు. ‘ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు సభ్యులందరూ సమ్మతి తెలపడం సంతోషదాయకం. ఆం ధ్రప్రదేశ్ అసెంబ్లీలో 2026 మార్చి 28న ఓ తీర్మానం చే శారు. రాష్ట్రానికి ఏకైక శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఎపి విభజన చట్టం 2014లో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీ ర్మానం చేశారు. 2024 జూన్ 2 నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా అమరావతిని పరిగణించాలని కోరుతూ తదనుగుణంగా సవరణ చేయాలని కోరారు. సభ్యులందరూ సమ్మతి తెలిపినందున బిల్లును ఆమోదించాలని సభాపతిని కోరుతున్నా’ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ అన్నారు.

**రాష్ట్రపతి ఆమోదానికి బిల్లు**

అమరావతికి చట్టబద్ధత బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరగనుంది. రాజ్యసభ కూడా ఆమోదించిన తర్వాత కేంద్ర కేబినెట్ పోస్ట్ ఫ్యాక్టో ర్యాటిఫికేషన్ చేయనుంది. అనంతరం బిల్లును కేంద్రం రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది.

## బస్‌భవన్‌లోకి వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

### ప్రభుత్వంలో విలీనం చేయకుండానే ఆర్‌టిసి ఆస్తుల దారాదత్తం: ఆర్‌టిసి ఉద్యోగులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్‌భవన్ లోని ఎ బ్లాక్‌ను రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలకు లీజు ప్రతిపాదికన అద్దెకు ఇచ్చింది. కాగా, బి బ్లాక్‌లోని ఐదు అంతస్థుల్లో టిజిఎస్‌ఆర్‌టిసి కార్యాలయ కార్యకాలపాలు యదావిధిగా కొనసాగనున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో కేంద్రం మార్గదర్శకాల ప్రకారం పదేళ్ల పాటు ఎపిఎస్‌ఆర్‌టిసికి ఎ బ్లాక్‌లోని 4 అంతస్థులను కేటాయించారు. ఆ గడువు ముగియడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సికింద్రాబాద్, పంజాగుట్ట డివిజన్లకు సంబంధించిన వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలకు బస్‌భవన్‌లోని ఎ బ్లాక్‌ను కేటాయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అద్దె భారం తగ్గించుకోవడానికి అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆర్‌టిసి సంస్థకు చెందిన కార్యాలయాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయించడం పట్ల ఆర్‌టిసి ఉద్యోగులు సైతం అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వంలో విలీనం చేయకుండానే ఆర్‌టిసి ఆస్తుల దారాదత్తం**

ఒకవైపు ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని సమ్మెకు వెళ్తుంటే తెలంగాణ రాష్ట్ర రవాణా సంస్థ (కార్పొరేషన్)కు సంబంధించిన కార్యాలయాన్ని ఇతర ప్రభుత్వ సంస్థకు ఎలా లీజుకు ఇస్తారని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయనప్పుడు ఆర్‌టిసి ఆస్తులను ప్రభుత్వానికి ఎలా దారాదత్తం చేస్తారని ఆర్‌టిసి జెఎసి నాయకులు నిలదీస్తున్నారు.

### గమనిక

బడ్జెట్ సమావేశాల సందర్భంగా తెలంగాణ శాసనసభ మొత్తం 82:47 గంటలు సమావేశమైంది. అందులో సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు వివిధ చర్చల్లో 4:22 గంటల పాటు మాట్లాడారు. అయితే, ఏప్రిల్ 1వ తేదీ పత్రికలో ‘అసెంబ్లీలో కూనంనేని 82 గంటల ప్రసంగం’ అనే శీర్షిక (12వ పేజీలో) పొరపాటుగా ప్రచురితమైంది. దానిని 4:22 గంటల ప్రసంగంగా సవరించి చదువుగోరుతున్నాము.

– ఎడిటర్




## రికార్డు స్థాయి ఆదాయం

**(మొదటి పేజీ తరువాయి)**

రూ.2,722 కోట్ల మేర పెరిగి దాదాపు 7 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఈ ఏడాది మొత్తం 382.91 లక్షల కేసుల లిక్కర్, 387.34 లక్షల కేసుల బీరు అమ్మకాలు నమోదయ్యాయి. లిక్కర్ అమ్మకాలు 2 శాతం పెరగగా, బీరు అమ్మకాలు 9శాతం తగ్గాయి. గత ఏడాది 372.25 లక్షల కేసుల లిక్కర్, 536.13 లక్షల కేసుల బీరు అమ్మకాలు నమోదయ్యాయి. నెలవారీగా చూస్తే డిసెంబర్‌లో అత్యధికంగా రూ.5,051 కోట్ల అమ్మకాలు నమోదు కాగా, మే నెలలో రూ.3,561 కోట్లు, మార్చిలో రూ.3,486 కోట్లు వసూలయ్యాయి. మొత్తం సంవత్సరానికి రూ.40,209 కోట్ల మద్యం అమ్మకాలు నమోదయ్యాయి. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 ఏ4 మద్యం దుకాణాల ద్వారా రూ.1,771కోట్ల రెంటల్ ఫీజు, 1,214 బార్ల ద్వారా రూ.549 కోట్ల ఆదాయం లభించింది. అదనంగా లైసెన్సుల కోసం వచ్చిన 95,628 దరఖాస్తుల ద్వారా రూ.2,869 కోట్ల ఆదాయం సమకూరింది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ఎక్సైజ్ ఆ దాయం నిరంతరం పెరుగుతూ వస్తోంది. 2015–16 లో రూ.12,706కోట్ల నుంచి ప్రారంభమైన ఆదాయం, ప్రతి సంవత్సరం పెరుగుతూ 2025–26 నాటికి రూ. 40,209 కోట్లకు చేరుకోవడం రాష్ట్ర ఆర్థిక వృద్ధికి సూచికగా భావిస్తున్నారు.

## పంట నష్టం

**(మొదటి పేజీ తరువాయి)**

టన్నులు కేటాయించిందని తెలిపారు. ఇందులో దేశీయంగా ఉత్పత్తి అయ్యే మొత్తం 66,700 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. ఈ కంపెనీలతో అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ కేటాయించిన యూరియా ఈ నెలలోనే రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రానున్న రెండు నెలలు కూడా నెలకు 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చేలా, కేంద్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని అదేశించారు. యూరియా డిమాండ్ అధికంగా ఉండే జూన్, జులై నెలల వరకు బఫర్ స్టాక్స్‌ను వీలైనంత అధికంగా ఉంచుకోగలిగితే యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడొచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు నేరుగా లబ్ధి చేకూరేలా అమలు విధానాన్ని మార్చడానికి సాధ్య సాధ్యాలు పరిశీలించి, ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నుండి జరిగే గ్రామసభలలో వ్యవసాయ అధికారులు పాల్గొని వ్యవసాయ యాంత్రీకరణలో రైతులకు ఉపయోగపడేవిధంగా సబ్సిడీ విధానంపై సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

**సరిపడా ఎరువులను అందించాలి**

రాబోయే రానున్న ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర కేటాయింపులకు అనుగుణంగా రాష్ట్రానికి సకాలంలో యూరియా సరఫరా చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తిచేశారు. మంగళవారం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు కార్యక్రమంలో రాష్ట్రం దేశంలోనే ముందువరుసలో ఉన్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రికి వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి ప్రశంసించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నామని, వచ్చే 3 నెలలలో రాష్ట్రవ్యాప్తంగా పూర్తి చేయనున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. రైతుల సమగ్ర డేటా నమోదు ద్వారా ప్రభుత్వ పథకాల అమలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో యూరియా లభ్యత, పంపిణీ పరిస్థితులు, యూరియా యాప్ అమలు విధానం గురించి కూడా కేంద్ర మంత్రికి వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. రైతులకు ఎలాంటి కొరత లేకుండా ఎరువులు అందించేందుకు కేంద్రరాష్ట్ర సమన్వయంతో చర్యలు కొనసాగించాలని కేంద్ర మంత్రిని కోరారు.

## నీటి ఎద్దడి రానీయొద్దు (మొదటి పేజీ తరువాయి)

మంత్రి ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి పరిస్థితిపై రోజువారీగా సమీక్ష నిర్వహించాలని, జిల్లాల వారీగా ఎన్ని గ్రామాలకు తాగు నీరు సమృద్ధిగా అందుతుంది?, తాత్కాలిక సమస్యల కారణంగా ఎన్ని గ్రామాల్లో సరఫరా లోపించింది?, ఆ సమస్యలను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారు?, అనే అంశాలపై అధికారులు ప్రతి రోజూ నివేదికను సమర్పించాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

**చేతి పంపుల పరిశీలన**

‘సమ్మర్ స్పెషల్ డ్రైవ్’లో భాగంగా మండల స్థాయిలో ప్రత్యేక అధికారులు తాగు నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లా పరిషత్ సిఇఒలు, ఎంపిడిఒలు, డిపిఒలు, చీఫ్ ఇంజనీర్లు ఫీల్డ్ స్థాయిలో పర్యటిస్తూ పనులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గ్రామాల్లో పనిచేయని చేతి పంపులను గుర్తించి, ఈ నెల 3వ తేదీలోపు వాటికి మరమ్మత్తులను పూర్తి చేసే విధంగా అధికార యంత్రాంగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. గ్రామాల్లో తాత్కాలికంగా నీటి సరఫరా లోపిస్తే, వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా అధికారుల వద్ద ఉన్న లెక్కల ప్రకారం 661 బోర్లు, 620 చేతి పంపులు పనిచేయడం లేదని గుర్తించారు.

## ఒరాకిల్ ఉద్యోగులకు ఉద్వాసన

**(మొదటి పేజీ తరువాయి)**

మంగళవారం ఉదయం ఆరు గంటల నాటికి ఉద్యోగులు ‘‘లే ఆఫ్ ఈమెయిల్స్’’ అందుకున్నారు. సీనియర్ ఉద్యోగులు ఈ పరిణామాలపై ఆన్‌లైన్‌లో పోస్టింగులు పెట్టారు. చివరి పనిదినం రోజున వారంతా ఈ లేఆఫ్ సందేశాలు అందుకున్నారు. ఉద్యోగులు తెల్లారిలేచి ఇన్‌బాక్స్‌లు తెరిచేసరికి వారికి కేవలం ఐదులైన్ల సందేశం మాత్రమే కనిపించింది. ముందుగా ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. హెచ్‌ఆర్.విభాగాల నుండి ఫోన్‌కాల్ రాలేదు. వారి మేనేజర్లతో సంభాషణలు లేవు. కేవలం ఈ–మెయిల్స్ ఇచ్చి సరిపెట్టారు. ‘‘ఒరాకిల్ ప్రస్తుత వ్యాపార అవసరాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత విస్తృత సంస్థాగత మార్పులలో భాగంగా మీ పాత్రను తొలగించాలని మేం నిర్ణయం తీసుకున్నాం,ఫలితంగా ఈ రోజే చివరి పనిదినం, ఉద్యోగాల నుండి తొలగించాం’’ అని ఒరాకిల్ నాయకత్వం నుండి ఈ మెయిల్స్ వెళ్ళాయి. కంపెనీ సిస్టమ్‌లకు యాక్సెస్‌లను నిలిపివేశారు. ఈ తర్వాత ఏం జరిగిందో ఉద్యోగులు మెల్లిగా అర్థం చేసుకోవడానికి అన్‌లైన్ ద్వారా విపరీతంగా అన్వేషణ ప్రారంభించారు. రెడ్డిట్,లింక్డ్‌ఇన్, బ్లైండ్‌లలో పోస్టింగులు వెలువెత్తాయి.

కృత్రిమ మేధ సాంకేతిక వ్యవస్థ ద్వారా మరింత సమర్థవంతంగా కార్యకలాపాలు నిర్వహించడంకోసం ఈ ఉద్యోగులను తొలగించారని భావిస్తున్నారు. ఈ పరిణామాలపై ఒరాకిల్ ఒక సీనియర్ మేనేజర్ మైఖేల్ షెపర్డ్ లింక్డ్‌ఇన్ ద్వారా స్పందిస్తూ, నైపుణ్యం లేదని, సమర్థులు కాదనే ఉద్దేశంతో ఉద్యోగులను తొలగించలేదని పేర్కొన్నారు. ఈ కోతలవల్ల ఆయన ఉద్యోగం చెక్కుచెదరలేదు. సీనియర్ ఇంజనీర్లు, ఆర్కిటెక్‌లు, ఆపరేషన్స్ లీడర్స్,ప్రోగ్రామ్ మేనేజర్స్,టెక్నికల్ స్పెషలిస్టులు ఈ కోతలవల్ల ఉద్యోగాలు కోల్పోయారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులు తమ వృత్తినైపుణ్య ప్రాతిపదికపై ఉద్యోగాలు కోల్పోలేదని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై స్పందించేందుకు ఒరాకిల్ నిరాకరించింది. ఒరాకిల్ అంతర్గతంగా కృత్రిమ మేధను ఉపయోగిస్తోంది. దీనివల్ల తక్కువమంది సిబ్బందితో చాలా ఎక్కువ పని చేయడానికి వీలు కలుగుతుందని గతంలో సంస్థ అధికారులు వ్యాఖ్యానాలు చేశారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com